శ్రీః
శ్రీమతే రామానుజాయ నమః
శ్రీమతే అప్పుళార్యాయ నమః

# భగవద్రామానుజ విరచిత శ్రీభాష్యగ్రంథము యొక్క విషయముపై వ్యాసములు

**శ్రీభాష్యసారం.**

శ్రీ ఉ వే వేళుక్కుడి వరదాచార్యస్వామివారి ఉపన్యాసాలననుసరించి
శ్రీభాష్యం శ్రీనివాసాచార్యులచేత
రచింపబడినది.

శ్రీమతేరామానుజాయనమః

## 1. ప్రణవం, శ్రీభాష్యం, శ్రీరంగవిమానం.

సకలవేదసంగ్రహమైనది తిరుమంత్రం. తిరుమంత్రానికి మూలం ప్రణవం. *"ప్రపద్యే ప్రణవాకారం భాష్యం రఙ్గవిమానం। పరస్య బ్రహ్మణో యత్ర శేషిత్వం స్ఫుటమీక్ష్యతే॥"* అని శ్రుతప్రకాశికాచార్యులవారు సాయించేరు. ఎందులో బ్రహ్మయొక్క శేషిత్వమనేది స్పష్టంగా కనబడుతుందో, అటువంటి అపరశ్రీరంగ విమానంలా ప్రణవాకారంగా ప్రకాశిస్తున్న శ్రీభాష్యాన్ని శరణంగా వరిస్తున్నాను - అని దీని అర్థం. ప్రణవాన్ని చూస్తే, శేషిత్వం తెలుస్తుంది. శ్రీభాష్యంలోకూడా శేషిత్వం ప్రకాశిస్తోంది. ప్రణవమై ఉంటేనేమి, శ్రీభాష్యమై ఉంటేనేమి శ్రీరంగవిమానమై ఉంటేనేమి, అన్నింటిలోనూ ప్రకాశించేది భగవంతుడి శేషిత్వమే అంటున్నారు శ్రుతప్రకాశికాచాభట్టరు.

***ఓం*** అనే ప్రణవంతాలూకు పరమార్థం ఏమిటి? అకారవాచ్యుడైన సర్వేశ్వరుడికి మకారవాచ్యుడైన జీవాత్మ అనన్యార్హశేషభూతుడు. ***అకారార్థో విష్ణుః జగదుదయరక్షాప్రళయకృత్ మకారార్థో జీవః తదుప కరణం వైష్ణవమిదం*** అని పరమాచార్యులు పరాశరభట్టర్ సాయించేరు. *"**అ**"*అనే అక్షరం (చతుర్థీవిభక్తితో కలిసి ఉన్నప్పుడు) శేషియైన పరమాత్మని చెప్తుంది. *"**మ**"*అనే అక్షరం భగవచ్ఛేషభూతుడైన జీవాత్మకి వాచకం. ఇలా జీవాత్మకీ, పరమాత్మకీ ఉన్న సంబంధం శేషశేషిభావం. ఈఅర్థాన్ని తెలియజేసేదిగా ఉన్న ప్రణవం లాగే శ్రీభాష్యంకూడా ఉన్నదంటున్నారు శ్రుతప్రకాశికాచార్యులవారు. ప్రణవంలో అకారం, మకారం, ఉకారం మూడూ ఉన్నాయి. శ్రీభాష్యంకూడా ***అఖిలభువనజన్మస్థేమ భఙ్గాదిలీలే*** అని అకారంతో ప్రారంభించి "***ఇతి సర్వం సమఞ్జసమ్***" అని మకారంతో పూర్తౌతోంది. మధ్యని *"**ఉక్తమ్ చ**"* అని సాయించేరు స్వామి ఎంబెరుమానార్లు.

శేషిత్వం రెండువిధాలు. అంటే, దీన్ని రెండువిధాలుగా అనుభవిస్తాం.

1. ప్రణవంలో, శ్రీభాష్యంలో ప్రకాశిస్తున్న శేషిత్వాన్ని చూసినట్లైతే, దానికి శాస్త్రపరిచయం కావాలి. కాని శాస్త్రపరిచయంలేనివాళ్ళకి కూడా, శేషిత్వం తెలుస్తుంది శ్రీరంగవిమానంలో. అందులో వేంచేసి ఉన్నవాడు పరమశేషియైన శేషశాయియైన అనంతుడిని పడకగాగల శ్రీరంగనాథుడు. శాస్త్రం చదువుకున్న వాళ్ళూ, చదువుకొననివాళ్ళూ అందరూకూడా ఆయనని సేవించి ఆయన అనుగ్రహంవల్ల (శేషత్వం అనే) స్వరూపసిద్ధిని పొంది ఉజ్జీవించవచ్చు.
2. ప్రణవమైన ఓంకారంలోనూ, శ్రీభాష్యంలోనూ ప్రకాశిస్తున్న పరమాత్మ శేషిత్వం - ఇతరులచేత కల్పించబడినటువంటి అతిశయాన్ని (పరత్వాన్ని) కలిగిఉండడం శ్రీరంగంలో ప్రకాశిస్తున్న శేషశాయిత్వం అని గమనించవచ్చు.

శ్రీవేదవ్యాసభగవానుడు సాయించిన బ్రహ్మసూత్రాలనే శారీరకమీమాంసా శాస్త్రానికి వ్యాఖ్యానంగా మనస్వామి ఎంబెరుమానార్లు సాయించిన శ్రీభాష్యాదిగ్రంథాల సారార్థాలని సంగ్రహంగా మనం అనుభవిద్దాం.

మొదట బ్రహ్మసూత్రతాత్పర్యార్థాలని కూర్చి సూత్రకారుల మనోభావాన్ని వివరించి

వేదవేదాంతాలని అనుసరించిన వేదవ్యాసుల సిద్ధాంతం ఇదే అని అరచేతిలో ఉసిరికాయలాగ శ్రీభాష్యాది గ్రంధాల్లో మనస్వామి ఎంబెరుమానార్ నిరూపించిన అర్థవిశేషాలు కొన్నింటిని ఎన్నో శీర్షికల్లో (headingsలో) అనుభవంలోకి తీసుకుందాం. దీంతో బాటు అధ్యాయ, పాద, అధికరణ, సూత్ర క్రమంలో శ్రీభాష్యసారార్థాలని అనుభవంలోకి తీసుకోవాలి. మధ్యని అక్కడక్కడ శ్రీభాష్యసారార్థాలని వివరిస్తూ, ఎంతోమంది ఉభయవేదాన్తవిద్వాంసులు అనుగ్రహించిన ఉపన్యాసాలనికూడా అనుభవంలోకి తీసుకుందాం.

## *2. వ్యాసావతార రహస్యం -- స్కాన్దపురాణ నిర్ణయం.*

వేదం మొదలైన శాస్త్రాలని బాగా పరిశీలించి చూస్తే, "శ్రీమన్నారాయణుడే పరతత్త్వం" అనీన్నీ, ఆయన కృపే పరమహితం" అనీన్నీ, "పరమపదం అనే దేశవిశేషంలో ఆసర్వేశ్వరుడిని చేరి, అనుభవించి ఆఅనుభవంవల్ల కలిగిన ప్రీతి నిలబెడితే, ఈజీవుడు చేసే పరార్థకైంకర్యమే పరమపురుషార్థం" అనీన్నీ స్పష్టం అవుతుంది.

తత్త్వహితపురుషార్థాలని ఇలా యథాతథంగా తెలుసుకొని ఆజ్ఞానానికి తగిన అనుష్ఠానం కలవాళ్ళకే మోక్షం లభిస్తుంది అంటారు వైదికులు. పురుషార్థాల్లో మోక్షం (భగవత్కైంకర్యం) విశేషమైన ఫలం. అలాగే సాధనాల్లో జ్ఞానం విశేషమైన సాధనం. జ్ఞానమార్గస్థాపనానికే భగవానుడు ఒక్కొక్క కాలవిశేషాల్లో అవతరిస్తాడంటారు పెద్దలు. ఇదే ధర్మసంస్థాపనం. ఈమార్గంలోనే శ్రీమన్నారాయణుడు వేదవ్యాసుడుగా అవతరించి జ్ఞానమార్గప్రవర్తనం చేసి ధర్మాన్ని స్థాపించేడన్నది పురాణంలో చెప్పబడింది.

భగవానుడి అవతారాలు రెండువిధాలు. ఒకటి ముఖ్యావతారం. మరొకటి గౌణావతారం. ముఖ్యావతారంలో భగవంతుడు తనకేఉండే అసాధారణమైన అప్రాకృతదివ్యమంగళవిగ్రహంతో అవతరిస్తాడు. గౌణావతారంలో ప్రాకృతశరీరంతోఉన్న జీవుడి ఒక్కొక్క కార్యవిశేషాన్నీ నిర్వహించడంకోసం ఆవేశించి (ఆజీవుడికి విశేషసాన్నిధ్యం చేసి) ఆయాకార్యాలని నడిపిస్తాడు. అది ఆవేశావతారం అనీ అంశావతారం అనీ చెప్పబడుతుంది.

ముఖ్యావతారానికి పూర్ణావతారం అనీ మరో పేరున్నది. భగవంతుడు జ్ఞానాది షాడ్గుణ్యపరిపూర్ణుడై స్వాసాధరణమైన విగ్రహంతో అవతరిస్తే, దీనికి పూర్ణావతారం అన్నపేరు వచ్చింది. ఈవిధంగా, శ్రీరామ కృష్ణావతారాలు పూర్ణావతారాలుగా చెప్పబడుతున్నాయి. శ్రీరామకృష్ణాద్యవతారాల్లో భగవంతుడు తన అనుష్ఠానముఖంగానూ, ఉపదేశముఖంగానూ సాయించిన జ్ఞానమార్గప్రతిష్ఠాపనం చరిత్రప్రసిద్ధమే అయినా, శ్రీవేదవ్యాసావతారంలోనే ఈజ్ఞానమార్గప్రతిష్ఠాపనం అనేది బాగా విశేషంగా చూడబడుతోంది.

శ్రీవేదవ్యాసుల అవతారాన్నిగురించి "నారాయణుడిదగ్గరనుంచి వచ్చిన జ్ఞానం కృతయుగంలో స్థిరంగా ఉండింది. త్రేతాయుగంలో కొంచెం మార్పుచెందింది. ద్వాపరయుగంలో చెదిరిపోయింది.

గౌతముడి శాపంవల్ల జ్ఞానం అనేది అజ్ఞానభావాన్ని పొందగా, తత్త్వనిశ్చయంలేకపోవడంవల్ల సంకీర్ణబుద్ధి యుక్తులైన బ్రహ్మ, శివుడు, మొదలైన దేవతలు, రక్షణసమర్థుడూ, దోషాలులేనవాడూ అయిన నారాయణుడిని శరణు పొందేరు. అప్పుడు ఆరుగుణాలుగలవాడూ, మహాయోగీ అయిన పురుషోత్తముడు శ్రీపరాశరులకి, సత్యవతిదగ్గర అవతరించేడు. భగవంతుడు తనే వ్యాసరూపిగా అవతరించి చెదిరిపోయిన వేదాల్ని ఉద్ధరించేడు. వాటిని నాలుగుభాగాలుగా విభజించివాటి అర్థాలని నిశ్చయించడానికి బ్రహ్మసూత్రాలని కటాక్షించేడు అని స్కాందపురాణంలోచెప్పబడిఉంది. దీన్ని కొంచెం వివరించుకుందాం.

సృష్ట్యాదిలో భగవంతుడు చేతనులకి కరణకళేబరాలనిచ్చి, ప్రవృత్తి నివృత్తి శక్తులనీ ఇవ్వడం ప్రదీపమైన (దీపంవంటి) కళలని (శాస్త్రాలని) ఇచ్చి జ్ఞానమార్గాన్ని ప్రవర్తింపించేడు. జ్ఞానమార్గం కృత యుగంలో స్థిరంగా ఉండి, త్రేతాయుగంలో కొంచెంమార్పు చెందీ, ద్వాపరయుగంలో నశించడం ప్రారంభ మైంది. అప్పుడు బ్రహ్మదిదేవతలు భగవంతుడిని ప్రార్థిస్తే, ఆయనకూడా అంగీకరించి సత్యవతికీ శ్రీపరాశర మహర్షికీ కుమారుడుగా అవతరించేడు. ఈయనే శ్రీవేదవ్యాసభగవానుడు. శ్రీవేదవ్యాసులు వేదాలని ఋగాదిభేదంవల్ల విడదీసేరు. బ్రహ్మభాగంతాలూకు అర్థాలని న్యాయమార్గంలో విచారించి తీర్మానించి బ్రహ్మసూత్రముఖంగా ప్రకాశింపజేసేరు.

### *3. వ్యాసావతారరహస్యం - మహాచార్యుల వాక్కు.*

చోళసింహపురం దొడ్డయాచార్యస్వామి అనే మహాచార్యులు బ్రహ్మసూత్రవ్యాఖ్యానంగా "పారాశర్య విజయం" అనే అత్యద్భుతమైన ఒకగ్రంథం సాయించేరు. ఈగ్రంథప్రారంభంలో ఒకవర్ణనం చేసేరు.

*వేదాపహారిణం దైత్యం మీనరూపీ నిరాకరోత్।*

*తదర్థాపహారిణస్సర్వాన్ వ్యాసరూపీ మహేశ్వరః॥*

అనే ఈశ్లోకానికి భావం - ఎంబెరుమానుడు మత్స్యావతారం ఎత్తేడు. అదే ఎంబెరుమానుడు వ్యాసావతారం కూడా ఎత్తేడు. భగవానుడి ఒకఅవతారం మీనావతారం. ఆభగవానుడి మరో అవతారం వ్యాసావతారం. వేదా పహారం చేసేడు సోమకుడనే ఒక రాక్షసుడు. వాడిని అంతంచేసి పరమప్రమాణమైన వేదాన్ని తిరిగి తీసుకు రావడానికి ఏర్పాటైంది మత్స్యావతారం. వేదార్థాలని మార్చేసీ, విపరీతంగానూ, చెప్పేవాళ్ళు వేదబాహ్య కుదృష్టులు. వాళ్ళ మతాలని బాగా ఖండించి - ఇదే వేదాంతార్థం, ఇదే వైదికమైన మతం. ఇదే సత్త్వాదం అని, యథార్థమైన వేదాంతార్థాలని సిద్ధాంతీకరణం చెయ్యడంకోసం ఎంబెరుమానుడెత్తేడు వ్యాసావతారం.

ఈనిజాన్ని - అంటే భగవంతుడి అవతారమే వ్యాసావతారం - అనేదాన్ని శ్రీవేదవ్యాసులవారి తండ్రిగారైన శ్రీపరాశరభగవానుడే వర్ణించేరు. "మహాభారతాన్ని కటాక్షించేరు, శారీరకశాస్త్రమైన బ్రహ్మ మీమాంసాశాస్త్రాన్నీ కటాక్షించేరు. ఆయన శ్రీమన్నారాయణుడి అంశావతారంకానివారైతే, ఈకార్యాన్ని చెయ్యడం సాధ్యమా?" అని శ్రీవేదవ్యాసులవారి తండ్రిగారే సాయించినట్లుగా చూస్తున్నాం. ***కోహ్యన్యో భువి మైత్రేయ - మహాభారతకృద్భవేత్*** అన్న శ్లోకాన్ని చూడండి.

### 4. శ్రీవేదవ్యాసులవారు చేసిన మహోపకారాలు

శారీరకశాస్త్రమైన అమృతాన్ని ఇవ్వడానికి ముందర శ్రీవేదవ్యాసులవారు ఎన్నో కార్యాలని మన కోసం చేసేరు. అంటే మొదట్లో వేదాన్ని విభజించేరు. ఋగ్వేదంగానూ, యజుర్వేదంగానూ, సామవేదంగానూ, అధర్వణవేదంగానూ ఇలా వేదాన్ని విభాగంచేసి ఉండడంవల్లే వారికి వేదవ్యాసులు అనే పేరు వచ్చింది. వేదాన్ని విభజించి ఇచ్చినవారు వేదవ్యాసులు అన్నమాట.

ఇదిమాత్రమే కాకుండా తాము విభజించి ఇచ్చిన వేదాలకి శాఖావిభాగంకూడా చేసేరు. ఋగ్వేదానికి 24 శాఖలుగాను, యజుర్వేదానికి 101శాఖలుగాను, సామవేదానికి 1000శాఖలుగాను , అధర్వణవేదానికి 12శాఖలుగా శాఖావిభాగం చేసేరు. వేదంలో ఒకభాగాన్ని అధ్యయనం చేసిన అధికారికి బ్రహ్మసూత్రాలవల్ల అర్థనిశ్చయం జరిగినా, అనధీతవేదభాగాల అర్థాలతోబాటు అధీతవేదభాగాల అర్థాలని సమన్వయం చేయాల్సిన అవసరం ఉండడంవల్లనూ, *"అనంతా వై వేదాః"* అని చెప్పినట్టు సకలవేదాలూ ఈచేతనుడివల్ల అధికరింపబడలేవు గనుకనూ, అన్నివేదాలనీ, వాటిఅర్థాలనీ సాక్షాత్కరించుకున్న శ్రీవేదవ్యాసులవారు అందరూ సకలార్థాలనీ సులభంగా తెలుసుకొనేట్టుగా ఐదోవేదం అని ప్రసిద్ధి చెందిన మహాభారతాన్ని సాయించేరు. ఇవి వ్యాసులవారు మనకి చేసిన మహోపకారాలు.

## 5. వ్యాససిద్ధాన్త మార్తాణ్డం.

వేదాల్లో జగత్కారణవస్తువే ధ్యేయం, శరణ్యం అనే నియమం చూపబడింది. భక్తికావచ్చు, ప్రపత్తి కావచ్చు, అవి జగత్కారణుడిగురించే అనుష్ఠింపబడవలసినవి అనేదే వేదాంతసిద్ధాంతం. బ్రహ్మకార్యమైన జీవాత్మ తనతోసమానమైన మరోసంసారిని శరణ్యంగా ఆశ్రయించడం కుదరనే కుదరదు. అంతేకాకుండా ఓటిపడవని ఆశ్రయించడమే అవుతుంది. *తాపత్రయాతురైః అమృతత్వాయ స ఏవ జిజ్ఞాస్యః* అనే శ్రీభాష్య శ్రీసూక్తిప్రకారం కారణబ్రహ్మమే ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అనే మూడురకాల తాపాలచేతా బాధింపబడుతున్న సంసారులకి జిజ్ఞాస్యం, ఉపాస్యం, శరణ్యం అని సిద్ధాంతితం. ***కారణంతు ధ్యేయః*** కారణవస్తువే ధ్యానింపతగినది, ***యో బ్రహ్మాణం విదధాతి పూర్వం ... ... ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే*** బ్రహ్మని సృష్టించిన కారణవస్తువుని ముముక్షువైననేను శరణం పొందుతున్నాననిగదా వేదాంత ఘోష.

ఇక ఈసిద్ధాంతాన్ని బ్రహ్మమీమాంసాముఖంగా శ్రీవేదవ్యాసులవారు ఎలా చూపించేరో చూద్దాం.

1. శారీరకంలో శ్రీవేదవ్యాసులవారు చతుస్సూత్రి అనే ఉపోద్ఘాతం తర్వాత శాస్త్రారంభంలో పరమాత్మ జగత్కారణభూతుడు అచిద్విలక్షణుడు అని పూర్తి చేసేరు. ఆఅధికరణంలో ***తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్*** - ఆయనే ఉపాయభూతుడు అని నిశ్చయం చేసేరు. జగత్కారణాన్నేగదా మోక్షోపాయంగా వేదాంతం కొసకి చెప్పింది! తర్వాతి ఆనందమయాధికరణంలో అతడే పరమప్రాప్యభూతుడు అనీ, అతను సంసారివిలక్షణుడు అనిన్నీ, ముక్తవిలక్షణుడు అనిన్నీ, ***ఆనన్దమయ అభ్యాసాత్, కామాచ్చ నానుమానాపేక్షా, నేతరోపపత్తేః, భేదవ్యపదేశాచ్చ*** అనే సూత్రాల్లో నిశ్చయించేరు. వీటి వివరణమే మిగతా 149 అధికరణాల్లో ఉన్నది. ఇలా భగవంతుడు జగత్కారణభూతుడు, ఉపాయోపేయభూతుడు,

ప్రకృతిపురుషవిలక్షణుడు, దివ్యమంగళవిగ్రహవిశిష్టుడు అని వ్యాససిద్ధాంతం స్పష్టం అవుతోంది.

2. సకలవేదసంగ్రహమైన తిరుమంత్రంలో పదత్రయంవల్ల జీవాత్మల అనన్యార్హశేషత్వ, అనన్యశరణత్వ, అనన్యభోగ్యత్వరూప ఆకారత్రయం శాబ్దంగా ప్రతిపాదితం. పరమాత్మయొక్క శేషిత్వ శరణ్యత్వ ప్రాప్యత్వాలనే ఆకారత్రయం ఆర్థంగా లభిస్తాయి. శ్రీవేదవ్యాసులవారు అధ్యాయచతుష్టయాత్మకమైన శారీరకమీమాంసాశాస్త్రంలో మొదటి రెండధ్యాయాల్లో పరబ్రహ్మాన్ని జగదేకకారణంగానూ, చేతనాచేతనవిలక్షణుడిగానూ,సర్వశేషిగానూ చూపించేరు. ఇదే ప్రణవార్థనిరూపణం. మూడో అధ్యాయంలో బ్రహ్మం ఉపాస్యం అని నిశ్చయించేరు. ఇదే నమశ్శబ్దార్థనిరూపణం. నాలుగో అధ్యాయంలో బ్రహ్మం ప్రాప్యం అని నిశ్చయం చేసేరు. ఇదే తృతీయపదార్థనిరూపణం. కారణత్వం, అబాధ్యత్వం, ఉపాయత్వం, ఉపేయత్వమే గదా అధ్యాయచతుష్టయార్థం.

3. శ్రీవేదవ్యాసులవారు విశిష్టాద్వైతసిద్ధాంతమే తమసిద్ధాంతం అని నిశ్చయించేరన్నవిషయం ఇక నిరూపించబడుతోంది.

సూక్ష్మచేతనాచేతనవిశిష్టబ్రహ్మం కారణమై, కారణకార్యాలైన విశిష్టబ్రహ్మాలకి ఐక్యంచెప్పడం విశిష్టాద్వైతసిద్ధాంతం. కారణకార్యాలకి నామభేదం, ఆకారభేదం, వ్యాపారభేదం ఉన్నప్పటికీ, వస్తుభేదం లేదు. కార్యకారణాలకి అనన్యత్వమే అనే సత్కార్యవాదాన్ని శ్రీవేదవ్యాసులవారు **తదనన్యత్వమ్** అని ఆరమ్భణాధికరణంలో స్థాపించి అసత్కార్యవాదమైన వైశేషికమతాన్ని ఖండించేరు. పరమాత్మ తాను నిర్వికారుడై, తనశరీరభూతమైన చేతనాచేతనమాత్రంలో సంకోచవికాసాలనే వికారాలని పుట్టించేడనడానికి ఉపనిషత్తులో ***యథోర్ణనాభి స్సృజతే*** అని ఉన్న సాలెపురుగుని దృష్టాంతంగా చూపించేరు.

తత్త్వత్రయంలో పిళ్ళైలోకాచార్యులవారు కూడా "***ఇవన్దానేజగత్తాయ్ పరిణమిక్కైయాల్ ఉపాదానముమాయ్ ఇరుక్కుమ్. ఆనాల్ నిర్వికారన్ ఎన్నుమ్బడి యెన్నెన్నిల్ - స్వరూపత్తుక్కు వికారం ఇల్లామైయాలే. ఆనాల్ పరిణామం ఉణ్డాగుమ్బడి ఎన్? ఎన్నిల్ - విశిష్టవిశేషణ సద్వారకమాగ, ఒరు చిలన్దిక్కుణ్డాన స్వభావం సర్వశక్తిక్కు కూడాదొళ్ళియాదిఱే*** - ఇతనే జగత్తుగా పరిణమించడంవల్ల ఉపాదానంకూడా అయి ఉంటాడు. కాని నిర్వికారుడు అని ఎలా అంటారంటే, స్వరూపానికి వికారం లేకపోవడంవల్లనే. అయితే పరిణామం ఎలా కుదురుతుంది అంటే, విశిష్టవిశేషణంద్వారా. ఒక సాలెపురుగుకి ఉండే స్వభావం, సర్వశక్తికి ఉండకపోదుగదా! - అని సాయించేరు. తిరుమళ్ళిశైప్పిరాన్ ***కడల్ తన్నుళ్ళే తిరైత్తెழுన్దు అడఙ్గుగిన్ద*** అని సముద్రాన్ని దృష్టాంతంగా సాయించేరు. శ్రీపరాశరభట్టర్ "***అనుశిఖినీ శిఖీవ***" అని మగనెమలిని దృష్టాంతంగా సాయించేరు. మొదటధ్యాయంలో ప్రకృత్యధికరణంలో శ్రీవేదవ్యాసులవారు బ్రహ్మంతాలూకు అభిన్ననిమిత్తోపాదానత్వాన్ని సిద్ధాంతీకరించేరుగదా! పైగా జీవవాచిశబ్దానికి పరమాత్మ పరత్వాన్ని నిరూపించినప్పుడు ఆశ్మరథ్యమతాన్నీ, ఔడులోమిమతాన్నీ పూర్వపక్షంగా చూపించి, కాశకృత్స్నమతాన్నే స్వసిద్ధాంతంగా శ్రీవేదవ్యాసులవారు వాక్యాన్వయాధికరణంలో చూపించేరు.

కాశకృత్స్నమతాన్ని ఆశ్మరథ్య,ఔడులోమి మతాలకి ముందరే చెప్పడంవల్లనూ, కాశకృత్స్న మతం

కంటే మరొక మేలైనమతాన్ని చెప్పకపోడంవల్లనూ కాశకృత్స్నమతమే శ్రీవేదవ్యాసమతంగా శ్రీభాష్య శ్రుతప్రకాశికల్లో చెప్పబడింది. శరీరాత్మభావంవల్ల జీవవాచిశబ్దం పరమాత్మపరం అనేగదా కాశకృత్స్నమతం. ఇదే విశిష్టాద్వైతమతం. ఇదే శ్రీవ్యాససమ్మతమైంది. మరొకమతంకంటే స్వమతం విలక్షణంగనుక, శ్రీవేద వ్యాసులవారు అలాంటిచోట్ల "బాదరాయణః" అని స్వనామాన్ని నియమంగా నిర్దేశించేరు. ఋష్యంతరమతం స్వసమ్మతంగనుక, అక్కడ స్వనామనిర్దేశం వ్యాసులవారు చెయ్యలేదు. పైగా ఏది సిద్ధాంతమో దాన్ని చరమంగా చూపిస్తారన్నదికూడా శారీరకమీమాంసాప్రసిద్ధం. కనుక, కాశకృత్స్నమతమే వ్యాససమ్మతం అని నిర్ధారణైంది.

ఇంకా, విశిష్టాద్వైతసిద్ధాంతప్రధానప్రమేయమైన బ్రహ్మసగుణత్వాన్నీ, జీవపరపారమార్థిక భేదాన్నీ, ధర్మధర్మిభేదాన్నీ, జీవాత్మకే అజ్ఞానసంబంధం అనిన్నీ, జీవాత్మకి జ్ఞానసంకోచవికాసాలే సంసారమోక్షాలనీ, జీవకర్తృకపరమాత్మోపాసనమే మోక్షసాధనం అనిన్నీ, పరమాత్మానుగ్రహంచేతనే జీవుడికి మోక్షం అనిన్నీ, అదికూడా అర్చిరాదిమార్గంద్వారా దేశవిశేషప్రాప్తిపూర్వక స్వస్వరూపావిర్భావపూర్వక పరిపూర్ణబ్రహ్మను- భవం అన్నదాన్నీ, అక్కడనించి వెనక్కి రావడంలేదనిన్నీ శ్రీవేదవ్యాసులవారు శారీరకమీమాంసాశాస్త్రంలో ఎన్నోచోట్ల నిరూపించి ఉండడంచేత శ్రీవ్యాససమ్మతం విశిష్టాద్వైతమే అన్నది స్పష్టం.

"బ్రహ్మ నిర్గుణం, అజ్ఞానం బ్రహ్మనిష్ఠం, సంసారమోక్షాలు బ్రహ్మనికి, ఐక్యజ్ఞానమే మోక్షహేతువు, ఇక్కడే ముక్తిఅవుతుంది, ఐక్యాపత్తి మోక్షం" అనిగదా మృషావాదులమతం! ఇది శ్రీవేదవ్యాససమ్మతంగాదు. ఇలా ఇది శారీరకమీమాంసా శాస్త్రమైన బ్రహ్మసూత్రఅధ్యాయచతుష్టయంలో అంతర్గతంకాదు ఉత్సూత్రం అని స్థాపితం.

జగత్కారణమైన బ్రహ్మన్ని ఉపాసించినవాడు భగవదనుగ్రహంచేత అపునరావృత్తలక్షణమోక్షాన్ని పొంది, పరిపూర్ణబ్రహ్మనుభవంచేసి, ఆనందమయుడితో భోగమాత్రంలో పరమసామ్యాన్నిపొందుతున్నాడు అని శ్రీవేదవ్యాసులవారు నాలుగధ్యాయాలున్న శారీరకమీమాంసాశాస్త్రంలో నిర్ధారణచేసేరుగనుక, పరుడితో జీవుడికి స్వరూపైక్యాపత్తే మోక్షం అనేవాళ్ళవాదం బ్రహ్మసూత్రాలకి బాహ్యమైనదన్నమాట.

ఈవేదాంతసిద్ధాంతాన్ని లోకంలో స్థాపించడానికే శ్రీవేదవ్యాసులవారి అవతారం. శ్రీవేదవ్యాసుల వారి మనోభావాలననుసరించి ఈసిద్ధాంతాన్ని మన స్వామి ఎంబెరుమానారులు తమ శ్రీభాష్యాదిగ్రంథాల్లో స్పష్టంగా సాయించేరు. ఇక్కడ సంగ్రహంగా నిరూపించబడిన విషయాలని ఇకమీదట ఎన్నో sub- headingsలో విస్తృతంగా అనుభవిద్దాం.

### 6. *శారీరకశాస్త్రం అంటే ఏమిటి? దాని గొప్పతనం ఏమిటి?*

మహానందంలేకుండా యథార్థజ్ఞానం ఉండదు. అంటే తత్త్వజ్ఞానం దీన్ని పొందడానికి మనకి

కారుణికుడైన సర్వేశ్వరుడు ఎన్నో శాస్త్రాలని ఉపకరించేడు. దీన్నిబట్టే ఈయనని "పిరాన్ - ఉపకారకుడు" అని పూర్వాచార్యులు ప్రశంసించేరు. భగవానుడు ప్రసాదించిన శాస్త్రాల్లో శ్రేష్ఠతమమైనది శారీరకం అనేది. శ్రీమన్నారాయణుడే వేదవ్యాసుడిగా అవతరించి బ్రహ్మసూత్రగ్రంధాన్ని సాయించేరని పురాణం చెప్తోంది. ఇదే శారీరకం అనీ, బ్రహ్మమీమాంస అనీ, ఉత్తరమీమాంస అనీ ప్రసిద్ధి కలిగినది. జగత్తునే తనకి శరీరంగా గలవాడు భగవానుడు. అంచేత ఆయన శరీరుడు అనబడుతున్నాడు. శరీరుడినిగురించి చెప్పే శాస్త్రం శారీరకం అనబడుతుంది. *"తస్యైష ఏవ శరీర ఆత్మా"* అనీ, *"యస్యాత్మా శరీరం యస్య పృథివీ శరీరం ఏష సర్వభూతాంతరాత్మా ... నారాయణః"* అని వేదాంతాల్లో పరమాత్మని శరీరుడుగా చెప్పబడిఉంది. *"జగత్సర్వం శరీరం తే"* అని శ్రీరామాయణవచనం. *"ఈశ్వరః వ్యష్టి సమష్టి రూపః"* అని శ్రీపరాశర భగవానుడున్నూ, *"ఉడన్మిశై ఉయిరెనక్కరన్దెఙ్గుమ్ పరన్దుళన్"* అని శ్రీనమ్మాళ్వారున్నూ, *"యదణ్డం పరాత్పరం బ్రహ్మ తే విభూతయః"* అని శ్రీఆళవన్దారున్నూ సాయించేరు. పరమాత్మకి చేతనాచేతనాత్మకమైన జగత్తు శరీరంగనుకనే శరీరప్రతిసంబంధైన - ఆత్మ అయిన పరుడు శరీరుడు అనబడుతున్నాడు. ఆయనని తెలిపే శాస్త్రంగనుక బ్రహ్మమీమాంసా శాస్త్రం శారీరకం అని పిలువబడుతోంది. శ్రీబోధాయన మహర్షికూడా *"సంహితం ఏతత్ శారీరకమ్"* అని సాయించేరు.

శ్రీవేదవ్యాసులవారు ఉపనిషత్తులనే సముద్రాన్ని చిలికి శారీరకమైన అమృతాన్ని తీసి దాసులకి ఇచ్చేరు. ఇది ఆత్మక్షేమంకరమైన అమృతమౌతుంది. ఇదే దీనికి గొప్పదనం. మన స్వామి ఎంబెరుమానార్లు *"పారాశర్య వచస్సుధాం ఉపనిషద్దుగ్ధాబ్ధిమధ్యోద్ధృతాం"* అని దీన్నే స్పష్టంగా సాయించేరు. దీన్ని గురించి కొంచె వివరించుకుందాం.

శ్రీమద్రామానుజులు శ్రీభాష్యంలో మొదట *"అఖిలభువనక్షేమభఙ్గాదిలీలే"* అని మొదలయే మంగళ శ్లోకాన్ని తిరువేంగడముడైయానైన శ్రీనివాసుల విషయంగా సాయించేరు. తర్వాత గురువందనంగా ఆచార్యులైన శ్రీవేదవ్యాసులవారినిగురించి వర్ణించేరు.

*పారాశర్యవచస్సుదాం ఉపనిషద్దుగ్ధాబ్ధి మధ్యోద్ధృతాం,*
*సంసారాగ్ని విదీపనవ్యాపగతప్రాణాత్మసఞ్జీవనీం।*
*పూర్వాచార్యసురక్షితాం బహుమతివ్యాఘాతదూరస్థితాం*
*ఆనీతాంతు నిజాక్షరైః సుమనసో భౌమాః పిబన్తు అన్వహమ్॥*

అని శ్లోకం. *"పారాశర్యవచస్సుధాం"* - శ్రీ వేదవ్యాసులవారు పరాశరులకీ సత్యవతికీ కుమారులుగా అవతరించేరుగనుక *"పారాశర్యులు"* అనబడుతున్నారు. వారు కటాక్షించిన ఈబ్రహ్మమీమాంసా శాస్త్రాన్ని వర్ణించేటప్పుడు స్వామి ఎంబెరుమానార్లు *పారాశర్యవచస్సుధాం* అని పారాశర్యులనే పేరుపెట్టి వర్ణించేరు. ఇలాంటప్పుడు పరాశరులకి కుమారులుగా పుట్టినందువల్ల కలిగిన గొప్పతనం మనస్సులో ఉంచుకొని *"స హోవాచ వ్యాసః పారాశర్యః"* (పరాశరుల పుత్రులైన ఆవ్యాసులవారు చెప్పేరు) అని వేదంలోనే శ్రీవేదవ్యాసులవారి గొప్పదనం చెప్పబడిందన్నవిషయం మనస్సులోనుంచుకొన్న స్వామి ఇలా సాయించేరని పూర్వాచార్యుల వ్యాఖ్యానం. పరాశరులని ఋషి అని ప్రశంసిస్తే వీరిని పరమఋషి

అని ప్రశంసించాలి. అటువంటి గొప్పదనం ఉన్నది శ్రీవేదవ్యాసులవారికి.

ఒక చిన్న అగ్గిపుల్లతో వెలిగించిన దివిటీ పెద్దదిగా వెలుగుతూండడం చూస్తున్నాం. "**దీపంనుంచి ఉత్పన్నమైన ప్రదీపంలాగ**" అంటారు మన పూర్వాచార్యులు. ఈవిధంగా తండ్రిగారిపేరుతో శ్రీవేదవ్యాసులవారిని చెప్పడానికి మరోవిధంగాకూడా ఒక అభిప్రాయాన్ని మనపూర్వులు సాయించేరు. వారికంటే అధికమైన గొప్పతనాన్ని సృష్టించేరు శ్రీవేదవ్యాసులవారు అన్న అర్థం వచ్చేటట్లుగా స్వామి ఇలా సాయించేరని వ్యాఖ్యానం.

ఇక్కడ పరాశరుల గొప్పదనం ఏమిటి? అని చూడాలి. దీన్నికూడా మన పూర్వాచార్యులు అత్యద్భుతంగా వివరించేరు. పరాశరులు పరాశరులని పిలవబడడానికీ, నమ్మాళ్వారు పరాంకుశులు అని పిలవబడడానికీ కారణం ఒకటే అంటారు. అంటే పరులని హింసించేవారు శ్రీవిష్ణుపురాణాన్నిసాయించిన పరాశరులనిన్నీ, తిరువాయ్మొళ్ళిని సాయించినవారు పరాంకుశులనిన్నీ, అర్థం. వేదబాహ్యులైతేనేమి, వేదకుదృష్టులైతేనేమి, ఇటువంటి పరులకి (మతాంతరస్థులకి) అంకుశాన్ని పొడిచిన పెద్దలు వీరైనారు. పరమవైదికులవడంవల్ల, వేదవిరుద్ధంగా ఎవరైనా ఏఅర్థాన్నైనా చెప్తే దానిని సహించలేరు వీరు. ఇదే వీరి గొప్పదనం. ఇలా పరులని హింసించడమే పనిగా వేదాన్నీ, వేదసిద్ధాంతాలనీ రక్షించేవాళ్ళుగా వీళ్ళు ఉండడంవల్ల వీళ్ళకి ఈపేర్లే నిరూపకాలుగా సరిపోయిఉన్నాయి. అలా ఇటువంటి గొప్పదనం కలిగిన వారి కుమారుడు అనే భావం తోచేటట్టు పారాశర్యులు అని ఎంబెరుమానార్లు సాయించేరని ఒకవ్యాఖ్యానం. వారికి కుమారులుగా జన్మించడంవల్లనే వారిలాగే వీరుకూడా తమ తండ్రిగారిననుసరించి వేదవేదాన్తవిచారంలో ప్రవేశించి అనేకములైన వేదబాహ్యకుదృష్టిమతాలని తన సూత్రప్రబంధంతో హింసించి నశింపజేసేరనే గొప్పదనం పొందినవారు శ్రీ వేదవ్యాసులవారు.

ఇటువంటి గొప్పదనంగల వీరు సాయించిన బ్రహ్మసూత్రాన్ని "*పారాశర్యవచస్సుధామ్*" అని ప్రారంభించిన శ్రీసూక్తివల్ల "**అమృతం**" అని ప్రశంసిస్తున్నారు స్వామి ఎంబెరుమానార్లు. ఈఅమృతానికి గొప్పతనం ఏమిటంటే, సంసారనివర్తకమై ఉండడం అనే స్వామివారి భావాన్ని వివరించేరు మన పూర్వాచార్యులు. వఙ్గక్కడల్ - దీన్ని మధించేరు పెరుమాళ్ళు. అలలతోనున్నసముద్రాన్ని చిలికి పరమశివుడికి విషాన్నిచ్చేరు. దేవతలకి అమృతాన్నిచ్చేరు. "అమృతంలో వచ్చే స్త్రీరత్నాన్ని" తాను పొంది మాధవుడైనాడు. భగవానుడు సముద్రాన్ని మధించినప్పుడు దేవతలకిచ్చిన అమృతం బంధకమైనదీ, సంసారవర్ధకమైనదీ. కాని ఆసర్వేశ్వరుడే శ్రీవేదవ్యాసులవారిగా అవతరించి ప్రసాదించిన ఈ "***పారాశర్య వచస్సుధ***" అనబడే అమృతం సంసారనివర్తకమైనదనేదే ఈశారీరకశాస్త్రానికి గొప్పదనం.

మొదట సూత్రం అంటే ఏమిటనేదాన్ని చూద్దాం. ఏసూత్రమైఉన్నా దాని శబ్దశరీరం చిన్నదిగా ఉన్నా, ఎన్నోఅర్థాలని అది సూచనం చెయ్యడంవల్ల దానికి సూత్రం అని పేరు. ఈవిషయాన్నే "*సూచనాత్ సూత్రం*" అని పెద్దలు చూపించేరు. తిరుక్కురళ్‌కి "*కడుగై తుళైత్తు కడలేళ్ళుప్పుగుత్తి కుఱుగత్తరిత్త కుఱళ్*" - ఆవగించని దొల్చి, సప్తసముద్రాలనీ దూర్చి ఈమొత్తాన్ని చిన్నదిగా చేస్తే వచ్చినది సూక్తి -అని ఈగొప్పదనం చూపించబడుతోంది. అయినా తిరుక్కురళ్ శరీరంకంటే, బ్రహ్మసూత్రశరీరం చాలా గొప్పది,

చిన్నది. ఇందులో ఎన్నో అర్థాలు ఇమడ్చబడి ఉండడం చాలా ఆశ్చర్యకరమైనది. సూత్రశబ్దానికి పైగా చాలా అందంగా ఒక అర్థం *"వేదాంతార్థకుసుమగ్రథనార్థత్వాత్ సూత్రమ్"* అని చూపించేరు. అందమైన పుష్పాలని సూత్రంతో (తాడుతో) గుచ్చినట్లుగా వేదాంతార్థాలనే పుష్పాలని బ్రహ్మసూత్రాలనే సూత్రంతో గుచ్చడంవల్ల వాటికి బ్రహ్మసూత్రాలని పేరు అన్నది వెనకచెప్పిన వాక్యానికి అర్థం.

దీనికి మరోవిధంగాకూడా గొప్పతనం చెప్పబడుతోంది. ఇది స్కాన్దపురాణంలో చెప్పబడిన విషయం. *"అల్పాక్షరం అసందిగ్ధం సారవత్ విశ్వతోముఖం। అస్తోభం అనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః॥ నిర్విశేషిత సూత్రత్వం బ్రహ్మసూత్రస్య చాప్యతః। సవిశేషాణి సూత్రాణి హ్యపరాణి విదోవిదుః॥ ముఖ్యస్య నిర్విశేషేణ శబ్దోऽన్యేషాం విశేషతః..."* అని వచనం. అంటే బ్రహ్మసూత్రాలకి సూత్రలక్షణాలు అమిరి ఉన్నాయనిన్నీ, ఇదొక్కదానికే ఇటువంటిలక్షణాలు ప్రత్యేకంగా అమిరి ఉంటున్నాయనిన్నీ, ఈకారణంవల్ల వీటినే సూత్రశబ్దంతో వ్యవహరించడం తగిఉంటుందనీ, మిగతాసూత్రాలు సవిశేషాలే అని తెలుసుకోవడం బుద్ధిమంతుల లక్షణం అనిన్నీ చెప్పబడింది.

ఈలక్షణాలన్నవి ఏమిటంటే, 1. పరిమితమైన అక్షరాలు కలిగి ఉండడం, 2. సందేహాన్ని ఛేదించే గుణం కలిగి ఉండడం, 3. సారభూతంగా అమరి ఉండడం, 4. ఎలాకావాలంటే అలా ప్రవర్తించగలశక్తి కలిగి ఉండడం, 5. నిరర్థకమైన శబ్దాలు లేకుండా ఉండడం, 6. దోషరహితమైన శబ్దజాలాన్ని కలిగిఉండడం. ఇలా ఈలక్షణాలన్నీ చక్కగా అమిరి ఉండడమే సూత్రం అనిపించుకోవడం అవుతుంది. శ్రుతప్రకాశికలో ఈఅర్థాలన్నీ చూపబడి ఉన్నాయి.

బ్రహ్మసూత్రగ్రంథం స్వతంత్రగ్రంథం కాదు. అంటే ఎలా వేదాంతవాక్యాలని ఆధారంగా చేసుకొని భగవంతుడు గీతాశాస్త్రాన్ని సాయించేడో, అలాగే వేదాంతవాక్యాలే బ్రహ్మసూత్రాలకి మూలభూతమై ఉన్నాయి అనితెలుసుకోవాలి. నమ్మాళ్వారు సాయించిన దివ్యప్రబంధాలన్నీ రహస్యత్రయాన్ని ఆధారంగా కలిగినవే. శ్రీవచనభూషణానికి మూలభూతమై ఉన్నది ద్వయం. శ్రీదేశికులు తత్త్వటీకలో ఆశ్చర్యకరంగా సాయించేరు - *"యథా హి వేదవాక్యస్య విషయో బ్రహ్మ కథ్యతే"* అని. వేదానికి అంతంగానూ, శిరస్సుగానూ ఉన్నది వేదాంతం. వేదాంతవాక్యాలకి విషయమై ఉన్నది బ్రహ్మం. *"తథైవ సూత్రవాక్యస్య త్రయ్యన్తః పరికీర్త్యతే"* బ్రహ్మసూత్రప్రబంధానికి విషయమై ఉండడం ఏమిటి అంటే, వేదాంతవాక్యాలే. అంటే బ్రహ్మాన్ని గురించి వేదాంతం విచారించింది. వేదాంతవాక్యాలని విచారించేరు వ్యాసులవారు. అంటే ఈశావాస్యోపనిషత్తు మొదలుగా బృహదారణ్యకోపనిషత్తు పర్యంతం ఈఉపనిషత్తుల పరమార్థాలనే శ్రీవేదవ్యాసులవారు ఆయా ఉపనిషద్వాక్యాలని విచారించి నిర్ణయించి సాయించేరు. వీట్లో చెప్పబడే అర్థ విశేషాలని యథాతథంగా తెలుసుకొని యథార్థంగా స్పష్టతకలిగి ఉన్నదున్నట్లుగా చెప్పడంకోసమే మన స్వామి ఎంబెరుమానార్లు అవతరించడం.

***7.శారీరకశాస్త్రమూ, మన స్వామి రామానుజులున్నూ.***

*"తస్మై రామానుజాయ నమః పరమయోగినే। యః శ్రుతి స్మృతి సూత్రాణాం*

*అంతర్జ్వరమశీశమత్॥*" అన్న వచనంప్రకారం జగదాచార్యులైన మనస్వామి ఎంబెరుమానార్లు ఒక వైశాఖ శుద్ధపంచమీ ఆర్ద్రా నక్షత్రంలో (చిత్రామాసం, తిరువాదిరైనక్షత్రంలో) ఈభూమండలంలో అవతరించేరు. తిరువనన్తాళ్వానుల తిరువవతారవిశేషమైన మనస్వామి ఎంబెరుమానార్ల అవతారానికి ముఖ్యప్రయోజనం - వేదాన్తవాక్యార్థాలనీ, బ్రహ్మసూత్రార్థాలనీ, గీతావాక్యార్థాలనీ సమంజసంగా నిరూపణం చేసి కటాక్షించడమే - అని మన పూర్వాచార్యులు సాయించేరు.

లోకంలో చీకటిని పోగొట్టే గొప్పదనం ఆదిత్యుడికుంది. అదేవిధంగా, లోపలుండే చీకటి అనే అజ్ఞానాన్ని తొలగించి తన అనుష్ఠానంవల్ల ప్రకాశాన్నిచ్చే గొప్పతనం రామదివాకరుడికుండెను. ఆతర్వాత తన ఉపదేశంవల్ల (శ్రీగీతాశాస్త్రంతో) ఆంతరమైన అంధకారాన్ని తొలగించిన గొప్పదనం అచ్యుతభానుడైన కృష్ణుడికి ఉండెను. వీరితర్వాత మన సంప్రదాయంలో "**కృష్ణతృష్ణాతత్త్వం**" అని ఉదయించిన వకుళ భాస్కరులైన స్వామి నమ్మాళ్వారుల, లోకదివాకరులైన పరకాలుల, గొప్పదనం ఇంతఅని చెప్పడానికి సాధ్యంగాదు. వీరందరికీ పైన మన ఆచార్యరత్నహారంలో నడునాయకరత్నం అయిన శ్రీరామానుజుల వైభవం వాచామగోచరం.

స్వామి సాయించినటువంటి గ్రంథాల్లో వేదార్థసంగ్రహం శ్రుత్యర్థాలనీ, శ్రీభగవద్గీతాభాష్యం స్మృతియైన గీతయొక్క పరమార్థాన్నీ వివరించేవిగా ఉన్నాయి. వేదాన్తసారం, వేదాన్తదీపం, శ్రీభాష్యం అనే మూడూ శారీరకమీమాంసాశాస్త్రమైన బ్రహ్మసూత్రాలకి సంగ్రహ, విస్తార భావంతో వ్యాఖ్యానాలై ఉన్నాయి. వీటిలో శ్రీభాష్యం అతివిస్తారంగానూ, వేదాంతదీపం అనతివిస్తారంగానూ, వేదాన్తసారం సంగ్రహంగానూ ఉన్నాయి.

అతివిపులమై అత్యద్భుతంగా అందరూ తెలుసుకొగలిగేలా పరమసుగ్రహంగా బ్రహ్మసూత్రాల సకలార్థాలనీ వేరువేరుగానూ, మొత్తంమీదా, శ్రీభాష్యాన్ని కటాక్షించడంద్వారా రక్షించి ఇచ్చేరు మన స్వామి రామానుజులు అన్నది చాలా సారమైన విషయం. మూలగ్రంథమైన శారీరకశాస్త్రంలాగే శ్రీభాష్యంకూడా నాలుగధ్యాయాలుగా ఉన్నది.

శ్రీభాష్యంలో లేని కొన్ని అంశాలు దీపంలోనూ, సారంలోనూ ఉన్నాయి. శ్రీభాష్యంలో ఉన్న క్రమం - మంగళశ్లోకం, గురువందనం, ప్రతిజ్ఞావాక్యం, సూత్రవ్యాఖ్యానం. వేదాంతదీపంలో అత్యాశ్చర్యంగా అవతారికని సాయించేరు. ఇందులో రెండు ముఖ్యమైన విషయాలని అత్యద్భుతంగా సాయించేరు. అవతారికని రెండు భాగాలుగా విభజించి చెప్పుకోవచ్చు. మొదట తత్త్వత్రయవాదం స్వామి చేసేరు. తరువాతిదిగా బ్రహ్మసూత్రప్రబంధం పదహారు పాదాల సారార్థాలనీ చూపించేరు.

"*యేనాక్షరం పురుషం వేద సత్యం ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మవిద్యామ్*" (ఏబ్రహ్మవిద్యవల్ల అక్షరుడైన - స్వరూపస్వభావవికారాలు లేనివాడైన- పురుషుడిని తెలుసుకుంటాడో, అటువంటి బ్రహ్మవిద్యని ఆచార్యుడైనవాడు తనని వచ్చి ఆశ్రయించిన శిష్యుడికి ఉపదేశించవలెను) అనే ముండకోపనిషద్వాక్యం "*అథాతో బ్రహ్మ జిజ్ఞాసా*" అనే మొదటి సూత్రార్థాన్ని కలిగిఉన్నది. దీనికి

వ్యాఖ్యానం ఎంబెరుమానార్లు వేదాంతసారంలో సాయించేరు. దీన్ననుసరించి శ్రుతప్రకాశికలోకూడా తత్త్వటీకలోనూ మన ఆచార్యులు వివరంగా వ్యాఖ్యానాలు అనుగ్రహించేరు.

శ్రీభాష్యకారులైన మన స్వామి రామానుజులు సాయించిన భాష్యగ్రంథాల్లో ఇతరభాష్యకారులు చూపనివీ, వీరు విశేషంగా చూపిన అంశాలు ఏవి అన్నదాన్ని చక్కని పద్ధతిలో ఆచార్యపాదచ్ఛాయలో ఉండి పంక్తులని భక్తితో సేవించి కాలక్షేపం చేస్తేతప్ప తెలుసుకోవడం దుర్లభం. సాక్షాత్తూ ఆదిశేషాంశ సంభూతులైన శేషరామానుజులు తప్ప వేరొకరివల్ల శేషిరామానుజుడైన కృష్ణుడి దివ్యసూక్తియైన భగవద్గీత తాలూకు విశేషార్థం తెలిసేటట్టుగా చెప్పడానికి సాధ్యంగాదు అన్నది నిశ్చయం. అలాగే, *"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యోవై వేదాంశ్చ ప్రహిణోతి"* అనిన్నీ, *"అన్నమాయ్ మునివరోడు అమరరేత్త అరుమఱైయై వెళిప్పడుత్త అమ్మాన్"* అనిన్నీ ప్రశంసించబడిన శేషిరామానుజులే ఆఉపనిషదర్థాలని చెప్పడానికి సమర్థులు. *"వ్యాసరూపాయ విష్ణవే"* అని ఆయనే అనుప్రవేశం చేసి, అనుగ్రహించిన శాస్త్రమైన బ్రహ్మసూత్రాలని ఆయనొక్కరే వ్యాఖ్యానించసమర్థుడు. కనుకనే *"తస్మై రామానుజార్యాయ నమః పరమయోగినే। యః శ్రుతి స్మృతి సూత్రాణాం అన్తర్జ్వరమశీమత్॥"* అని ఎలా స్వామి భగవదంశగా అవతరించి భగవానుడినే విశేషంగా కలిగిన ప్రస్థానత్రయానికి భాష్యాలని సాయించి వాటి జ్వరాన్ని శమనం చేసి సదర్థప్రతిష్ఠాపనం చేసి కటాక్షించేరన్నదాన్ని మన పూర్వాచార్యులు విస్తారంగా అనుభవించేరు.

## *8. శ్రీభాష్యమహిమని వివరించడం.*

శ్రీవేదవ్యాసులవారి శిష్యప్రశిష్యపరంపరలో అవతరించిన ఒకమహాత్ముడు బోధాయనఋషి. ఈ మహాచార్యుడు శ్రీవేదవ్యాసులవారు సాయించిన బ్రహ్మసూత్రానికి 60000 గ్రంథాలున్న (ఒక గ్రంథం అంటే 32అక్షరాలది. ఒకఅనుష్టుప్శ్లోకంఎంతదో అంతది.) పరమవిస్తారంగానున్న ఒకవ్యాఖ్యానాన్ని సాయించేరు. ఇదే *"**బోధాయన వృత్తి** గ్రంథం"* అని మన ఆచార్యులు చెప్పినది. కాశ్మీరదేశంలో సరస్వతీ భండారంలో మాత్రంఉన్న ఈగ్రంధాన్ని నాథమునులు, ఆళవందారువంటి మహాచార్యులు సేవించలేక పోయారు. అంచేత వాళ్ళు శారీరకానికి ఓవ్యాఖ్యానం రచించడానికి ప్రయత్నించలేదు. ఈబోధాయనవృత్తిగ్రంధాన్ని సేవించి అందులోఉన్న బ్రహ్మసూత్రార్థవిశేషాలని గ్రహించిన భాగ్యవిశేషం శ్రీకూరత్తాళ్వాన్ సహాయంతో మనస్వామి ఎంబెరుమానార్లకి కుదిరింది. అందువల్లనే ఈశారీరకమీమాంసాశాస్త్రానికి యథార్థమైన తాత్పర్యార్థాలని స్పష్టంగా తెలుసుకొని మన స్వామి శ్రీభాష్యాన్ని సాయించేరని సంప్రదాయం.

శ్రీభాష్యానికి వివరణమై ఉన్న శ్రుతప్రకాశికలో శ్రుతప్రకాశికా భట్టర్ ఈవిషయాన్ని గురించి చాలా అద్భుతంగా తెలియజేసేరు. అంటే, ఈబోధాయనవృత్తిగ్రంధాన్ని సేవించే అందులో కనబడే వ్యాఖ్యానార్థ విశేషాలని మనస్సులో ఉంచుకొని శ్రీభాష్యాన్ని సాయించాలనే నిర్బంధం మన స్వామికి ఎలా కలిగింది? ఋషికానివాడు సూక్ష్మదర్శి కాలేడు. ఒక ఋషిఅభిప్రాయాన్ని యథాతథంగా మరొక ఋషిమాత్రమే గ్రహించగలడు. మందబుద్ధులైన ఋషిగానివాళ్ళు తెలుసుకోలేరు. స్వామి ఎంబెరుమానార్లు సాయించిన

శారీరకశాస్త్రవ్యాఖ్యానగ్రంథాలైన శ్రీభాష్యాదులు శ్రీవేదవ్యాసుల శిష్యప్రశిష్య పరంపరలో అవతరించిన బోధాయనఋషికృతమైన వృత్తిగ్రంథంలోని అర్థవిశేషాలని అంతర్లీనం చేసుకుంటూ, వాటిని పూర్తిగా అనుసరించి అవతరించడంవల్ల మూలగ్రంథమైన బ్రహ్మసూత్ర తాత్పర్యార్థాలు వేటికీ విరోధంరాకుండా వాటిని సంశయవిపర్యయాలులేకుండా వివరించేదై ఉన్నది. శ్రీభాష్యకారులు తప్ప ఇతరసూత్రవ్యాఖ్యాతలు ఆర్ష(ఋషులచేత అనుగ్రహింపబడిన)వ్యాఖ్యానాలని మీరినడిపించినవాళ్ళేనన్నవిషయం మనం గమనించ తగినది. ఇలా బోధాయనఋషి సాయించిన వృత్తిగ్రంథాన్ని అనుసరించడంవల్ల వ్యాసులవారి మనో భావాలని ప్రతిఫలిస్తూ ఉన్నదన్నది మనస్వామి ఎంబెరుమానార్లు సాయించిన శ్రీభాష్యాదిగ్రంథాలకే చెల్లిన అసాధారణ వైభవం. ఈగొప్పదనం బ్రహ్మసూత్రార్థవిషయంగాగల ఇతర భాష్యాలకి లేదన్నది స్పష్టం.

ఇక్కడ మరొక విషయాన్ని చాలా అందంగా చూపించేరు శ్రుతప్రకాశికాచార్యులవారు. శ్రీభాష్యంలో స్వామి ఎంబెరుమానార్లు తిరువేంగడముడైయానైన శ్రీనివాసుడిమీద మంగళశ్లోకం సాయించిన తర్వాత ఆచార్యులైన శ్రీవేదవ్యాసులవారిమీద వారు సాయించిన శారీరకశాస్త్రాన్ని గురించిన రెండవ శ్లోకాన్ని సాయించేరు. ఇందులో ఉన్న *"పూర్వాచార్య సురక్షితాం"* అనే భాగంతో దీనికి తరువాతిదిగా స్వామి సాయించిన శ్రీసూక్తిలో *"భగవత్ బోధాయన కృతాం విస్తీర్ణాం పూర్వాచార్యా స్సఙ్చిక్షిపుః"* అనే పదజాలాన్ని కలుపుకుని చూస్తే మనం ఒక విశేషాన్ని తెలుసుకుంటాం.

అదేమిటంటే, మొదట్లో పూర్వాచార్యులందరూ ఎన్నోవ్యాఖ్యానాలని సాయించడంద్వారా ఈశారీరక శాస్త్రాన్ని బాగా జాగ్రత్తగా రక్షించుకుంటూ వచ్చేరని తెలుస్తుంది. తరువాత *"విస్తీర్ణాం బ్రహ్మసూత్ర వృత్తిం"* అని స్వామి ఎంబెరుమానార్లు సాయించినదానివల్ల భగవద్బోధాయనులు బ్రహ్మసూత్రాలకి పరమవిపులంగా వృత్తిగ్రంథం సాయించేరని తెలుస్తుంది. శారీరకశాస్త్రానికి మిగతా పూర్వాచార్యుల వ్యాఖ్యానాలున్నందు వల్ల ఈవ్యాఖ్యానగ్రంథాలనీ, బోధాయనుల వృత్తిగ్రంథాన్నీ తీసుకొని శారీరకశాస్త్రంలోఉన్న అర్థవిశేషాలని తెలుసుకోవచ్చుగదా! అలాంటప్పుడు మనస్వామి శ్రీభాష్యాన్ని సాయించడానికి కారణం ఏమిటి? అనే ప్రశ్న వస్తుంది. దీనికి సమాధానంగా స్వామిశ్రీసూక్తులన్నింటినీచేర్చి వాటికి తాత్పర్యార్థం సాయించడం మూలంగా స్వామిమనస్సులో ఏముందో బాగా వివరించి చూపించేరు శ్రుతప్రకాశికాచార్యులవారు.

అంటే, బోధాయనవృత్తిగ్రంథం అన్నది పరమవిస్తృతవ్యాఖ్యానంగా ఉండడంవల్ల దాన్ని సంపూర్ణంగా సేవించి స్పష్టంగా అర్థగ్రహణం చెయ్యడంఅన్నది కష్టం. ఆయుస్సు అపారంగా ఉన్నవాళ్ళకే ఇది సాధ్యం. శారీరకశాస్త్రానికి స్వామి ఎంబెరుమానార్లకంటే ముందరున్న పూర్వాచార్యులు సాయించిన వ్యాఖ్యానాలు అతి సంగ్రహంగా ఉండడంవల్ల బుద్ధిసూక్ష్మం ఉన్నవాళ్ళకే దానితాత్పర్యార్థాలు తెలుస్తాయి. మనలాంటి సామాన్యులకి అటువంటి బుద్ధిసూక్ష్మతా లేదు, ఆయుస్సూ లేదు.

ఇంకామరో ప్రశ్న వస్తుంది. అదేమిటంటే, అపారమైనఆయుస్సూ, బుద్ధిసూక్ష్మతా లేకపోయినా,

అనవరతం పరిశ్రమచేస్తూ ఈగ్రంధాల్లో పరిచయం కలిగించుకుంటే శారీరకశాస్త్రవిషయాలు తెలుస్తాయిగదా అంటే, అలాపరిశ్రమించే అధికారులు దుర్లభులు. కనుక, పరమకారుణికులైన మనస్వామి ఎంబెరుమానారులు ఈశ్రీభాష్యాది గ్రంధాలని మనం ఉజ్జీవించడానికి సాయించేరు అంటారు శ్రుతప్రకాశికాచార్యులవారు.

ఇలా ఎంబెరుమానార్లు సాయించిన శ్రీభాష్యం అతిసంగ్రహంకాకుండా, అతి విస్తృతంకాకుండా, ఉండడంవల్ల బుద్ధిసూక్ష్మత, ఆయర్వృద్ధి లేని మనలాంటివాళ్ళకి బ్రహ్మసూత్రతాత్పర్యార్థాలని సులభంగా తెలియజేసేదిగా ఉన్నది అని శ్రీభాష్యం గొప్పదనం మనకి తెలుస్తోంది.

*"సంహితం ఏతత్ శారీరకం"* అని బోధాయనఋషి చెప్పినదాన్ని శ్రీభాష్యం ఆరంభంలో చూపించేరు మన స్వామి. *"ఏతత్ శారీరకం సంహితం"* అని అన్వయం. *"సంహితం"* అంటే, *"సంగతివిశేషణ- విశిష్టక్రమం"* అంటారు మన పూర్వాచార్యులు. దీనికి అర్థం ఏమిటో కొంచెం చూద్దాం.

యాగశబ్దానికి దేవపూజ అనిఅర్థం. వేదంలోచెప్పబడిన ఎన్నో యాగకర్మలకి ఆరాధ్యదేవతలు ఎవరు అనే ఆకాంక్షగురించి దేవతావిచారం ఆవశ్యకమైంది. ఆయా యాగకర్మలకి దేవతలుగా ఉండే ఇంద్రుడు, ప్రజాపతి, వరుణుడు, వంటివాళ్ళని గురించి విచారించేకాండం దేవతాకాండం. ఈ ఆరాధ్యదేవతలందరూ స్వతంత్రదేవతలా లేక పరతంత్రులా (ఈదేవతలు విభూతిభూతాలైన దేవతావిశేషాలా లేక పరతత్వదేవతా విశేషాలా) అన్న సందేహం వస్తే, దీనికి సమాధానాన్ని చెప్పడంకోసం బ్రహ్మవిచారం అవశ్యమైంది. ఇలా కర్మకాండలో కనబడే ఆక్షేపానికి సమాధానం దేవతాకాండాన్ని విచారిస్తే దొరుకుతుంది. దేవతాకాండంలో వర్ణించబడిన అర్థాలమీద వచ్చే ఆక్షేపాలకి సమాధానం బ్రహ్మకాండాన్ని విచారిస్తేనే లభిస్తుంది.

శ్రీవేదవ్యాసులవారు *"అథాతో బ్రహ్మ జిజ్ఞాసా"* - బ్రహ్మవిచారం కర్తవ్యం అని బ్రహ్మసూత్రగ్రంధాన్ని ప్రారంభించేరు. ఈబ్రహ్మం అన్నదేది అంటే, ఇదే కర్మకాండలో విచారింపబడిన సమస్తకర్మలకీ ఆరాధ్యమైన దైవం. ఈబ్రహ్మమే దేవతాకాండంలో విచారింపబడిన దేవతలకందరికీ అంతరాత్మభూతమైన దైవం. బ్రహ్మానికున్న అనేకమహత్తులనన్నింటినీ ఎన్నోవిధాలుగాచెప్పి, సర్వకర్మసమారాధ్యమై సర్వదేవతలకీ అంతరాత్మభూతమైఉండడమే బ్రహ్మశబ్దార్థమైన నారాయణతత్త్వమని నిరూపించేరు శ్రీవేదవ్యాసులవారు.

ఇలా జైమిని కర్తృకమైన కర్మకాండం, కాశకృత్స్నుల దేవతాకాండం, శ్రీ వేదవ్యాసుల బ్రహ్మకాండం అని మీమాంసలు మూడుగాఉన్నప్పటికీ విషయాలుమూడుగాఉన్నా, మహర్షులుముగ్గురైనా, ఈమూడింటినీ తనలో ఉంచుకున్న శాస్త్రం ఒక్కటే అని ఈవిషయాన్ని మనం చెప్పుకుంటున్నాం అనిగాదు, మహర్షుల ఏకైకభావనగా బోధాయనులే సాయించేరని మనకి చూపించేరు మనస్వామి ఎంబెరుమానార్లు.

ఇక్కడ ఒకవిషయాన్ని బాగావివరించి చూపించేరు శ్రుతప్రకాశికాచార్యులవారు. అదేమిటంటే, కాండత్రయాత్మకమైన శారీరకం ఏకశాస్త్రమైనా, మన స్వామి ఎందువల్ల కర్మమీమాంసకీ, దేవతామీమాంసకీ భాష్యంరాయకుండా శ్రీవేదవ్యాసకృతమైన బ్రహ్మసూత్రాలకే వ్యాఖ్యానం సాయించేరన్న ప్రశ్న. కర్మకాండకి వ్యాఖ్యానం సాయించిన తరువాతి వ్యాఖ్యాతలవల్ల అక్కడక్కడ కల-హం(వరం) కలగడం యథార్థం. అయినా, కర్మమీమాంసలో కనబడే మంత్రాలప్రయోగమార్గంలో ఎలాంటి కలహాలకీ అవకాశంలేదు. అంచేత, ఆయా యాగకర్మానుష్ఠానమంత్రాలతో కలిగే స్వర్గం మొదలైన ఫలసిద్ధి ఆయా యాగదేవతలకి స్వరూపంగా ఉన్నది. ఇటువంటి దేవతలస్వరూపయాథాత్మ్యం సత్కార్యవాదం మొదలైన శాస్త్రార్థజ్ఞానాపేక్షతో ఉన్నదిగాదు. అంటే, కర్మకాండంలో చెప్పబడిన యాగకర్మలని చేసే అధికారులకి సత్కార్యవాదంవంటి జ్ఞానకాండార్థజ్ఞానాపేక్ష అవసరంలేదు.

కాని *"తత్త్వజ్ఞానాత్ మోక్షలాభః"* అనిచెప్పినట్లుగా పరమపురుషార్థమైన మోక్షమనేది జ్ఞానం ఒక్కదానివల్లనే సాధింపబడవలసిఉండడంతో, జ్ఞానమార్గంలో నిశ్చయబుద్ధి లేకుండా, వాడు చంచలమైన మనస్సునిగాని, విపరీతజ్ఞానాన్నో కలిగిఉంటే, అది వాడికిఆత్మనాశాన్ని కలిగించే అపాయం ఉన్నది. కనుక, ఆత్మహానిని కలిగించే విపరీతజ్ఞానాన్ని పరిహరించవలసిన అవసరం ఉన్నది. పైగా, బ్రహ్మమీమాంసలోనూ ఆయా అర్థవిశేషాలకి సాధనాలైన కర్మకాండదేవతాకాండార్థాలుకూడా అక్కడక్కడ చూపబడడంతో ఆయా అర్థవిశేషాలు సులభమైనపద్ధతిలో చెప్పవలసినవి. ఈకారణాలవల్ల పరమకారుణికులైన మనస్వామి శ్రీభాష్యాదిగ్రంధాల్లో బ్రహ్మసూత్రార్థాలనే నిరూపించి సాయించేరని చూపించేరు శ్రుతప్రకాశికాచార్యులు.

బ్రహ్మసూత్రప్రబంధానికి వ్యాఖ్యానంగా మనస్వామి ఎంబెరుమానార్లు సాయించిన శ్రీభాష్యాది గ్రంధాలకి వ్యాఖ్యానవివరణాలుగా ఎన్నో గ్రంధాలు పూర్వాచార్యులద్వారానూ, తరువాతి కాలంలో వచ్చిన మహాచార్యులవల్లా, వచ్చేయి. వాట్లో ముఖ్యమైనవాటిని ఇక్కడ కొన్నింటిని చెప్పుకుందాం. మొదట *శ్రుతప్రకాశిక.* ఈగ్రంధంలేకపోతే దీనికిమూలమైన శ్రీభాష్యంతాలూకు అర్థవిశేషాలు మనకి తెలియకపోను. ఇది శ్రీభాష్యానికున్న విపులమైనవ్యాఖ్యానం. శ్రుతప్రకాశికాచార్యులవారే శ్రీభాష్యానికి సంగ్రహ వ్యాఖ్యానంగా శ్రుతప్రదీపిక అనేగ్రంధాన్ని సాయించేరు. శ్రుతప్రకాశిక లుప్తంగాకుండా దాన్ని మనకి రక్షించి ఇచ్చినవారు దేశికులు. వీరు ***అధికరణసారావళి, తత్త్వటీక, న్యాయసిద్ధాంజనం, శతదూషణి*** వంటి గ్రంధాలని సాయించడంద్వారా శ్రీభాష్యాన్ని సంరక్షించేరు.

శ్రుతప్రకాశికకి వ్యాఖ్యానంగా ***భావప్రకాశిక*** అనేగ్రంధం దశోపనిషద్భాష్యకారులైన శ్రీరంగ-రామానుజులు సాయించేరు. వీరే శ్రీభాష్యానికి వ్యాఖ్యానంగా ***"మూల భావప్రకాశిక"*** అనే గ్రంధాన్నికూడా దేశికుల న్యాయసిద్ధాంజనానికి వ్యాఖ్యానాన్ని సాయించేరు. చోళసింహపురం శుద్ధసత్వం దొడ్డయాచార్య స్వామి అనే మహాచార్యులవారు ***పారాశర్యవిజయం*** అనే గ్రంధాన్ని బ్రహ్మసూత్రప్రబంధానికి వ్యాఖ్యానంగా సాయించేరు. బ్రహ్మసూత్రానికి (శ్రీభాష్యాన్ని అనుసరిస్తూ) వ్యాఖ్యానమైన ***నయప్రకాశిక*** అనే గ్రంధం, ***శ్రీభాష్యభావప్రబోధనం*** అనేగ్రంధం, దేశికులకి ముందరికాలంవారైన మేఘనాథారిసూరి అనే మహాచార్యుల వారిచేత సాయింపబడింది. ***నయమయూఖమాలిక*** అనే గ్రంధం

అప్పయ్యదీక్షితులవారిచేత విశిష్టాద్వైత సిద్ధాంతాన్ననుసరించి బ్రహ్మసూత్రాలకి వ్యాఖ్యానంగా రచింపబడింది.

శ్రీభాష్యానికి "**శ్రీభాష్యవివరణం**"అని సోమాశియాండాన్ ఒకగ్రంధాన్నీ, అదేపేరుతో ఎంగళాళ్వాన్ ఒక గ్రంధాన్నీ సాయించేరు. స్వామిఎంబెరుమానార్ల ప్రత్యక్షశిష్యులైన వీరిద్దరూసాయించిన ఈగ్రంధాలు లుప్తమైనాయి. "**వేదాన్తన్యాయసుదర్శనమ్**" అనేగ్రంధం శ్రీవరదనారాయణభట్టారకర్అనే మహాచార్యులు సాయించేరు. "**న్యాయకలాపసంగ్రహం**"అన్న మరోగ్రంధంఉండేది. ఇవేకాకుండా, నడాదూరమ్మాళ్ సాయిం చిన "**తత్త్వసారం**" అనే గ్రంధంకూడా శ్రీభాష్యంలోచూపబడిన ఎన్నోసారార్థాలని ప్రకాశింపజేసేదిగా ఉన్నది.

ఇవేకాకుండా మైసూర్ అనన్తాళ్వాన్ సాయించిన "**వేదాన్తవాదావళి**" , మైసూర్ పరకాలజీయర్స్వామి సాయించిన "**గూఢార్థసంగ్రహమ్**", మోర్మున్నార్ ఐయన్ సాయించిన "**నాయమాత్మా భాష్యమ్**", కపిస్థలం దేశికాచార్యస్వామి అనుగ్రహించిన "**అధికరణ రత్నమాలా**" "**వ్యాససిద్ధాన్త మార్తాణ్డమ్**", ఉత్తమూర్ వీరరాఘవాచార్యస్వామివారు సాయించిన "**భాష్యార్థ దర్పణమ్**" వంటి గ్రంధాలు కూడా శ్రీభాష్యసారార్థాలని మనం తెలుసుకుందికి ఉపకరించేవే. ఇవే కాకుండా ఇంకా ఎన్నో గ్రంధాలు ఎంతోమంది మహాచార్యులవల్ల సాయించబడ్డాయి.

మీదచెప్పిన గ్రంధాలద్వారా ఎంబెరుమానార్ల శ్రీభాష్యాదిగ్రంధాల్లో ఉన్నఅర్థవిశేషణాలని ఎన్నో విధాలుగా అనుభవించేరు మనపెద్దలు. ఇక్కడ ఒకప్రశ్న వస్తోంది. మనకి స్వామి సాయించిన గ్రంధాలు చాలవా? ఏదో శ్రీభాష్యం, శ్రుతప్రకాశికవంటి కొన్ని గ్రంధాలు మాత్రం అనుభవిస్తే సరిపోదా? వీటి తరువాత ఇన్ని గ్రంధాలు ఎందుకు అవతరించేయి? వీటి ఉపయోగం ఏమిటి? ఈగ్రంధాలనన్నింటినీ మనం ఎందుకు అనుభవించాలి?

ఈగ్రంధాలు అవతరించడానికి ఎన్నో కారణాలున్నాయి. కొన్ని కారణాలని ఇక్కడ చెప్పుకుందాం. ముఖ్యమైన కారణం బ్రహ్మసూత్రాలకున్న విషయగౌరవం. బ్రహ్మసూత్రప్రబంధంలో శ్రీవేదవ్యాసులవారు ఎన్నోఉపనిషదర్థాలని న్యాయమార్గంలోవిచారించి వాటిలో నిగూఢమైన యథార్థతాత్పర్యార్థాలని బహిర్గతం చేసేరు. ఇవి, వీటిని మనం ఎన్నోరకాలుగా వివరిస్తూయి అనుభవించి ఉపయోగించుకుందికి తగిన విషయ గౌరవం అర్థపుష్టి, కలిగినవి. ఆచార్యశిష్యపరంపరాప్రాప్తంగా వర్థిల్లుతూవస్తూన్న వ్యాఖ్యానవివరణక్రమంలో ఒక్కొక్కమెట్టుగా అనుభవంలోగ్రహించబడుతూ వస్తున్నాయి. మనపూర్వులు వీటిని నిత్యానుభవంగా గ్రహించి ఆనందిస్తున్నారు. మనకీ మనపూర్వులు గ్రహించివస్తున్న ఈక్రమమే అనుసరించతగినది.

వీటన్నింటినీ అనుభవించితేనే స్వామి ఎంబెరుమానార్ల మేధావిలాసాన్నీ, వారు మనకి పరిశ్రమించి సాయించిన ఉపకారపరంపరలనీ మనంఎప్పుడూ తల్చుకోసాధ్యం. మనం స్వామిఎంబెరుమానార్ల శ్రీపాద సంబంధం పొందినవాళ్ళం. ఈకారణం ఒక్కదానివల్లనే మహాభాగ్యశాలులుగా పుట్టినవాళ్ళం. మనకి స్వామిశ్రీసూక్తులలోనే ప్రావణ్యం ఎక్కువగా ఉండాలి. మనకి ఇదే పరమప్రయోజనం. మనకి దీనికి

మించిన పురుషార్థం ఉండదు. మనకి దీన్నిమించిన అనుభవం లేదు. ఇదే మనకి స్వామితో ఉన్న సంబంధాన్ని మెట్లుమెట్లుగా క్రమక్రమంగా పెంచుతుంది.

స్వామి ఎంబెరుమానార్ల శ్రీసూక్తులని మనం ఎలాఅనుభవంలోకితీసుకోవడం అన్నదానికి ఈ గ్రంధాలు మార్గదర్శకాలుగా ఉన్నాయి. మనకి స్వామి ఏయేశ్రుతివాక్యాలన్నింటికీ వ్యాఖ్యానం సాయించేరు అన్నది తెలియాలి. ఏయే స్మృతీతిహాసపురాణవాక్యాలన్నింటికీ అర్థం సాయించేరన్నది తెలియాలి. గీతా శ్లోకాలన్నింటికీ ఆయన ఎలాఅర్థం సాయించేరు అన్నది మనంచూసితీరాలి. వేదవాక్యాలు బ్రహ్మసూత్రాలు, స్మృతి, ఇతిహాస పురాణవచనాలు, గీతా శ్లోకాలు, పాంచరాత్రం, ఆళ్వారుల అరుళిచ్చెయల్, ఆచార్య శ్రీసూక్తులు, ఇవన్నీ, స్వామి ఎలా అర్థస్వారస్యంతో ఏకమార్గాన్ని సూచిస్తున్నాయని చెప్పేరో వీటన్నింటినీ ఎలా సమన్వయపర్చి వాటితాత్పర్యైక్యతని సాయించున్నారన్నది మనంఅనుభవించితీరాలి. స్వామితర్వాతి మహాచార్యులందరూ తమతమగ్రంధాలలో స్వామిశ్రీసూక్తులని ఎలావివరించిచూపించేరన్నది అనుభవించి తీరాలి. ఏఏప్రమాణవచనాలని ఉదాహరించి స్వామిశ్రీసూక్తులు ఎలాఅమిరిఉన్నాయో చూడాలి. స్వామి శ్రీసూక్తులని ఒక్కొక్కటిగా ఎత్తుకొని పరిశీలిస్తే దానికి ఆధారమై మూలంగాఉన్న ప్రమాణవచనాలు తెలుస్తాయి. మన పూర్వులు ఇటువంటి పరిశీలనలని చేసేరు. స్వామి వ్యాఖ్యానశైలి ఎటువంటిదన్నది లోతుగా తెలుసుకొని అనుభవించాలి. ఒక్కొక్కభావాన్నీ, తెలియజెయ్యడానికి స్వామి ఎత్తుకున్న పద్ధతులూ, మార్గాలు ఎటువంటివి అని మనకి తెలిసి ఉండాలి.

ముందువెనుకనున్న ప్రకరణాలననుసరించి తాత్పర్యార్థాలని సాయించడం, వేదవాక్యాల్లో జీవపదాలుగా ఉన్నవాటికి ఇతహాసపురాణాల్లో ఋషులు చూపిన మార్గాలననుసరించి అర్థం సాయించడం, ఏయే వేదవాక్యాలకి ఏయే ఇతిహాసపురాణశ్లోకాలు ఉపబృంహణాలుగా ఉన్నాయని పరిశీలించడం, ప్రమాణవచనాల్లో సదాసర్వకాలం సంచరిస్తూ ఉండడం, ప్రమాణవచనాలని అనుసరించి ఉన్న శ్రీసూక్తులని చెప్పడం, తత్త్వపరమైన విషయాలని నిరూపించేటప్పుడు వాటికి ఆధారంగా ప్రస్థానత్రయంలోంచి, శ్రీవిష్ణుపురాణంలోంచి ఆధారాలని చూపడం ఇవన్నీ, స్వామి అనుసరించిన మార్గాలవుతాయి.

ఇదే కాకుండా, "*మాఱన్ అడిపణిన్దు ఉయ్‌న్తవన్ - రామానుజన్* - నమ్మాళ్వార్లని అనుసరించి ఉజ్జీవించిన రామానుజులు" అనిన్నీ, " దీంతో సూత్రవాక్యాలని సమన్వయపరిచేరు" అనే చెప్పినట్లుగా, ఎక్కడెక్కడ స్వామి నమ్మాళ్వారి శ్రీసూక్తులని ఎత్తుకొని ఎంబెరుమానార్లు బ్రహ్మసూత్రాలకీ వేదవాక్యాలకీ అర్థనిర్ణయం చేసేరన్నది అనుభవించాలి.

స్వామి శ్రీభాష్యశ్రీసూక్తులని గురించి శ్రుతప్రకాశికాచార్యులవారు ఒక అద్భుతమైన శ్లోకం సాయించేరు. ***అవిస్తృతాః సుగమ్భీరా రామానుజమునేర్గిరః। దర్శయన్తు ప్రస్థానే స్వం భావమఖిలం దృఢమ్॥*** ఎంబెరుమానార్ల శ్రీసూక్తులని అతివిస్తారం అని చెప్పలేం. వాటిని అతిసంగ్రహం అనీ చెప్పలేం. స్వామి శ్రీసూక్తులన్నీ అనతివిస్తరంగా ఉన్నాకూడా అవి పరమగంభీరమైనవి. వాటిని ఉద్ఘాటించవలసిన వాటిగా చూసినప్పుడు అర్థాలు తెలుస్తాయి. బాగా లోతైనవీ, సూక్ష్మార్థాలతోఉన్నవీ, పరిశీలించి చూసినా, అపారమైన అర్థాలు కనిపిస్తాయి. మీనాలు, ముత్యాలు, పగడాలూ, రత్నాలు వంటివన్నీ ఆయా రేవుల్లో

దిగినవాళ్ళకి లభిస్తాయి. *"సముద్ర ఇవ గాంభీర్యే"* అని శ్రీరాముడికున్న గాంభీర్యానికి సముద్రాన్ని దృష్టాంతంగా శ్రీవాల్మీకి చూపించేరు. అలాగే ఎంబెరుమానార్ల శ్రీసూక్తి *"అవిస్తృతాః సుగమ్భీరా రామానుజమునేర్గిరః"* అన్నట్టుగా ఉన్నాయి.

స్వామి శ్రీసూక్తులొక్కొక్కదాన్నీ మనంఈవరసలో పరిశీలించి అనుభవంలోకి తీసుకోవాలి. మీద చెప్పిన గ్రంథాలు ఈపద్ధతిలోనే మనకిపరమప్రయోజనంగా స్వీకరించతగినవిగా ఉన్నాయి. ఈగ్రంథాలని సాయించిన మహాత్ములందరూ వేదమార్గాన్ని వదలకుండాఉండి, వైదికప్రక్రియనీ శ్రీభాష్యాదిగ్రంథాలనీ రక్షించివస్తున్న మహాచార్యులు. శ్రీభాష్యాదిగ్రంథాల్లో చూపబడ్డ అర్థవిశేషాలని గ్రహించడంలో కాలక్రమంలో మనలాంటివారికి కలిగే లోటుపాట్లని మనస్సులో ఉంచుకొని మనం స్వామి ఎంబెరుమానార్ల శ్రీసూక్తుల స్వారస్యాన్ని రసానుభవాన్ని వదలకూడదని అభిప్రాయంలో ఈఅర్థవిశేషాలతో మనంకూడా ఆత్మోజ్జీవనం పొంది ఉజ్జీవించాలనే అభిప్రాయంతో పరమకారుణికులైన ఈఆచార్యులందరూ ఈగ్రంథాలని సాయించేరు.

ఇలా ఈగ్రంథాలు మనకోసమే అవతరించేయి అనే నిజాన్ని మనం మనస్సులో ఉంచుకొని యథాశక్తి ఈగ్రంథాలని అనుభవించితే ఈమహాచార్యుల శ్రీపాదబలంచేతనూ, వాళ్ళ ఆశీర్వాదబలంవల్లనూ మనం ఆత్మ క్షేమాన్ని పొందగలం.

### *9. శంకరులూ, మనస్వామి ఎంబెరుమానారులూ.*

బ్రహ్మసూత్రభాష్యారంభంలో ఆదిశంకరులు తమమనస్సులోనడుస్తున్న అర్థం - **అద్వైతమే సూత్ర ప్రస్థానం తాలూకు పరమతాత్పర్యం** అని అధ్యాసభాష్యం చేస్తున్నారు. కాని మన స్వామి ఎంబెరుమానార్లు శ్రీభాష్యారంభంలో **"వేదవ్యాసశిష్యులైన బోధాయనుల వృత్తిగ్రంథంలో ఉన్న అర్థాలని పూర్వాచార్యులు సూక్ష్మంగా చూపిన దారిలో (తన్మతానుసారేణ) సూత్రాక్షరాలు వర్ణింపబడుతున్నాయి"** అని మొదటి పంక్తిలో సాయించేరు.

*"**అఖిలభువన**"*అనిప్రారంభమయే మంగళశ్లోకంలో తామువిశదీకరించబోయే సకలార్థాలనీ ఆశ్చర్యకరంగా సంగ్రహించేరు. అందులోనున్న *"**శేముషీ భక్తిరూపా**"* అన్నపదంతో ఆళ్వార్ సాయించినట్లుగా *"**మదినలమ్**-* ***భక్తిరూపాపన్నజ్ఞానం**"* లేదా *"**నలమామది-ఆనందరూపమైన మహాజ్ఞానా**"*న్ని చెప్తున్నారు. *"**తత్త్వమేకో హరిః నారాయణః పరః**", "**ధ్యేయో నారాయణస్సదా**"*, అన్నదాన్ని *"**సర్వశ్రుతిషు అనుగతమ్**"* అనే గొప్పతనాన్ని స్పష్టించేడు పురుషసూక్తంలోనూ, శ్రుత్యర్థస్మారకమైన భగవద్గీతలోనూ, చేర్చి అర్థఘటనం చేస్తున్నారు. వేదాంతం చెప్పిన *"**శేముషీ**"* అన్నదాంతో గీత చెప్పిన భక్తిచేరినట్లైతే, *"**భక్తి-రూపాపన్న-జ్ఞానం**"* అవుతుంది. జ్ఞానదర్శనప్రాప్తికి భక్తి ఉపాయం అన్నది శాస్త్రసిద్ధం. *"**తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి। నాన్య పన్థా అయనాయ విద్యతే॥**" "**తమేవ విదిత్వా**"* మొదలైన ఉపనిషద్వాక్యాల్లో చెప్పబడినటువంటి జ్ఞానానికీ, *"**భక్త్యా తు అనన్యయా శక్యః**"* అన్న గీతావాక్యంలో చెప్పబడ్డ భక్తికీ సామంజస్యాన్ని చూపిచే విధంగా స్వామి

శ్రీసూక్తులు హృదయంగమంగానూ, చలచిత్తవృత్తి వినివర్తనౌషధంగానూ అవతరించేయి.

శంకరులు తమ భాష్యారంభంలోనే *"బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా"* అని తమసిద్ధాంతంగా ఉన్నదాన్ని అద్వైతాన్ని తెలియజేసేరు. *"బ్రహ్మం ఒక్కటే సత్యం. మిగతాదంతా మిథ్యే"* అనే తమ భావాన్ని సిద్ధాంతీకరణం చేసి, *"దీనికి అనుగుణంగా సూత్రార్థాలని నేను చెప్తున్నాను. ఇదే సూత్రకారులు వ్రాయించేరు. అని చూపిస్తున్నాను"* అని ఆరంభించేరు. *"అద్వైతమే వేదాంత సిద్ధాంతం"* అని తమ మేధావిలాసంవల్ల శంకరులు మీదతెచ్చిపెట్టుకొని చెప్పేరేతప్ప, అది వేదవ్యాసకర్తృకమైన శారీరకంలో చెప్పబడిందా అంటే, చెప్పబడలేదు అని ఎన్నోవిధాలుగా నిరూపించేరు స్వామి ఎంబెరుమానార్లు. *"సూత్రకారులు సూత్రంలో ఏ అర్థాన్ని మనస్సులో పెట్టుకొని వ్రాయించేరో, దాన్ని నేను చెప్తున్నాను"* అని ప్రతిజ్ఞ చేసేరు ఎంబెరుమానార్లు. *"తాము చెప్పేదే సూత్రంలో ఉన్నది"* అంటారు శంకరులు.

*"సూత్రంలో ఉన్నదాన్ని నేను యథాతథంగా చెప్తుతున్నాను"* అంటారు మన స్వామి. బ్రహ్మసూత్రగ్రంథం నాలుగధ్యాయాల్లోనూ వాటిలోనున్న 16 పాదాల్లో వాట్లో ఉన్న 156 అధికరణాల్లోనూ, వాటిలో ఉన్న 545 సూత్రాల్లోనూ శ్రీవేదవ్యాసులవారు దేన్ని నిరూపించేరంటే, *"దర్శనం భేద ఏవచ"* అనే సిద్ధాంతాన్నే అనే నిజాన్ని స్వామి ఎంబెరుమానార్లవల్ల శ్రీభాష్యాదిగ్రంథాల్లో చూడవచ్చు. అద్వైతమే వేదాంతసిద్ధాంతం అనడానికి అనుగుణంగా ఒక్కసూత్రంకూడా కనబడదు.

స్వామి ఎంబెరుమానార్లు శ్రీభాష్యంలో అద్వైతమతాచార్యులు చెప్పినది తప్పని కొన్ని అధికరణాల్లోనే స్పష్టంగా సాధించడాన్ని మనం గమనించవచ్చు. తప్పకుండా అన్ని అధికరణాలలోనూ స్వామి బహిర్గతం చేసినవిగా ఇలా సాధించలేదు. కాని శ్రుతప్రకాశికాభట్టరువారు మాత్రం ఒక్కటీవదలకుండా, అన్ని అధికరణాల్లోనూ చివరని *"అన్యేతు"*, *"ఇతరేతు"* అని శబ్దప్రయోగం చేసేరు. ఈఈసూత్రాలకి శంకరులు ఈవిధంగా వ్యాఖ్యానం చేసేరు, యాదవప్రకాశులు ఇలా వ్యాఖ్యానం చేసేరు భాస్కరులు ఇలా వ్యాఖ్యానం చేసేరు అని వదలకుండా చెప్పి, *"ఇవన్నీ తప్పు, ఇవి సూత్రకారుల మనోభావానికి కుదరేవిధంగా లేవు"* అని విషయాన్ని ఒక్కో అధికరణం చివరనీ నిరూపించేరు. ఇలా శంకర, భాస్కర, యాదవప్రకాశ మతాలు మూడింటినీ ఎత్తుకొని ఆయా మతాల్లో ఈబ్రహ్మసూత్రాలకి చేసిన వ్యాఖ్యానాలు వృత్తి గ్రంథానికీ, పూర్వోత్తరసూత్రాలకీ, వేదాన్త వాక్యాలకీ కుదరదు అని నిరూపించేరు.

అంచేత శ్రుతప్రకాశికాచార్యులవారు వ్రాయించిన *"శ్రుతప్రకాశిక"* అనే శ్రీభాష్యవివరణగ్రంథం రెండు విధాలుగా అమిరిఉండడం మనం గమనించవచ్చు. బ్రహ్మసూత్రానికి భాష్యం వ్రాయించిన స్వామి ఎంబెరుమానార్ల మనోభావాన్ని వివరించి, వృత్తిగ్రంథానికీ అనుకూలంగా ఉన్నవ్యాఖ్యానం అని నిరూపించడం, ఈబ్రహ్మసూత్రాలకి మిగతా వాళ్ళు చేసిన వ్యాఖ్యానాలు ఏమాత్రం కుదిరేటట్లుగా లేవని నిరూపించడం అనే ఈ పద్ధతిలోనే 156 అధికరణవ్యాఖ్యానాలలోనూ శ్రుతప్రకాశిక అమిరి ఉన్నది.

ఒక తత్వార్థాన్ని సిద్ధాంతనిర్ణయం చేసినా, అది శ్రుతివాక్యాలన్నింటికీ విరుద్ధంగా లేకుండా ఉండి, వేదతాత్పర్యమర్యాదని అనుసరించినదిగా నిష్కర్షించేటట్టుగా ఉండాలి. ఇదే వైదికులు అనుసరించే

మార్గం. ఈమార్గాన్ని చక్కనిక్రమంలో పూర్వాచార్యులు చూపించిన విధంగా మనకి చక్కగా ఏర్పరిచి సాయించిన వారు మన స్వామి ఎంబెరుమానార్లు.

*"ఆర్షం ధర్మోపదేశఞ్చ వేదశాస్త్రావిరోధినా । యస్తర్కేణానుసంధత్తే స ధర్మం వేద నేతరః॥"* (మను 12-106) - శ్రుతిస్మృతులని వేదశాస్త్రంతో విరోధంలేని తర్కంచేత ఎవడు అర్థంచేసుకుంటున్నాడో, వాడే ధర్మాన్ని తెలిసినవాడు. అలా కానివాడు ధర్మం తెలియనివాడే - అని చెప్పినప్రకారం *"**వేద విరోధంలేని చక్కని తర్కాలతో అలంకరింపబడిన విశేషమైన ప్రమాణాలతో వేదవేదాంతాల్లో ఉన్న యథార్థాన్ని నిర్ణయించాలి**"* అనే నియతికి తగినట్లుగా శ్రీబాష్యాన్ని సాయించేరు మన స్వామి ఎంబెరుమానార్లు.

శ్రుతిస్మృతీతిహాసపురాణాలు, బ్రహ్మసూత్రం, శ్రీమద్భగవద్గీత, పాంచరాత్ర శాస్త్రం, ఆళ్వార్లు సాయించినశ్రీసూక్తులు, పూర్వాచార్యుల శ్రీసూక్తులు, అనే ప్రమాణాల్లో సంచరిస్తూ, వీటి అర్థవిశేషాలని న్యాయమార్గంలో (మంచి యుక్తులతో) అంటే వేదవిరోధంలేని తర్కాలతో నిర్ణయించి, వీటిఏకముఖమైన తాత్పర్యార్థాలని బహిర్గతంచేసి ఇవన్నీ అనాదియైనదీ, పరమవైదికమైన విశిష్టాద్వైతసిద్ధాంతానికే పూర్తిగా తగిఉన్నాయని నిరూపించి సాయించేరు మన స్వామి.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయంగురించి చిన్న విన్నపం చేస్తున్నాను. అదేమిటంటే, వేదాంతం ఏదిచెప్తోందో దాన్ని మనం యథాతథంగా తెలుసుకొని అంగీకరించడమే తప్ప మన సౌకర్యంకోసం ఒకవిషయాన్ని గాని, వస్తువునిగాని, మనం ఉన్నది, లేదు అనిచెప్పడానికి సాధ్యంగాదు. మన సంప్రదాయంలో మనం అన్నివేదభాగాలకీ పూర్ణమైన ప్రామాణికత్వాన్ని అంగీకరించేం. అద్వైతులు పూర్వ భాగానికి అంత ప్రామాణికత్వాన్ని అంగీకరించలేదు. ఉత్తరభాగానికే ప్రామాణికత్వాన్ని అంగీకరిస్తున్నారు. అందులోకూడా అన్ని వేదాంతవాక్యాలకీ ప్రామాణికత్వాన్ని ఒప్పుకోలేదు మహావాక్యాలని కొన్ని వాక్యాలని మాత్రమే ముఖ్యంగా ఎత్తుకుంటారు. ఘటకశ్రుతులకీ భేదశ్రుతులకీ ప్రామాణికత్వాన్ని అంగీకరించరు. ఇలా వేదంలో కొన్ని వాక్యాలకి ప్రామాణికత్వాన్ని అంగీకరించడం, కొన్ని వాక్యాలని అవి ప్రమాణాలుకావని తోసిపారేయడం అనేది వైదికులకి తగినదిగాదు.

మన సంప్రదాయంలో మనం అన్ని వేదవాక్యాలకీ మూలప్రామాణికత్వాన్ని అంగీకరిస్తాం. విధి వాక్యం అంటే దానికికూడా ప్రామాణికత్వం ఉంటుంది. కనుక, సమస్తశ్రుతివాక్యాలనీ ముందరిదానితో వెనక వాక్యం విరోధించకుండా వాటిని ఎలా సమన్వయం చెయ్యాలో అలా సమన్వయపరిచి వేదతాత్పర్యార్థాన్ని నిర్ణయించవలసిందేతప్ప మనం ఒకసిద్ధాంతాన్నిపట్టుకొని దానికి అనుగుణంగా కనపడే కొన్ని వేదవాక్యాలని ప్రమాణంగా తీసుకోవడం, దానికి విరోధంగాతోచే మరికొన్ని వేదవాక్యాలని అవి ప్రమాణంకావని తోసి పారేయడం కూడదు. ఇలా చెయ్యడానికి ఏవైదికుడికీ అధికారం లేదు. వేదవాక్యాలన్నింటినీ సమన్వయ పరిచి వేదతాత్పర్యాన్ని నిర్ణయం చెయ్యడమే వైదికుల - ముఖ్యంగా వైదికమతాచార్యులకి విధి అవుతుంది. ఈపద్ధతిని ఏమాత్రం వదలకుండా అనుసరించినవారు మన ఆచార్యులే అవుతారు.

## *10. అద్వైతం, విశిష్టాద్వైతమున్నూ.*

అద్వైతసిద్ధాంతంలో నామరూపగుణాలులేని శుద్ధబుద్ధవస్తువైనబ్రహ్మం ఒక్కటే సత్యమనీ, ఉన్నవని తోచే (కంటికి కనబడే) మండపప్రాకారగోపురగోమనుష్యాది సకలపదార్థాలూ అవిద్యాపరికల్పితాలు - మిథ్యాపదార్థాలు - అనిచెప్పబడుతాయి. అంటే, ఇవన్నీ మాయా(అవిద్య)సంబంధంవల్ల బ్రహ్మానికి కలిగిన భ్రమ. బ్రహ్మయొక్క ఈఅవిద్య, ఆత్మజ్ఞానంచేత వదలగొట్టబడి బ్రహ్మకిమోక్షం కలుగుతోంది. వీరి పక్షంలో బ్రహ్మం నిర్గుణం, అశరీరం, విభూతిశూన్యం, నిర్విశేషం, అవేద్యం, అవాచ్యం అని చెప్పబడుతుంది.

విశిష్టాద్వైతులు భగవానుడినిబ్రహ్మశబ్దవాచ్యుడనీ, దివ్యమంగళవిగ్రహవిశిష్టుడనీ, సమస్తకల్యాణ గుణైకతానుడనీ, దోషలేశంకూడా లేనివాడనీ శ్రియఃపతి అనీ, దోషభూయిష్ఠుడైన జీవుడి దోషాలని తన అనుగ్రహంతో పోగొట్టేవాడనీ, ఆయన ఆత్మ, ఆయననితప్పించి సమస్తచిదచిద్వస్తువులూ ఆయనకి శరీర మనిన్నీ, ఆయన శేషి, మిగతవన్నీ ఆయనకు శేషములనిన్నీ, చిదచిదీశ్వరతత్త్వత్రయం సత్యమే అనిన్నీ, అభిప్రాయపడతారు. వీరిమతంలో బ్రహ్మం సవిశేషం. అంటే బ్రహ్మం సకలవిశేషవిశిష్టం. బ్రహ్మశబ్ద వాచ్యుడైన భగవానుడు సత్యజ్ఞానానందాది అనంతకల్యాణగుణములతో కూడినపురుషోత్తముడు. భక్తిచేతనే ముముక్షువైన జీవాత్మ మోక్షం పొందుతాడు.

మన సంప్రదాయంప్రకారం యతులకి శిఖఉంటుంది. యజ్ఞోపవీతం ఉంటుంది. కటిసూత్రం (మొలతాడు) ఉంటుంది. కౌపీనం ఉంటుంది. ఇప్పుడుకూడా శ్రీపెరుంబూదూరులో మనస్వామి ఎంబెరుమానార్లని అర్చామూర్తిగా మనం సేవిస్తున్నాం. ఎంతో అందమైన శిఖతో మనకి సేవ సాయిస్తు న్నారు. అద్వైతుల సంప్రదాయంలో యతులకి ఇవేవీ ఉండవు. బ్రహ్మసూత్రం వక్షస్థలంలో లేనివాళ్ళు ఎలా బ్రహ్మసూత్రవ్యాఖ్యానం చెయ్యవచ్చేరో అని అడుగుతుంటారు ఒక పెద్దాయన. వీళ్ళు తమని వపనం చేయించుకొనడంలో ఆశ్చర్యంలేదు. వీరు బ్రహ్మకే వపనం (గుండు) కొట్టించేస్తారని అనేవారు మన పూర్వులు. బ్రహ్మానికి విగ్రహం ఉండదు, గుణాలులేవు, విభూతిలేదు, పెరియపిరాట్టిమార్లు(లక్ష్మీదేవి) లేరు, అంటూ అబద్ధవాదం చేసే వీరిమతంలో బ్రహ్మం శుద్ధం, నిర్విశేషం అనబడుతోంది. సవిశేష (విశిష్ట) బ్రహ్మమే వేదాంతంలో చెప్పబడింది అన్నది మన మతం. వేదాంతంలో బ్రహ్మానికి గుణం చెప్పబడుతోందే అని శంకరులనిచూసి ప్రశ్నించినవారికి వారు "గుణాలులేవని చెప్పడానికి గుణంఉన్నదని వేదాంతం చెప్తోంది" అన్నారు. వేదాంతంలో సగుణవాక్యం పూర్వవాక్యంగా ఉన్నది. నిర్గుణవాక్యం ఉత్తరవాక్యంగా ఉన్నది. అపచ్ఛేదన్యాయంతో పూర్వవాక్యం దుర్బలం, ఉత్తరవాక్యంప్రబలం అన్నది శంకరులవాదం. విధివాక్యంముందర నిషేధవాక్యంతరువాత అన్నది అద్వైతుల వాదం. ఇక్కడ అపచ్ఛేదన్యాయానికి ప్రసక్తి లేదని నిరూపించేరు మన స్వామి ఎంబెరుమానార్లు.

దేశికులు శతదూషణి అనే గ్రంథాన్ని సాయించేరు. నూరు వాదాలు గల నూరు దూషణాలు ఇతర మతాలని గురించినవి. కుదృష్టులైన అద్వైతులవంటివారివాదాలని ఖండించేదై ఉన్న ఈగ్రంథంలో

ఇప్పుడు 66 వాదాలు మాత్రం దొరుకుతున్నాయి. మిగతా 34 వాదాలతో ఉండిన గ్రంథభాగం లోపించడం జరిగింది. ఇందులో 66వ వాదం మనం అందరం తప్పకుండా తెలుసుకొని అనుభవించవలసినవాట్లో ఒకటి. దీనికి *పరమతే సూత్రస్వారస్యభంగవాదం* అని పేరు. ఇందులో శారీరకశాస్త్రంలోని ఒక్కొక్కసూత్రం, ఒక్కొక్క అధికరణం, ఒక్కొక్క పాదం, ఒక్కొక్క అధ్యాయం ఇతరమతాలకి తగినవికావనిన్నీ, ఇవన్నీ కుదరడం స్వామి ఎంబెరుమానార్ల శ్రీభాష్యాదిగ్రంథాలకే అనిన్నీ, అత్యద్భుతంగా దేశికులు నిరూపించేరు. దీనికి పైగా, ఏంచెప్పాలి అంటూచూసేరు. చివరగా ఈకుదృష్టులవాదాలన్నీ శారీరకశాస్త్రంలో ఐదో అధ్యాయానికి కుదురుతాయన్నారు. శారీరకశాస్త్రంలో ఐదోఅధ్యాయం అంటూఒకటిలేనేలేదు. ఇలా సూత్రప్రబంధం తాలూకు తాత్పర్యార్థాలకి అవతలివే ఈకుదృష్టివాదాలు అని చాలా రసవత్తరంగా సాయించేరు.

నాలుగధ్యాయలున్న ఈశారీరకశాస్త్రంలో చెప్పబడే అర్థంఏమిటి? జగత్తుకంతటికీ కారణం బ్రహ్మం. ఆబ్రహ్మాన్ని ఉపాసనం చేస్తాడు సంసారి అయిన జీవాత్మ. వాడు బ్రహ్మంతాలూకు కల్యాణగుణాలని ఉపాసిస్తున్నాడు. తర్వాత భగవానుడి కారుణ్యంవల్ల ఈశరీరాన్ని వదిలి బయలుదేరి మరో సూక్ష్మశరీరంతో అర్చిరాదిమార్గంలో విరజానదిని చేరి అందులో స్నానం చేసి ప్రాకృతశరీరాన్ని వదిలేసి అప్రాకృతశరీరాన్ని పరిగ్రహించి 500 అప్సరస్త్రీలు వచ్చి ఇతడికి విశేషఅలంకారాలు చేయించగా, తరువాత పరమపదాన్ని చేరి, వెయ్యికాళ్ళ మంటపాన్ని చేరి ఇక్కడ వేంచేసియున్న పరమపదనాథుడి ఒడిలో వేంచేసి ఉంటాడు. అక్కడనుంచి ఎప్పుడూ ఈసంసారమండలంలోకి మరి తిరిగిరావడంఅనేది ఉండదనిచెప్పి తమ సూత్ర ప్రబంధాన్ని పూర్తి చేసేరు శ్రీ వేదవ్యాసులవారు.

ఇలా గుణాలు లేకుండా, విభూతులు లేకుండా, దివ్యమంగళవిగ్రహంలేకుండా, లక్ష్మీదేవిలేకుండా, అన్నింటినీ వదిలివేసిన ఏమీలేని దరిద్రమైనఒక బ్రహ్మం - ఇది ఎక్కడినుంచి అంటే, శారీరకంలోని ఐదో అధ్యాయంలోది అని చెప్పడంద్వారా ఇటువంటితత్త్వం శాస్త్రబాహ్యమైనది అంటారు దేశికులు.

ఇక మనస్వామి శ్రీభాష్యాదిగ్రంథాల్లో సారంగా చూపించే పరమవైదికమైనదీ, అనాదియైనదీ అయిన ఈవిశిష్టాద్వైతసిద్ధాంతానికి మూలసూత్రాల్లో కొన్నింటిని మొదట అనుభవంలోకి తేవడంద్వారా ఈసిద్ధాంతానికే సూత్రానుగుణ్యత ఉన్నదనే విషయం విస్తారంగా నిరూపించబడుతుంది.

### *11. కాణ్డత్రయాత్మకమైన మీమాంసా శాస్త్రం - ఏకశాస్త్రం అనే విషయం.*

మీమాంస అంటే విచారం అని అర్థం. ఆనందమయుడైన, ఆనందప్రచురుడైన భగవానుడి ఆనందాన్ని గురించి విచారించేది ఆనందమీమాంస అనబడుతుంది. *"సైషానందస్య మీమాంసా భవతి"* అని ఆనందమీమాంస వేదాంతంలో వస్తుంది. అలాగే బ్రహ్మానిగురించిన (పరతత్త్వాన్ని గురించిన) విచారం బ్రహ్మమీమాంస. మీమాంసాశాస్త్రాన్ని కాండత్రయాత్మకంగా మనపూర్వులు వర్ణించేరు. అంటే, కర్మకాండం అనీ, దేవకాండం అనీ, బ్రహ్మకాండం అనీమూడు కాండలన్నమాట. శ్రీవేదవ్యాసులవారి శిష్యులైన జైమిని 16 అధ్యాయాలున్న మీమాంసశాస్త్రాన్ని సాయించేరు. అది పూర్వమీమాంస -

కర్మమీమాంస అనబడు తోంది. కర్మకాండలో వేదార్థాన్ని వివరించేరు. వేదవాక్యాలని ప్రమాణంగా తీసుకొని ఆవేదవాక్యాలకి అర్థ నిర్ణయం చేసేటట్టుగా ఉన్నది కర్మకాండమీమాంస అనబడే వేదాంతవిచారగ్రంథం.

మొదట 12అధ్యాయాల్లో జ్యోతిష్టోమాదికర్మలని విచారించి తరువాత నాలుగధ్యాయాల్లో కర్మారాధ్య దేవతలనిగురించిన విచారం చేసేరు జైమిని. వారి ఆచార్యులైన శ్రీవేదవ్యాసులవారు తరువాత నాలుగు అధ్యాయాల్లో బ్రహ్మవిచారం చేసేరు. ఇదే ఉత్తరమీమాంస - బ్రహ్మమీమాంస అనబడుతోంది. జైమిని 12 అధ్యాయాల్లో ఏకర్మలని గురించి విచారించేరో, ఆకర్మలకి ఆరాధ్యమైన ఏదేవతలనిగురించి తరువాతి నాలుగధ్యాయాల్లో విచారించేరో ఆదేవతలకి అంతరాత్మభూతంగాఉన్న బ్రహ్మాన్ని నాలుగు అధ్యాయాలతో శ్రీవేదవ్యాసులవారు విచారించి నిష్కర్షించేరు. ఇలా సర్వక్రమసమారాధ్యం సర్వదేవాంతరాత్మభూతం పరబ్రహ్మం వేదాంతవేద్యం అన్నదే శ్రీవేదవ్యాస సిద్ధాంతం. ఇలా *"అథాతో ధర్మ జిజ్ఞాసా"* అని ప్రారంభించి, *"అనావృత్తిశ్శబ్దాత్ అనావృత్తిశ్శబ్దాత్"* అన్నంతవరకూ ఇరవై అధ్యాయాలున్న మీమాంసా శాస్త్రం ఒకే శాస్త్రం అని స్పష్టం.

పూర్వోత్తరమీమాంసలు రెండూ కలిపి ఒకే శాస్త్రం అన్నది మన పూర్వాచార్యులు దర్శించిన పద్ధతి అన్న ఈవిషయాన్ని కొంచెం వివరిస్తాను. *"సంహితం ఏతత్ శారీరకం జైమినీయేన షోడశ లక్షణేన ఇతి శాస్త్రైకసిద్ధిః"* అని వృత్తికారులైన శ్రీబోధాయనులవారు సాయించేరు. *"అంగాని వేదాః చత్వారమీమాంసా న్యాయవిస్తరః । పురాణం ధర్మశాస్త్రంచ విద్యాహ్యేతా చతుర్దశ"* అని పద్నాలుగు విద్యాస్థానాలని చెప్పినప్పుడు *"మీమాంసా"* అని ఏకవచనప్రయోగంవల్ల మీమాంసాశాస్త్రం ఒకటే అని చెప్పబడుతోంది. వేదత్వం నాలుగువేదాలకీ అవిశిష్టమై ఉన్నప్పటికీ *"పురాణం ధర్మశాస్త్రంచ"* అని రెండు విద్యాస్థానాలుగా విభజించి చెప్పబడినదే. అదే విధంగా కర్మమీమాంస, దేవతామీమాంస, బ్రహ్మమీమాంస అని మూడూ మీమాంస అనే ఒకే పదంతో చెప్పబడడంవల్లా, మూడూ వేరువేరుగా మూడు శాస్త్రాలుగా ఎందుకు తీసుకోకూడదంటే కాదు. అనాదిసిద్ధవ్యవహారంవల్ల - అంటే వేదాలు నాలుగనీ, పురాణం, ధర్మశాస్త్రం అని విడిగా చెప్పడం ఉన్న వ్యవహారంవల్ల అది తప్పులేదు. మీమాంస ఇలా ఒకరిచేతగాని ఒకచోటగాని వేరుచేసి చెప్పబడలేదు. ఏకవచనంగానే అంతటా కనబడుతోంది.

కర్తృభేదం శాస్త్రభేదంకాదన్నదికూడా చాలా ఆధారాలతోమనం తెలుసుకోవచ్చు. ఆపస్తంబసూత్ర వ్యాఖ్యానం ధూర్తస్వామి, కపర్ది అన్న ఇద్దరిచేతా చెయ్యబడిఉన్నా వ్యాఖ్యేయమైన (మూలమైన) ఆపస్తంబ సూత్రగ్రంథంతాలూకు ఏకత్వంవల్లనే ఒకటే అనే మనం చెప్పుకుంటాం. వామనులు, జయాదిత్యులు అన్న ఇద్దరు పాణిని సూత్రాలకి పూర్వోత్తరవృత్తిగ్రంథాలని అనుగ్రహించినప్పటికీ, వ్యాఖ్యేయైక్యంవల్ల ఐక్యం అనే మనం గ్రహిస్తున్నాం. మనుస్మృతి మనువువల్ల ప్రారంభింపబడి, భృగువుచేత ఉపసంహరింపబడింది. అయినప్పటికీ, శాస్త్రభేదం చెప్పుకోకుండా శాస్త్రైక్యాన్నే చెప్పుకుంటున్నాం. భోజరాజు, లక్ష్మణసూరి అనే ఇద్దరిచేత చంపూరామాయణం అనేగ్రంథం రచింపబడ్డా, అది ఒకేగ్రంథంఅనే చెప్పబడుతోంది. ఛాందోగ్యంలో ఉపకోసలవిద్యాప్రకరణంలో ఉపదేష్టలు వేరువేరైనా, విద్యకి భేదం చెప్పబడలేదు. అలాగే, ఇక్కడకూడా, జైమిని, కాశకృత్స్నులు, వేదవ్యాసులు అని కర్తృభేదం ఉన్నా శాస్త్రభేదం లేదు. ఏకశాస్త్రం అనే గ్రహించాలి. కర్మం, దేవత, బ్రహ్మం వేదాంతార్థం.

ఇలా మూడు కాండలుగా మీమాంసాశాస్త్రం ఉన్నప్పటికీ, కర్మవిచారమైనా, దేవతావిచారమైనా, బ్రహ్మవిచారమైనా, ఈమూడూ మూడు విషయాలనిగురించి - అంటే, కర్మమీమాంసకి కర్మం, దేవతా మీమాంసకి దేవతలూ, బ్రహ్మమీమాంసకి బ్రహ్మం విషయంకావడంతో, మీమాంసలకి విషయభేదంతో భేదం చెప్పవచ్చే అంటే, వీటివల్ల చెప్పబడే అర్థం ఏకార్థం అని ఐకార్థ్యతని బట్టి, *"అర్థైకత్వాత్ ఏకం వాక్యం సాకాంక్షం చేత్"* అన్న పూర్వమీమాంసాసూత్రంప్రకారం ఏకార్థప్రతిపాదకంగనుక ఒకే శాస్త్రం అని చెప్ప బడుతోంది. కర్మకాండంలో చెప్పబడుతున్న కర్మలు పరమాత్మ ఆరాధనలే. దేవతాకాండంలో చెప్పబడ్డ దేవతలు పరమాత్మశరీరభూతులు. బ్రహ్మకాండంలోచెప్పబడ్డ బ్రహ్మం సర్వకర్మసమారాధ్యమైన సర్వ దేవాంతరాత్మభూతమైన బ్రహ్మం నారాయణశబ్దవాచ్యం అవుతుందనే ఒకేఅర్థాన్ని మీమాంసాత్రయసారం అని స్పష్టం అవుతోంది. అంచేత ఇది ఒకేశాస్త్రం అవుతుంది. పూర్వకాండోక్త కర్మలు ఆరాధనరూపాలు. వాటికి ఆరాధ్యవస్తువేది అన్న ఆకాంక్షకి శాంతి ఉత్తరకాండమైన ఉపనిషత్తులవల్ల కలుగుతుంది. ఉపనిష త్ప్రతిపాద్యమైనబ్రహ్మం ఆరాధ్యం. దీనికి తిరువారాధనం ఏదనేఆకాంక్షని శమనంచేసేది పూర్వకాండమనే వేదం. ఇలా ఆరాధనవిశిష్టఆరాధ్యుడు బ్రహ్మశబ్దవాచ్యుడైన నారాయణుడు అన్నఒకేఅర్థం పూర్వోత్తరభేద భిన్న వేదార్థంఅవుతోంది. ఈవేదవేదాంగాలనే వ్యాఖ్యేయాలకి (మూలానికి) వ్యాఖ్యానరూపాలే మీమాంసలు. వ్యాఖ్యేయాలకుండే పౌర్వాపర్యం, ఐక్యంకూడా వ్యాఖ్యానాలకీకుదురుతుందన్నదే శ్రీభాష్యసారమౌతుంది.

సకలవేదవేద్యత్వం, సర్వధర్మప్రవర్తకత్వం, సర్వదేవాంతరాత్మతయా సర్వకర్మసమారాధనీయత్వం సర్వధర్మఫలప్రదత్వం అన్న నాలుగూ పరమాత్మ లక్షణాలు. ఇవి కాండత్రయసారం అవుతాయి. అంతటా విచారింపబడినవాడు పరమాత్మే. కర్మకాండంలో ధర్మంగానూ, దేవతాకాండంలో దేవతాశరీరుడిగానూ, బ్రహ్మకాండంలో దేవతాఅనే కంచుకం విడిపోయిన సాక్షాత్ పరమాత్మగానూ విచారింపబడినవాడు ఆయనే అంటారు మన పెద్దలు. *"ధర్మేప్రమీయమాణే తు వేదేన కరణాత్మనా ఇతికర్తవ్యతాభాగం మీమాంసా పూరయిష్యతి"* అన్న వచనం ఇక్కడ అనుసంధేయం. కట్టెని రెండు భాగాలుగా చెయ్యడానికి కుఠారం (గొడ్డలి) అవసరం. అయినప్పుడు దాన్ని విసిరిపారేసిన తర్వాత మళ్ళీ తెచ్చుకోవాలిగదా? కట్టెని రెండు ముక్కలుగా చేయడానికి సాధనం గొడ్డలి. దాన్ని కిందకి విసిరేయడం ఒక అంగం. ఇతి కర్తవ్యతా అనేది కూడా ఒకఅంగం అనేది పర్యాయం. అలాగే కర్మజ్ఞానానికి వేదం కరణం. వేదార్థవిచారమైన మీమాంసా శాస్త్రం ఇతికర్తవ్యతే అవుతుంది. లేకపోతే వేదం ధర్మప్రమాణంగా ఉండదన్నమాట. కర్మభాగార్థనిర్ణయం కర్మమీమాంసవల్లనూ, దేవతాభాగార్థనిర్ణయం దేవతామీమాంసవల్లనూ, బ్రహ్మభాగార్థనిర్ణయం బ్రహ్మ మీమాంసవల్లనూ జరుగుతాయన్నమాట. ఇలా విషయైక్యతతోనూ, ప్రయోజనైక్యతతోనూ, ప్రవృత్తి ప్రకారైక్యతతోనూ, ఇవి ఒకే శాస్త్రం అన్నదాన్ని మనపూర్వులు విస్తారంగా నిరూపించేఉన్నారు.

పూర్వకాండోక్తకర్మలనే అంగాలకి అంగి ఏది? అనే ఆకాంక్షని ఉత్తరకాండమున్నూ, ఉత్తర కాండోక్తమైన జ్ఞానమనే అంగికి అంగం ఏదనే ఆకాంక్షని పూర్వకాండమున్నూ శమనం చెయ్యడంవల్ల, *"కర్మాంగం జ్ఞానం ఉపాయం"* అన్న ఒకే అర్థాన్ని తెలియజెయ్యడంవల్ల ఒకే శాస్త్రం అనికూడా అంటారు ఐకశాస్త్ర్యవాదులైన మన పూర్వులు. కర్మజ్ఞానాలకి అంగాంగీభావంవల్ల సముచ్చయాన్ని ఎంబెరుమానార్లు

భావించేరు. ఇదే *"విద్యాంచ అవిద్యాంచ యస్తద్వేద ఉభయం సహ। అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృతమశ్నుతే॥"* అన్న ఉపనిషద్వాక్యార్థం అనేది మన స్వామి భావన.

ఈవాక్యానికి అద్వైతులు చేసే వ్యాఖ్యానం ఎలా ఉంటుందంటే - ***కర్మజ్ఞానాలు పరస్పరవిరుద్ధాలు. కర్మ భేదావలమ్బి. జ్ఞానం అభేదావలంబి. కనుక, వీటికి అనుష్ఠానంలో సాహిత్యం (ఒకటిగా కలిసి ఉండడం)***

***కుదరదు. అయినప్పటికీ, జ్ఞాతవ్యత్వే సాహిత్యం కుదురుతుంది. ఉపాదేయత్వేన జ్ఞాతవ్యం జ్ఞానం. త్యాజ్యత్వేన జ్ఞాతవ్యం కర్మం.*** జ్ఞానం స్వీకరించతగినదనే కర్మం వదిలివేయతగిందని తెలుసుకోవలసినదనే మీదివాక్యానికి మొత్తంమీద అర్థం అని.

ఈవ్యాఖ్యానం అయుక్తం అన్నది శ్రీభాష్యకారుల భావం. అంటే, - కర్మలు కర్తవ్యాలుగా వేదాంత విహితాలుగనుక, అవి త్యాజ్యం అనడం వేదాంతవిరుద్ధం. పైగా, ఈవాక్యంలోనున్న *"తీర్త్వా"* అనే పదానికి *"పొంది"* అని అర్థం చెప్పడం అప్రసిద్ధిదోషప్రాహతం. *"మృత్యుం తీర్త్వా"* అన్నప్పుడు *"స్థితశ్చేత్"* అన్న రెండు పదాలని చేర్చి వ్యాఖ్యానించడంవల్ల, అధ్యాహారదోషప్రసంగంకూడా వస్తుంది. కనుక, అద్వైతుల వ్యాఖ్యానం అసంగతం అన్నమాట.

వెనక చెప్పిన వాక్యానికి యాదవప్రకాశులు చేసిన వ్యాఖ్యానం ఇలా ఉంటుంది - జ్ఞానకర్మలు సమప్రధానోపాయాలుగా జ్ఞాతవ్యాలు. ఉపాయాలుకూడా రెండు- జ్ఞానం,కర్మ. ఇది పూర్వవాక్యార్థం. ఉపేయాలూ రెండు. అనిష్టనివృత్తి, ఇష్టప్రాప్తి. అనిష్టనివృత్తిరూపఫలానికి కర్మం ఉపాయమనిన్నీ, ఇష్టప్రాప్తిరూపఫలానికి జ్ఞానం ఉపాయమనిన్నీ - ఇది ఉత్తరవాక్యార్థం. సాధనసాధ్యద్విత్వ అంగీకారేణ పూర్వోత్తర వాక్యాలకి అర్థంచెప్పడం యుక్తంకాదని శ్రీభాష్యకారులభావం. అంటే, ఉపాయం జ్ఞాన మొక్కటే, మరో ఉపాయంలేదు అని. ఉపనిషత్తులో *"తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి, నాన్యః పన్థా అయనాయ విద్యతే"* అన్న వాక్యంలో చెప్పబడడంవల్ల ఉపాయం రెండు అని చెప్పడం వేదాన్తవిరుద్ధం. *"తమేవ విదిత్వా అతిమృత్యుమేతి"* అన్న వాక్యంలో అనిష్టనివృత్తి ఫలం అనిన్నీ, అది జ్ఞానసాధ్యం అనిన్నీ చెప్పబడడంవల్ల అనిష్టనివృత్తి కర్మఫలం అన్నదికూడా తగినదికాదు. అనిష్టనివృత్తి కలిగిందీ అంటే ఇష్టప్రాప్తి దానివెంటనే సిద్ధిస్తుంది. కనుక, సాధ్య(ఫల)ద్విత్వం చెప్పడం వేదాంతవిరుద్ధమే అవుతుంది. ఇలా జ్ఞాన కర్మలకి సమప్రాధాన్యం అన్న యాదవప్రకాశులపక్షంకూడా అనాదరణీయమే. అంగాంగీభావేన సాహిత్యం అనే పక్షమే ఆదరణీయం అని నిర్ధారణ అయినట్టే.

అంగాంగీభావాన్ని జ్ఞానకర్మలకి భాస్కరులుకూడా అంగీకరించినా, ఆయన కర్మని జ్ఞానోత్పాదకత్వేన అంగం అని అంగీకరించకుండా ఉత్పన్నజ్ఞానానికి అనుగ్రాహకం అంటారు. కర్మం జ్ఞానోత్పాదకం ఉత్పన్నజ్ఞానవర్ధకం అనే శ్రీభాష్యకారులభావం. ఇలా అంగాంగిలని పూర్వోత్తరకాండలు ప్రతిపాదిస్తున్నాయి గనుక ఒకే శాస్త్రం అన్నది మనపూర్వులు దర్శించిన పద్ధతి. ఆళవందారుకూడా, ఈవిషయాన్ని మనకి చూపించేరు. శంకరులుకూడా ఈభావానికి విరుద్ధంగానే కొన్నిచోట్ల చెప్పినా, వారుకూడా ఈఐకశాస్త్ర్యవాదాన్ని అంగీకరించేరన్నది వారిభాష్యంలో ఒకచోట చెప్పబడిఉన్నది అన్న

విషయాన్ని మన పూర్వులు ఎత్తి చూపించేరు.

కర్మజ్ఞానాలకి అంగాంగీభావంవల్ల సముచ్చయాన్ని ఎంబెరుమానార్లు భావించేరనీ, ఇదే "*విద్యాంచ అవిద్యాంచ యస్తద్వేద ఉభయం సహ। అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృతమశ్నుతే॥*" అన్న ఉపనిషద్వాక్యానికి అర్థం అన్నది మన స్వామిభావన వెనుక విన్నపించేను. ఇది మనం చాలా అవశ్యంగా తెలుసుకోవలసిన - మనస్వామి పరమకృపతో మనకి చూపిన, యథార్థం.

ఈఈశావాస్యోపనిషద్వాక్యానికి మన స్వామి సాయించి ఉన్న వ్యాఖ్యానాన్ని అనుసరించి వివరించే మన పూర్వులు చూపిన అర్థవిశేషాలని శ్రీవైష్ణవ సుదర్శనం పత్రికా సంపాదకులైన ఉ.వే పుత్తూర్ కృష్ణస్వామి అయ్యంగార్ స్వామి అనుగ్రహించిసాయించిన ఒక వ్యాసరూపంగా ఇక్కడ అనుభవిద్దాం.

### *12. కర్మజ్ఞానాలకి అంగాంగీభావం..*

***"విద్యాంచ" శ్రుత్యర్థం.***

శ్రీవైష్ణవ సుదర్శనం పత్రికాధిపతి

శ్రీ ఉ.వే. కృష్ణస్వామి అయ్యంగార్ స్వామి.

*విద్యాంచ అవిద్యాంచ యస్తద్వేద ఉభయం సహ।*

*అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృతం అశ్నుతే॥* ఎవడు (మోక్షాన్ని కోరుకునేవాడు), విద్యాంచ = (వెనుక చెప్పిన జ్ఞానరూపమైన) బ్రహ్మవిద్యను, అవిద్యాంచ = విద్యకంటే వేరైన (విద్యకి అంగమైన) కర్మయోగమున్నూ, తత్ ఉభయం = ఆరెండింటినీ, సహ = ఒకదానితో ఒకటి చేరియున్నవిగనే, వేద = తెలుసుకొంటున్నాడో, సః = వాడు, అవిద్యయా = వెనుక చెప్పిన కర్మవలన, మృత్యుం = విద్యకు ఆటంకమైన పుణ్యపాప కర్మలను, తీర్త్వా = పోగొట్టుకొని, విద్యయా = బ్రహ్మవిద్యవల్లనే, అమృతం = పరమాత్మని, అశ్నుతే = పొందుతున్నాడు.

ఈమంత్రం ఈశావాస్యోపనిషత్తులోని పదకొండో మంత్రం. ఈఉపనిషత్తులో మొదటి మంత్రంలో "***స్వామియైన పరమాత్మకి ఈలోకం అంతా సొత్తు అవుతుంది.***" అనే తత్త్వజ్ఞానరూపమైన పరవిద్య ముముక్షువుకి సంగ్రహంగా ఉపదేశింపబడింది. రెండోమంత్రంలో "***విద్యకి అంగంగా కర్మయోగాన్ని అనుష్ఠించడంకూడా అవశ్యం***" అని సంగ్రహంగా చూపబడింది. మొదటి రెండు మంత్రాల్లోచూపబడిన పరవిద్య, కర్మయోగం అనుష్ఠించకుండా, ఉన్నవాళ్ళకి విపరీతఫలం కలుగుతుంది అని తెలియజెయ్యడం ద్వారా ఆరెండింటినీ అనుష్ఠించడం అవశ్యం అని మూడోమంత్రంలో తెలియజేయబడింది. నాలుగో మంత్రం నించి ఎనిమిదో మంత్రం వరకూ మొదటి మంత్రంలో చెప్పబడిన పరవిద్యవిషయంలో అనుసంధించవలసిన పరావర తత్త్వాలని గురించిన యథార్థమైన జ్ఞానమున్నూ, ఇలా అనుసంధించడంవల్ల శోకమోహాలు లేకపోవడం అనే అవాంతరఫలం లభిస్తుంది అన్నది చెప్పబడింది. రెండో మంత్రంలో సూక్ష్మంగా చెప్పబడిన కర్మం కూడా పరవిద్యతోబాటు తప్పకుండా బాగా అనుష్ఠించబడాలి అని స్పష్టంగా స్థిరంగా చెప్పడంకోసం తొమ్మిదీ, పదీ మంత్రాల్లో విపరీతఫలం

కలిగిస్తుందిగనుక విద్యాకర్మలు రెండింటినీ వేరువేరుగా అనుష్ఠించకూడదనీ, విద్య, కర్మలు రెండింటివల్లా కలిగే రెండు ఫలాలూ ముముక్షువుకి అవసరంగనుక, వేరువేరు ఫలాలున్న ఆరెండింటినీ వేరువేరుగా అనుష్ఠిస్తే మోక్షఫలం లభించదనీ నిరూపించబడింది. ఇప్పుడు ముముక్షువుకి కావలసిన ఆవిద్యాఫలం, కర్మఫలం ఏవి అనే ప్రశ్న వస్తే, దానికి సమాధానం చెప్తూ విద్యనీ, కర్మని, అంగిగానూ, అంగంగానూ కలిపే అనుష్ఠించాలి అని స్థాపిస్తోంది ఈమంత్రం.

వ్యాఖ్యానం: *(యః)* ముముక్షువైనవాడు, *(విద్యాం చ అవిద్యాంచ తత్ ఉభయం)* వెనక చెప్పబడిన జ్ఞానరూపమైన బ్రహ్మవిద్యనీ, విద్యకంటే, వేరైనదీ, తరువాతి జన్మఫలానికి ఉపకారమైఉండే విషయంలో దానికి తగినదిన్నీ, అంగంకనుక, విద్యకి దగ్గరదైన వర్ణాశ్రమ విహితకర్మం అయిన ఆరెండింటినీ, *(సహ వేద)* అంగంగానూ, అంగిగానూ, ఒకదానితో ఒకటి కలిసి ఉన్నవిగా తెలుసుకుంటున్నాడో. తెలుసుకున్నందుకు ఫలం అనుష్ఠానమేగనుక, ఇక్కడ "**తెలుసుకున్నాడో**" అన్నది "***తెలుసుకొని కర్మని అంగంగానూ, విద్యని అంగిగానూ, కలిపి అనుష్ఠిస్తున్నాడో***" అని అర్థం వస్తోంది. ఆయా కర్మలని వాటివాటి ఫలాలని కోరుకోవడం తో అనుష్ఠిస్తే, మోక్షానికి విరోధియైన వేరు ఫలాలని కలిగించుతుందిగనుక, విద్యకి ఆటంకం కలుగుతుంది. ఫలాపేక్షని వదిలి వెనుక చెప్పినట్లుగా అంగంగానూ, అంగిగానూ, కర్మాన్నీ, పరవిద్యనీ కలిపే అనుష్ఠానంచెయ్యాలి అని భావం. యచ్ఛబ్దం ఉన్న వాక్యంలో తచ్ఛబ్దంకూడా వచ్చే తీరాలిగనుక "*సః*" అనే పదాన్ని తెచ్చుకోవాలి - "**ముముక్షువైన వాడు**" అన్నట్టుగా. ***(అవిద్యయా)*** వెనుక చెప్పిన కర్మవలన ***(మృత్యుమ్)*** పరవిద్య కలగడానికి ఆటంకంగా ఉండేదై, పుణ్యపాపరూపమైన ప్రాచీన కర్మలన్నింటినీ *(తీర్త్వా)* పోగొట్టుకొని *(విద్యయా)* బ్రహ్మవిద్య అనే జ్ఞానవలన ***(అమృతమ్)*** బ్రహ్మాన్ని అశ్నుతే- పొందును.

ఇక్కడ అవిద్యాశబ్దానికికర్మయోగం అనిన్నీ, మృత్యుశబ్దానికి జ్ఞానం కలగడానికి ఆటంకంగా ఉండే పుణ్యపాపరూపమైన అనాదియైన పాపాలనీ, అమృతశబ్దానికి బ్రహ్మము అనిన్నీ అర్థం తీసుకోవడం జిజ్ఞాసాధికరణశ్రీభాష్యాన్ని అనుసరించినదే.

*"అత్ర అవిద్యాశబ్దాభిహితం వర్ణాశ్రమవిహితం కర్మ, అవిద్యయా - కర్మణా, మృత్యుం - జ్ఞానోత్పత్తి విరోధి ప్రాచీనం కర్మ, తీర్త్వా - వ్యపోహ్య, విద్యయా - జ్ఞానేన, అమృతం - బ్రహ్మ ప్రాప్నోతి ఇత్యర్థః మృత్యుతరణోపాయతయా ప్రతీతా అవిద్యా విద్యేతరవిహితం కర్మైవ"* (ఈమంత్రంలో అవిద్యాశబ్దంచేత వర్ణాశ్రమవిహితకర్మ చెప్పబడుతోంది. అవిద్యవల్లనే - అంటే కర్మవల్లనే - మృత్యువుని - అంటే జ్ఞానం కలగడానికి ఆటంకం అయిన పూర్వపాపాలని పోగొట్టుకొని విద్య అనే జ్ఞానంవల్ల అమృతం అనబడే బ్రహ్మాన్ని పొందుతున్నాడు అని అర్థం. మృత్యు అనబడే పూర్వపాపాలని పోగొట్టుకోవడానికి ఉపాయంగా చెప్పబడిన అవిద్య విద్యకంటే వేరైన కర్మమే అవుతుంది) అన్నది జిజ్ఞాసాధికరణశ్రీభాష్యం. దీన్నించి "***బ్రహ్మ విద్య పూర్తిచెందడానికి ఆటంకంగా ఉన్న మృత్యుఅనబడే పుణ్యపాపాలనే ముందరి పాపాలని నాశంచెయ్యడమే అవిద్య అనబడే వర్ణాశ్రమాలకినిర్ణయించబడిన కర్మల ఫలం***" అనిన్నీ, "**అమృతం**" అనబడే బ్రహ్మాన్ని పొందడమే విద్యతాలూకు "**ఫలం**" అనీ స్పష్టం అవుతోంది.

అందులో మొదటి ఫలం అనే పూర్వపాపాలు నశించడం పూర్తిగాకపోతే, బ్రహ్మవిద్య పూర్తి అవదు. ఆస్థితిలో పరమపురుషార్థమైన బ్రహ్మప్రాప్తి అనే రెండో ఫలం సిద్ధించదు. కనుక, మొదటి ఫలానికి సాధనమై ఉండడం వర్ణాశ్రమానకి తగిన కర్మమనే అవిద్య అనీ, రెండో ఫలానికి సాధనమైఉన్నది జ్ఞానరూపమైన విద్య అనీ స్పష్టం అవడంవల్ల ఒకదానితో ఒకటి వ్యతిరేకించకుండా ఉండడంకోసం కర్మాన్ని అంగంగానూ, విద్యని అంగిగానూ తీసుకొని ముముక్షువైనవాడు రెండింటినీ చేర్చి అనుష్ఠించాలి అనే తేల్తోంది. ఇక్కడ ఈక్రింది ఆక్షేపం వస్తోంది.

*"అపి చేతసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః।*
*సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సన్తరిష్యసి॥*
*యథైధాంసి సమిద్ధోగ్నిః భస్మసాత్ కురుతేఽర్జున।*
*జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా॥*
*నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే॥*  (గీత 4-36,37,38)

(సమస్త పాపులకంటెను, మహాపాపిగా నువ్వు ఉన్నా, ఆసమస్తపాపసముద్రాన్నీ జ్ఞానం అనే పడవవల్లనే దాటుతావు. అర్జునా! విసరబడి మండేటటువంటి నిప్పు కట్టెలని ఎలా భస్మంచేస్తోందో, అదేవిధంగా జ్ఞానమనే అగ్ని పూర్వపాపాలనే కట్టెలని భస్మం చేస్తోంది. ఈలోకంలో జ్ఞానానికి సాటియైనది శుద్ధిని కలిగించే విషయంలో వేరైనదేదీ లేదు) అనే గీతావాక్యం వల్ల జ్ఞానమే అన్ని పాపాలనీ నశింపజేయగలది అని తెలుస్తోంది.

***తమేవ విదిత్వా అతిమృత్యుమేతి నాన్యః పన్థాః*** (శ్వే. 3) (ఆపరమాత్మని తెలుసుకుంటే మృత్యువుని నశింపజేస్తాడు, దీన్ని చెయ్యడం తప్పిస్తే మరో దారి లేదు) అని శ్వేతాశ్వతర ఉపనిషత్తులో జ్ఞానమే మృత్యువుని పోగొట్టగలదిగా చెప్పబడింది. అలా ఉంటే, "***కర్మమే మృత్యువుని పోగొట్టుతుంది, బ్రహ్మని పొందడం విద్యతాలూకు ఫలం అవుతుంది***" అని విద్యాకర్మలకి వేరువేరు ఫలాలని చెప్పడం కూడా అది కారణంగా కర్మని అంగంగానూ, విద్యని అంగిగానూ తీసుకొని రెండింటినీ కలిపే అనుష్ఠించాలి అని చెప్పడం ఎలా కుదురుతుంది? అనేదే ఆ ఆక్షేపం.

దీనికి సమాధానం ఇలా ఉంటుంది - విద్య పూర్తిచేసుకున్న తర్వాత బ్రహ్మని పొందడానికి ఆటంకంగా ఉండే సమస్త కర్మలూ ఆవిద్యవల్ల నశింపజేయబడుతున్నాయన్నందువల్లనూ, విద్య కలగడానికి ఆటంకంగా ఉన్న పూర్వకర్మలనీ, ఉండకూడని ఆవిద్య ముందుగనే నశించసాధ్యంగాకపోవడంవల్లనూ, వెనుక చూపబడిన వాక్యాలూ వేదవాక్యమూ ఆపాపాలని నశింపజేసేవి అని చెప్పుతున్నవిగావు. కనుక, ఆవిద్య కలగడానికి ఆటంకంగానున్న పాపాలని వెనుకచెప్పిన కర్మయోగమే పోగొట్టుతుందని వెనుక ఎత్తిపెట్టి చూపబడిన శాస్త్రాల్లోంచే సిద్ధించడంవల్ల, ఆపాపాలు పోవడం కర్మవల్లనవీ, విద్యవల్ల బ్రహ్మప్రాప్తి కలుగుతోందనీ, దానివల్లనే కర్మం విద్యఅనే రెండింటినీ అంగంగానూ, అంగిగానూ కలిపే అనుష్ఠించాలని స్పష్టం అవుతోందని చెప్పడానికి ఏఅభ్యంతరమూ లేదు. అందువల్లనే వెనుక ఎత్తుకున్న గీతావాక్యాల ననుసరించి "*తత్ స్వయం యోగసంస్థితః కాలేనాత్మని విన్దతి*" (గీత -4-38) (అటువంటి జ్ఞానాన్ని (వెనుకచెప్పిన) కర్మయోగసిద్ధి పొందినవాడు తన ఆత్మలో

పొందుతున్నాడు.) అని జ్ఞానానికి కర్మం అంగంగా ఉన్నదన్న విషయం నిర్ణయింపబడింది. ఇందువల్లనే గీతాశాస్త్రంలో 18వ అధ్యాయంలో వర్ణాశ్రమధర్మాలకి తగిన కర్మలని వివరించిన తర్వాత *"స్వే స్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః। స్వకర్మనిరతస్సిద్ధిం యథా యథా విన్దతి తచ్ఛృణు॥"* (గీత- 18-45) (తమతమకి తగిన కర్మలని అనుష్ఠించే మనుష్యుడు పరమపదాన్ని పొందుతున్నాడు. తన కర్మని అనుష్ఠించేవాడు పరమపదం ఎలా పొందుతున్నాడన్నది వివరిస్తాను విను) అని మొదలుపెట్టి, కర్మయోగానికి విద్యోత్పత్తి ఫలంగనుక, విద్యాఫలమైన బ్రహ్మప్రాప్తిని గురించి కర్మయోగం పరంపరాకారణమైందని కృష్ణుడు నిరూపించడంకూడా ఈవిషయాన్నే స్థిరపరుస్తోంది.

*"ఇయాజసోపి సుబహూన్ యజ్ఞాన్ జ్ఞానవ్యపాశ్రయః।*
*బ్రహ్మవిద్యామధిష్ఠాయ తర్తుం మృత్యుం విద్యయా॥"* (వి.పు. 6-6-12)

(ఆకేశిధ్వజమహారాజు ఆత్మజ్ఞానం కలిగినవాడై బ్రహ్మోపాసనం చేసేవాడుగా ఉంటూ బ్రహ్మోపాసనానికి ఆటంకంగానున్న పూర్వకర్మలని కర్మయోగంద్వారా దాటడానికి అనేక యాగాలని చేసేడు) అని శ్రీవిష్ణుపురాణంలో ఈమంత్రమే చాలాస్పష్టంగా వివరించబడింది. *"జ్ఞానవ్యపాశ్రయః"* అనినీ, *"బ్రహ్మవిద్యాం అధిష్ఠాయ"* అనినీ చెప్పడంవల్ల కేశిధ్వజమహారాజు మోక్షేచ్ఛగల ముముక్షువు అని తెలియబడుతోంది. *"అవిద్యయా మృత్యుం తీర్త్వా"* అని ఈమంత్రంలో చెప్పినదే *"తర్తుం మృత్యుం అవిద్యయా"* అని ఉపబృంహణం (వివరించడం) చేసి అవిద్యాశబ్దంచేత చెప్పబడేది కర్మమే అన్నది *"సుబహూన్ యజ్ఞాన్ ఇయాజ"* అనే మాటలవల్ల వివరించబడింది. *"బ్రహ్మవిద్యామధిష్ఠాయ అవిద్యయా మృత్యుం తర్తుం"* అనడంవల్ల బ్రహ్మవిద్య కలగడానికి ఆటంకమైన పూర్వపాపాలని *"మృత్యు"* శబ్దంతో తెలియజేయబడుతున్నాయి అని స్పష్టం అవుతోంది.

*"అవిద్యా కర్మసంజ్ఞాన్యా"* (వి. పు. 6-7-61) అని శ్రీవిష్ణుపురాణంలోనే తరువాతి అధ్యాయంలో విద్యకంటే భిన్నమైన క్రమమే అవిద్య అనబడుతోంది అని ఘోషింపబడుతోంది. వీటివల్ల ఈమంత్రానికి శ్రీభాష్యకారులు సాయించిన అర్థమే శ్రీపరాశరమహర్షి ఆదరించినది అని తెలుస్తోంది.

*"తపో విద్యా చ విప్రస్య నిశ్శ్రేయస్కరం పరం। తపసా కిల్బిషం హన్తి విద్యయా అమృతమశ్నుతే॥"* (మను. 12-104) (బ్రహ్మన్ని ఉపాసించిన బ్రాహ్మణుడికితపస్సైన కర్మం, విద్యయనే ఉపాసనం, ఉత్తమమైన మోక్షోపాయాలు. తపస్సువల్ల (ఉపాసనకి ఆటంకాలైన) పాపాన్ని పోగొట్టుకుంటున్నాడు. ఉపాసనంవల్ల బ్రహ్మన్ని పొందుతున్నాడు) అని మనుస్మృతిలోకూడా ఈమంత్రంలోనున్న పదాలనీ, వాటి పర్యాయ పదాలనీ ఉపయోగించి ఇలా విశదీకరించి ఉండడంవల్ల ఈఅర్థం మనుమహర్షికూడా ఆదరించినదే అని తెలుస్తోంది. *"ధర్మేణ పాపమపనుదతి"* (తై. నా. 63) (కర్మయోగంతో పాపాన్ని పోగొట్టుకుంటాడు) అని ఉపనిషద్వాక్యం, *"అవిద్యయా మృత్యుం తీర్త్వా"* అన్న ఈమంత్రభాగాన్ని స్పష్టంగా వివరించేదిగా ఉన్నదని గమనించతగ్గది. *"అవిద్యా"*శబ్దం *"ధర్మ"*శబ్దంవల్ల వివరించబడుతోందిగనుక, ఫలంలో సంగంలేని కర్మయోగాన్నీ, *"మృత్యు"*శబ్దం *"పాప"*శబ్దంవల్ల వివరించబడుతోందిగనుక ఉపాసనకి ఆటంకమైన పాపాలని *"తీర్త్వా"* అన్న శబ్దం *"అపనుదతి"* అన్న

శబ్దంవల్ల వివరించబడడంవల్ల *"పోగొట్టుకోవడం"* అనే అర్థాన్ని సూచిస్తుంది అని స్పష్టంగా వివరించబడింది.

ఇక మరొక ఆక్షేపం ఉన్నది అదేంటంటే - *"కర్మణా పితృలోకో విద్యయా దేవలోకః"* (బృహ 3-5-16) (కర్మవలన పితృలోకం లభిస్తుంది, విద్యవల్ల దేవతల లోకమైన పరమపదం లభిస్తోంది) అని ఉపనిషత్తులో కర్మవల్ల నశించేఫలమున్నూ, విద్యవల్ల నాశంలేని ఫలమున్నూ చెప్పబడడం వ్యతిరేకించేవిగదా అని. దీనికి సమాధానం ఏమిటంటే - ఇక్కడ క్రమం అనేది ఫలంలో సంగంతో చెయ్యబడే కర్మమే. ఫలంలో సంగంతో చేసిన కర్మవలన నశించే ఫలాలే లభిస్తాయనిన్నీ, ఫలసంగంలేకుండా చేయబడే కర్మం పరవిద్యని కలుగజేస్తుందనీ దాని మూలంగా మోక్షానికి కారణం అవుతుందనీ ఎన్నో శ్రుతివాక్యాలవల్ల స్పష్టం.

*"అథ యే యజ్ఞేన దానేన తపసా లోకాన్ । జయన్తి తే ధూమమభిసంభవన్తి॥"* (బృహ 8-2-16) (యజ్ఞం, దానం, తపస్సు మొదలైన కర్మలవల్ల పుణ్యలోకాలని జయించేవాళ్ళు ధూమాదిమార్గంద్వారా వెళ్తారు) *"అథ య ఇమే గ్రామే ఇష్టాపూర్తం దత్తమిత్యుపాసతే తే ధూమమభిసంభవన్తి"* (ఛాం. 5-10-3) (గ్రామంలో యాగం చెయ్యడం, చెరువు తవ్వించడం దానం చెయ్యడం వంటి కర్మలని చేసేవాళ్ళు ధూమాదిమార్గంలో వెళ్తారు) వంటి వేదవాక్యాల్లోనూ,

*"త్రైవిద్యా మాం సోమపాః పూతపాపాః యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే।*
*తే పుణ్యమాసాద్య సురేంద్రలోకం అశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్॥"* (గీత 9-20)

(మూడు వేదాల్లో పూర్వభాగంలో చెప్పబడిన ధర్మాల్లోమాత్రం స్థిరంగా ఉన్నవాళ్ళై, (ఇంద్రుడు మొదలైన వాళ్ళనిగురించి చెయ్యబడే యాగశేషమైన) సోమరసాన్ని పానం చేసినవాళ్ళై, (స్వర్గం మొదలైనవాటిని పొందడానికి ఆటంకంగానున్న) పాపాలనుంచి విడవబడ్డవాళ్ళై (ఇంద్రుడు మొదలైన దేవతలనిమాత్రం గురించిన) యజ్ఞాలవల్ల (ఆదేవతలకి అంతర్యామిగానున్న) నన్ను గురించే (యథార్థంగా) యాగం చేసి (ఇంద్రుడు మొదలైనవారివద్ద) స్వర్గాన్ని కోరుకుంటున్నారు. వాళ్ళు ఈలోకదుఃఖాలు లేని దేవేన్ద్రలోకాన్ని పొంది అక్కడున్న అనేక స్థలాల్లో ఈలోకానుభవాలకంటే విశేషమైన దేవతల భోగాలని అనుభవిస్తుంటారు) మొదలైన స్మృతుల్లోనూ, ఫలసంగంతో అనుష్ఠింపబడే కర్మలకి నశించే ఫలాలే లభిస్తాయని చూపబడింది. *"తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి। యజ్ఞేన దానేన తపసాఽనాశకేన॥"* (బృహ 6-4-22) (యజ్ఞంచేతా, దానంవల్లా, ఉపవాసం మొదలైన తపస్సులవల్లనూ, వేదాధ్యయనంవల్లనూ, ఈపరమపురుషుడిని బ్రహ్మజ్ఞానులు తెలుసుకోగోరుతున్నారు) *"ధర్మేణ పాపమపనుదతి"* (ఫలసంగంలేని కర్మచేత పూర్వపాపములను పోగొట్టుకుంటున్నాడు.) మొదలైన వేదవాక్యాల్లో ఫలసంగంలేని కర్మలు బ్రహ్మప్రాప్తికి క్రమేణా కారణమైంది అని చూపబడింది. భగవద్గీతలో 18వ అధ్యాయంలో *"త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః। యజ్ఞదానతపఃకర్మన త్యాజ్యమితి చాపరే॥"* (గీత 18-3) (కొన్ని మతాలననుసరించినవాళ్ళు ***"దోషాలున్నది గనుకనే కర్మం వదలవలసినదే"*** అని చెప్పున్నారు. ***"యజ్ఞం, దానం తపస్సు మొదలైన కర్మలు వదలతగినవి"*** అని మరొకరకమైన జ్ఞానులు చెప్తున్నారు.) అని రెండు పక్షాలని ఎత్తుకొని *"యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్। యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్॥"* (18-5) (యజ్ఞం, దానం తపస్సు మొదలైన వైదిక కర్మలు ముముక్షువుచేత ఒక్కసారికూడా

వదలదగినవిగావు. ఆయుస్సున్నంతవరకూ ప్రతిదినమూ అనుష్ఠించవలసినవే ఎందువలననగా, ఉపాసించేవాళ్ళకి ఆకర్మలు ఉపాసన పూర్తి కావడానికి ఆటంకంగాఉన్న పూర్వాఘాలని పోగొట్టేవిగా ఉన్నాయి) అని ఫలసంగంలేని కర్మలు ముముక్షువుల్లకూడా అనుష్ఠింపబడవలసినవే అని భగవానుడు తన సిద్ధాంతంగా ప్రకాశింపజేసేడు. మూడో అధ్యాయంలోకూడా, *"కర్మణైవ హి సంసిద్ధిమాస్థితాః జనకాదయః"* (3-20) అని జ్ఞానులలో శ్రేష్ఠులైన జనకుడు మొదలైనవాళ్ళు కర్మయోగంవల్లనే సిద్ధిపొందినవాళ్ళని చూపేడు. నాలుగో అధ్యాయంలోకూడా, *"ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః। కురు కర్మైవ తస్మాత్ త్వం పూర్వైః పూర్వతరం కృతమ్॥"* (4-15) (ఈవిధంగా (నన్ను) తెలుసుకుని (పాపం పోగొట్టుకొనిన) పూర్వులైన ముముక్షువులవల్లకూడా వెనుక చెప్పిన కర్మయోగం చెయ్యబడ్డది. కనుక, నువ్వుకూడా ఆపూర్వులవల్ల చెయ్యబడిన పురాతనమైన కర్మయోగాన్నే అదేవిధంగా చేయుము) అని ముముక్షువులు కర్మని అవశ్యం అనుష్ఠించాలని చూపేడు. ఇదివరకు ఎత్తుకున్న శ్రీవిష్ణుపురాణశ్లోకాలుకూడా ఇదే భావాన్ని స్థిరీపర్చేయి. గీత 18వ అధ్యాయంలో దీనిగురించి కృష్ణుడు తన చివరి నిశ్చయాన్ని ఈక్రింది శ్లోకాల్లో చెప్పేడు.

*"ఏతాన్యపి కర్మాణి సంగం త్యక్త్వా ఫలానిచ । కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్॥"* (6) (ఈకర్మలని (ఉపాసనంలాగే) నాది అని తలంపుని, ఫలాన్నీకూడా వదిలి (ఉపాసనం పూర్తి అవడానికి ముముక్షువుచేత) తప్పక అనుష్ఠింపబడవలసినవే అనే నా అంతిమనిశ్చయం) *"అనిష్టమిష్టం మిశ్రంచ త్రివిధం కర్మణః ఫలం। భవత్యత్యాగినాం ప్రేత్య నతు సన్యాసినాం క్వచిత్॥"* (12) ( కోరదగని నరకము మొదలైనవాటిని, కోరదగిన స్వర్గం మొదలైనవి దుఃఖమిశ్రితమైన సుఖాన్ని కలిగించే పిల్లలు, పశువు, ఆహారము మొదలైన వి అని కర్మలకి మూడువిధాలైన ఫలం త్రివిధపరిత్యాగం చెయ్యనివాళ్ళకి ఆకర్మని అనుష్ఠించిన తర్వాత కలుగుతుంది. ఆమూడువిధాలైన పరిత్యాగంతోబాటు కర్మలని అనుష్ఠించేవాళ్ళకి మోక్షవిరోధియైన ఆఫలాలు ఒకప్పుడుకూడా కలగవు.) *"సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః। మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్॥"* (కామ్యకర్మంతోసహా అన్ని కర్మలూ నామీద కర్తృత్వం మొదలైనవి సమర్పించి ఎప్పుడూ అనుష్ఠించేవాడు నా కటాక్షంవల్ల స్థిరమైన ప్రయోజనమైన నన్నే పొందుతాడు.) *"చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః। బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తస్సతతం భవ॥"* (నిన్ను పరమాత్మవల్ల నియమింపబడే శరీరంగా తెలుసుకుని సమస్తకర్మలనీ అన్నివిధాలుగానూ నాకు సమర్పించి నన్నే ప్రయోజనంగా అనుసంధించేవాడై ఈబుద్ధియోగంతో నావద్ద మనస్సుని ఎప్పుడూ ఉంచు.) అనే శ్లోకాల్లో ఫలంమీద కోరికతో చెయ్యబడ్డ కర్మలే మోక్షవిరోధియైన స్వర్గాది ఫలాలని ఇచ్చేవని, ఫలాపేక్షలేని మూడువిధాల పరిత్యాగంతో అనుష్ఠించబడే కర్మలకి అటువంటి మోక్షవిరోధిఫలం లేదని, ఉపాసనవిరోధిపాపాలని పోగొట్టి ఉపాసనని పూర్తిచెయ్యడంద్వారా అవి క్రమంగా బ్రహ్మానుభవాన్ని కలిగించుతాయి అని గీతలో కృష్ణుడే ఘోషించడంవల్ల ఈవిషయం ఎవరిచేతనూ విరోధింపబడనిదే.

కనుక, *"కర్మణా పితృలోకః"* అన్నప్పుడు *"కర్మ"* శబ్దం ఫలంమీద కోరికతో చెయ్యబడే కర్మనే చూపుతోంది అనీన్నీ, ఈమంత్రంలో అవిద్యాశబ్దం సంగరహితమైన కర్మానుష్ఠానాన్ని చూపుతోంది గనుక ఈరెంటికీ ఏవిధమైన వ్యతిరేకతా లేదని తెలుస్తోంది. ఈవాక్యంలో పితృలోకశబ్దం బ్రహ్మలోకానికి జోడీగా నశించిపోయే లోకాలకి ఉపలక్షణం. దేవలోకశబ్దం *"యత్ర సాధ్యాస్సన్తి దేవాః"* (యజుర్. ఆరణ్యకం.

3-12-7) అని చెప్పబడిన విస్మృతిలేని అమరులైన నిత్యసూరులుండే నాశంలేని పరమపదాన్ని చెప్తోంది అనే తీసుకోవాలి.

కర్మ సాధ్యమైన నశ్వరమైన లోకాలకి ప్రత్యనీకంగానూ విద్యాసాధ్యంగానూ ఎత్తుకోబడడంవల్ల *"తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి"* (పురుషసూక్తం) అని విద్య అనే జ్ఞానంవల్లనే మోక్షం లభిస్తుంది అనిగదా చెప్తోంది. ఆపరమపదమే *"విద్యయా అమృతం అశ్నుతే"* అని ఈఉపనిషత్తులోకూడా చెప్పబడు తోందనే తీసుకోవాలి. విద్య మోక్షకారణం అని చెప్పడంవల్ల ఫలాపేక్షలేని కర్మయోగానికి మోక్షాన్ని గురించో, దానికి సాధనమైన విద్యనిగురించో ఏప్రయోజనం లేదని సిద్ధించదు. *"తమేతం వేదానువచనేన"* అని మొదలయ్యే వెనుక చెప్పిన వేదవాక్యంవల్లా, స్మృతివల్లా, కర్మయోగం విద్యావిరోధులని పోగొట్టి విద్యని కలుగజేసి వర్ధిల్లజేస్తుందని స్పష్టంగా తెలుస్తోందిగదా! దీనివల్లనే మరో వేదవాక్యంలో *"క్రియావానేషు బ్రహ్మవిదాం వరిష్ఠః"* (ముండక. 3-1-4) కర్మగలవాడే బ్రహ్మజ్ఞానుల్లో శ్రేష్ఠమైనవాడని చెప్పబడింది. *"సర్వాపేక్షా చ యజ్ఞాది శ్రుతేరశ్వవత్"* (శా.మీ. 3-4-26) ((గృహస్థులవద్ద బ్రహ్మవిద్య) అగ్నిహోత్రం మొదలైన సమస్తకర్మలనీ ఎదురు చూస్తుంది. *"యజ్ఞేన దానేన"* అని మొదలయ్యే వేదవాక్యంలో అట్లు చెప్పబడడంవల్ల, ***అశ్వవత్*** - (ప్రయాణానికి సాధనమైన) గుర్రం (తనకి తగిన జీను, కళ్ళెం మొదలైన పరికరాలని అపేక్షిస్తుంది)వలె.) *"సహకారిత్వేన చ"* (శా.మీ. 3-4-33) *"బ్రహ్మవిద్య* ***కలగడానికి సహకారిగా, (యజ్ఞాదికర్మలు అనుష్ఠించతగినవి) విధించబడడంచేత****"* అనే సూత్రాల్లో కూడా కర్మయోగం బ్రహ్మవిద్యకి అంగంగా ఉండి ఉపకరిస్తోందని చాలా స్పష్టంగా చెప్పబడింది. ఈఉపనిషత్తులోకూడా రెండో మంత్రంలోనే *"కుర్వన్నేవేహ కర్మాణి"* అని కర్మలు అనుష్ఠింపతగినవి అని చాలా గట్టిగా చెప్పబడింది.

ఈప్రమాణాలన్నింటినీ చూస్తే *"విద్యాంచ అవిద్యాంచ"* అనే ఈమంత్రంలో బ్రహ్మవిద్యకి అంగంగా కర్మయోగాన్ని చేర్చి అనుష్ఠించాలి అని చెప్తున్నట్లే తీసుకోవాలి. ప్రమాణాలిలా ఉంటే, *"**ఈమంత్రం జ్ఞానినిగురించినదికాదు, బుభుక్షువునిగురించినదే**"* అని శంకరులు మొదలైనవారు వాదించడం తగదు. బుభుక్షువులకి తెలియజేయవలసిన కర్మలు అన్నింటినిగురించీ ముందరే కర్మకాండంలో వివరంగా చెప్పిన తర్వాత మొదలుపెట్టబడిన జ్ఞానకాండమైన ఈఉపనిషత్తులో మళ్ళీ అతనిగురించిన కర్మలని విధించవలసిన అవసరమే లేదు. *"ఈశావాస్యం"* అని మొదటి మంత్రంలోనే ముముక్షువునిగురించి ప్రారంభించిన తర్వాత అజ్ఞానినిగురించి ఇక్కడ చెప్పడానికే అవకాశం లేదు. పైగా, *"విద్యయా అమృతం అశ్నుతే"* అని ఇక్కడ మోక్షంగదా ఫలంగా చెప్పబడుతోంది! *"అమృతం అశ్నుతే"* అని స్పష్టంగా చెప్తున్నప్పుడు దానికి *"**మోక్షాన్ని పొందుతున్నాడు**"* అని అర్థం చెప్పకుండా *"దేవతాత్మభావం అశ్నుతే। తద్ధి అమృతముచ్యతే యత్ దేవతాత్మగమనం"* అని *"**దేవతని పొందుతున్నాడు అదే అక్కడ అమృతం అని ఉపచారంగా చెప్పబుతోంది**"* అని శంకరులు చెప్పడం వెనక ఎత్తుకున్న సకలప్రమాణాలకీ విరుద్ధమైనదే.

చివరగా శంకరుల వాదానికీ, ఈమంత్రాన్ని వివరించడానికే ఉన్న *"ఇయాజసోపి సుబహూన్ యజ్ఞాన్ జ్ఞానవ్యపాశ్రయః। బ్రహ్మవిద్యాం అధిష్ఠాయ తర్తుం మృత్యుం విద్యయా॥"* (శ్రీవిష్ణుపురాణం 6-6-12) అన్న శ్లోకంలో కేశిధ్వజమహారాజుని ఆత్మజ్ఞానం గలవాడనీ, అతను బ్రహ్మోపాసనచేస్తూనే దానికి

ఆటంకంగా ఉన్న పూర్వాఘాలని అవిద్య అనే కర్మయోగంద్వారా దాటడంకోసమని ఎన్నో యాగాలని చేసేడనీ చాలా స్పష్టంగా వివరించడానికీ, కొంచెంకూడా పొంతన లేదని వెనకే నిరూపించబడింది. అలాగే, ఇక్కడే చూపబడిన మనువచనంలో "**తపస్సు అనబడే కర్మం, విద్య మోక్షసాధనాలు, కర్మవల్ల ఉపాసనానికి ఆటంకాలుగా ఉన్న పాపం తొలగుతోంది, విద్యఅనే ఉపాసనవల్ల ఉపాసకుడు మోక్షాన్ని పొందుతున్నాడు**" అని వివరించడంకూడా శంకరభాష్యానికి ఏమాత్రమూ తగనిదని, సరిపోనిదని నిరూపించబడింది.

ఉపనిషత్తుల్లో "**అమృత**"శబ్దం మోక్షాన్నో, పరమాత్మనో సూచించడం ఎన్నో చోట్ల చూస్తున్నాం. బృహదారణ్యకం నాలుగో అధ్యాయం ఐదో బ్రాహ్మణంలో మొదటి పధ్నాలుగు ఖండాల్లోనూ "**ఏష త ఆత్మా అంతర్యామ్యమృతః**" అని అమృతశబ్దంతో పరమాత్మ సూచింపబడ్డాడు. "**ఉతామృతత్వ స్యేశానః**" అని పురుషసూక్తంలో అమృతశబ్దంవల్ల మోక్ష స్థితిని సూచించడం జరిగింది. ఇలా అనేకస్థలాలని చూడవచ్చు. కనుక, ఇక్కడ అమృతశబ్దంతో దేవతని చేరడం చెప్పబడుతోంది అని శంకరులు వ్యాఖ్యానించడం ఏమాత్రం తగదు. "**విద్యయా దేవలోకః**" అన్నప్పుడు దేవలోకశబ్దం మోక్షలోకమైన పరమపదాన్నే సూచిస్తుందన్నది వెనక నిరూపించబడింది. "**ఫలసంగంలేని కర్మయోగం మోక్షానికి క్రమంగా కారణం అవుతుంది, సంసారంలో జీవుడిని బంధించదు.**" అని గీత మొదలైన ఎన్నో శాస్త్రాల్లో చెప్పడాన్ని మరిచిపోవడంవల్లనే శంకరులు ఇక్కడ సామాన్యంగా కర్మం అంతా బంధకం అని తీసుకున్నారన్నది స్పష్టంగా తెలిసిపోతోంది.

**"బృహదారణ్యకం 6వ అధ్యాయంలో "కింప్రజయా కరిష్యామః యేషాంనోఽయమాత్మా అయం లోకః" (6-4-22) అని బ్రహ్మజ్ఞానులు గృహస్థాశ్రమాన్ని వదలాలని చెప్పడంవల్లనూ శ్వేతాశ్వతరోపనిషత్తులో "అత్యాశ్రమిభ్యః పరమం పవిత్రం ప్రోవాచ సమ్యక్ ఋషిసంఘజుష్టం" (6-21) అని సన్యాసాశ్రమంలో ఉన్నవాళ్ళకి బ్రహ్మవిద్యని ఉపదేశించడంవల్లనూ, గృహస్థుకే తగిన కర్మం మోక్షానికి ఏవిధంగానూ ఉపకరించదు**" అని వాదించడం తప్పు. "**తమేతం వేదానువచనేన**" అని మొదలయ్యే వేదవాక్యంలోనే కర్మం మోక్షసాధనమైన విద్యకి సాధనం అని చెప్పబడడం, సూత్రకారులు కూడా దాన్ని ఆదరించడం ఇదివరకే చూపబడింది. నిజంగా సూత్రకారులు "**బ్రహ్మవిద్యకి కర్మం అవశ్యం కావలసిఉండడంవల్ల అగ్నిహోత్రాది కర్మలులేని సన్యాసులకి బ్రహ్మవిద్యలో అధికారం లేదు**' అని పూర్వపక్షం చేసి, "**వాళ్ళకి అగ్నిహోత్రాది కర్మలు లేకపోయినా జపం,తపం మొదలైన కర్మలుండడంవల్ల వాటితో వాళ్ళు బ్రహ్మవిద్యకి విరోధులని పోగొట్టుకోవచ్చుగనుక వాళ్ళకికూడా బ్రహ్మవిద్యలో అధికారం ఉన్నది**" అని బ్రహ్మసూత్రం (3-4-17)మీద ఉన్న అగ్నీంధనాద్యధికరణంలో (3-4-4) సిద్ధాంతం చెయ్యబడడంవల్ల బ్రహ్మవిద్యలో గృహస్థులకే ముఖ్యమైన అధికారం అని తెలుస్తోంది. వెనక ఎత్తుకున్న శ్వేతాశ్వతరమంత్రం మొదటి పాదంలో '**తపఃప్రభావాత్ దేవప్రసాదాచ్చ బ్రహ్మ హ శ్వేతాశ్వతరోఽథవిద్వాన్**" అని సన్యాసియైన శ్వేతాశ్వతరులు తపస్సనే కర్మమహిమవల్లనూ, దానితోనున్న ఉపాసనవల్లనూ ఆనందించిన పరమాత్మకటాక్షంవల్లా బ్రహ్మవిద్యని పొందేరు' అని చెప్పబడిఉండడంవల్ల సన్యాసులుకూడా వాళ్ళకి విధింపబడిన తపస్సు మొదలైన కర్మలని అనుష్ఠించాలి అనే తెలుస్తోంది. ఆఉపనిషత్తులో తరువాత మంత్రంలోనే "**వేదాన్తే పరమం గుహ్యం పురాకల్పే**

*ప్రచోదితం। నాప్రశాన్తాయ దాతవ్యం నాపుత్రాయ అశిష్యాయ వా పునః॥"* అని పుత్రుడికి బ్రహ్మవిద్యని ఉపదేశించాలి అని చెప్పడంవల్ల బ్రహ్మవిద్యలో గృహస్థులకి యోగ్యత ఉంటుందనే తెలుస్తోంది.

అందువల్లనే ఛాందోగ్యోపనిషత్తులో బ్రహ్మవిద్యని ఆచార్యుడినుండి ఉపదేశం పొందినతరువాతనే ఆఅధికారి ఎలా జీవించాలి అనేదాన్ని చెప్పే వాక్యంలో *"కుటుమ్బే శుచౌ దేశే"* అని వాడిని గృహస్థుగా వర్ణించి, *"స ఖల్వేవం వర్తయన్ యావదాయుషం బ్రహ్మలోకమభిసంపద్యతే న చ పునరావర్తతే న చ పునరావర్తతే'* (8-15) అని ఆయుస్సున్నంతవరకూగృహస్థధర్మాలు అనుష్ఠించే బ్రహ్మవిద్యానిష్ఠుడికి తిరిగిరావడం లేని మోక్షం లభిస్తుందని చెప్పడంకూడాదీన్నే స్థిరపరుస్తోంది.

ఈవిషయాన్నే *"కృత్స్నభావాత్తు గృహిణోపసంహారః"* (బ్రహ్మసూత్రం 3-4-47) అన్ని ఆశ్రమాలకీ బ్రహ్మవిద్య ఉన్నదిగనుకనే (ఛాందోగ్యంలో) గృహస్థాశ్రమంలో ఉన్నవాళ్ళకి తగినదిగా (బ్రహ్మవిద్యని) నిశ్చయించడం (మిగతా ఆశ్రమాలకీ ఎత్తి చూపేఉన్నది) అనే సూత్రంలో సూత్రకారులు కూడా ఆదరించేరు. కనుక, *"బ్రహ్మవిద్యలో సన్యాసులకే అధికారమున్నది, మిగతావాళ్ళకి లేదు"* అనీ, *"కర్మలు గృహస్థులకే తగినవి,సన్యాసులకి లేవు"* అని తాము కల్పించుకొని *"ఇక్కడ కర్మని విద్యనీ కలిపి చెప్పుకోవడం అజ్ఞానుల విషయం"* అని శంకరులు వ్యాఖ్యానించడం వెనక చూపినప్రకారం శ్రుతిస్మృతిసూత్రాలకి విరుద్ధంగనుక, అనాదరించతగినది అన్నది బాగా స్పష్టం.

ఇలా ముముక్షువులచేత కర్మలు ఫలసంగంలేకుండా అనుష్ఠించబడవలసినవేఅని స్థాపించబడింది. ఈఅర్థాన్నే ఆళ్వారులుకూడా *"అనేక దివ్యదేశాల్లో వసించే ముముక్షువులైన పరమభాగవతులు కర్మలని భగవదారాధనగా చేస్తూ వచ్చేరు"* అని చూపడంద్వారా తెలిపేరు. *'చన్దివేళ్వి చడఙ్గు నాన్మఱై ఓది ఓదువిత్తు ఆదియాయ్ వరుమ్ అన్దణాళర్ అఱా అణియాలి"* (పెరియ తిరుమొళ్ళి 3-5-6) *"ముఱైయాల్ వళర్గిన్ద ముత్తీయర్ నాల్వేదర్ ఐవేళ్వి ఆఱఙ్గర్"* (పెరియ తిరుమొళ్ళి 3-8-4) *'నాన్దొళ్ళిల్ మఱైవల్లార్గళ్ నయన్దు అఱమ్ పయన్ద వణ్కై తీత్తొళ్ళిల్ పయిలుమ్ నాఙ్గూర్"* (పెరియ తిరుమొళ్ళి 4-5-3), *"నల్ల నాన్మఱైయోర్ వేళ్వియుళ్ మడుత్త నఱుమ్పుగై విశుమ్బొళి మఱైక్కుమ్"* (తిరువాయ్మొళ్ళి 8-4-5), *'నల్ల అన్దణర్ వేళ్వప్పుగైమైన్నలజ్గొణ్ణు ఉయర్విణ్ మఱైక్కుమ్"* (తిరువాయ్మొళ్ళి 5-9-5), *"ఉరుక్కుఱు నఱునెయ్కొణ్ణు ఆరళ్ళలిల్ ఇరుక్కఱుమన్దణర్ చన్దియిన్వాయ్... ఇరుక్కినిల్ ఇన్నిశైయానవనే"* (పెరియ తిరుమొళ్ళి 6-1-7) మొదలైన చోట్ల దివ్యదేశాల్లో జీవిస్తున్న ఉత్తములైన బ్రాహ్మణులు కర్మలని సర్వేశ్వరుడికి ఆరాధనంగా అనుష్ఠిస్తూ సుఖజీవనాన్ని సాగిస్తారని చెప్పడం మనం గమనించవచ్చు.

### 13. దేవతా కాణ్డం - జైమిని ప్రోక్తం, కాశకృత్స్న ప్రకాశితం.

కర్మవిచారాన్ని చేసేరు జైమిని. కాని దేవతావిచారాన్ని చేసినవారెవరు అన్న విషయంలో మన ఆచార్యులలోనే కొంత అభిప్రాయభేదం ఉన్నది. ఈవిషయాన్ని శ్రీదేశికులు తత్త్వటీకలో విమర్శించేరు. *"కర్మదేవతా బ్రహ్మగోచరా సా త్రిధోద్భవా సూత్రకారతః। జైమినేర్మునేః కాశకృత్స్నః బాదరాయణాత్ ఇత్యతః క్రమాత్॥"* అనే శ్రీసూక్తి తత్త్వరత్నాకరం అనే గ్రంథంలో శ్రీపరాశరభట్టర్ సాయించినది.

ఈశ్రీసూక్తిని దేశికులు శ్రీభాష్యానికి వ్యాఖ్యానంగా తాము కటాక్షించిన తత్త్వటీకలో ఉదాహరిస్తూ, ఇది *"షోడశలక్షణేన జైమినీయేన"* అని బోధాయనులే స్పష్టంగా సాయించిన శ్రీసూక్తితో భేదిస్తోందని దీన్ని ఎలా సమన్వయ పరచగలం అని అన్నారు.

లక్షణం అంటే అధ్యాయం అని అర్థం. షోడశలక్షణం అంటే పదహారు అధ్యాయాలని అర్థం. పదహారు అధ్యాయాలున్న పూర్వమీమాంసా శాస్త్రం జైమిని కర్తృకం అని బోధాయనులు భావించేరు. 12 అధ్యాయాలున్న కర్మకాండం జైమిని ప్రోక్తం అనీ, తరువాతి 4 అధ్యాయాలు కాశకృత్స్నులవారు సాయించేరనీ శ్రీపరాశరభట్టర్ భావించేరు. ఇలా 12+4 అని కర్తృత్వభేదంతో పూర్వమీమాంసని భట్టరువారు విభజించేరు. ఇక్కడ బోధాయనులు సాయించినది ప్రామాణికం అని అంగీకరించాలా లేక పరాశరభట్టరువారు సాయించినదాన్ని అంగీకరించాలా అన్న ప్రశ్న వస్తోంది.

శ్రీవేదవ్యాసులవారి శిష్యప్రశిష్యపరంపరలో అవతరించిన మహాచార్యులు బోధాయన మహర్షి. శ్రీపరాశరభట్టర్ స్వామి ఎంబెరుమానార్ల స్థానంలో మూర్థాభిషిక్తులైనవారు. మనకి ఇద్దరూ ఉద్దేశ్యులే. కనుక ఈవిషయంలో మనకి ఆప్తతములైన వారిలో ఒకరివాక్యంగా తీసుకొనిమరొకరి వాక్యాన్ని త్రోసివెయ్యడం తగనిపని. పరస్పరం విరుద్ధమని తోచే ఇద్దరివాక్యాలనీ ఎలా సమన్వయించడం అంటే, దానికున్న మార్గాన్ని దేశికులే మనకి చూపించేరు. అంటే, 16 అధ్యాయాలనీ జైమిని చేసేరు. కాని అందులో ఉన్న 4 అధ్యాయాలతో ఉన్నదేవతామీమాంసాశాస్త్రాన్ని కాశకృత్స్నులవారు ప్రకాశింపజేసేరని మనం గ్రహించాలి. దీన్ని ఒక దృష్టాంతంద్వారా విశదీకరిస్తాను.

శ్రీ వేదవ్యాసులవారు మహాభారతాన్నిరచించిన తర్వాత ఒకరోజు సరస్వతీనదీతీరాన్ని ఉన్నారు. అప్పుడు మనస్సులో అకారణంగా మహా దుఃఖం వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు వచ్చేయి. అప్పుడు నారదులవారు అక్కడికి వేంచేసేరు. 1,25,000 శ్లోకాలతోనున్న పంచమవేదమని పిలవబడుతున్న మహా గ్రంథమైన భారతాన్ని చేసినతర్వాత మనస్సులో పెద్దదుఃఖంతో ఏడుస్తున్న వ్యాసులవారిని చూసి దానికి కారణాన్ని నారదులు అడిగేరు. దానికి వ్యాసులవారు చాలా బాధతో ఉన్నదానికి తమకే కారణం తెలియలేదన్నారు. ఆతర్వాత నారదులే వ్యాసులవారికి వారికి కలిగిన దుఃఖానికి కారణాన్ని తెలియజేసేరు.

*"ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ। యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్॥"* అన్న శ్లోకంప్రకారం ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు పురుషార్థాలని గురించీ శ్రీవేదవ్యాసులవారు మహాభారతంలో చక్కగా సాయించేరు. కాని *"నారాయణకథామిమాం"* - నారాయణుడినిగురించిన చెప్తున్నాను అని మహాభారతాన్ని ఆరంభించిన వ్యాసులవారు నారాయణుడైన కృష్ణుడిని గురించి పూర్ణంగా చెప్పలేదు. అంచేత దేన్నిగురించి చెప్తాను అని ఆరంభించేరో దాన్నిగురించి సరిగ్గా చెప్పకుండా ఇతరవిషయాలనన్నింటినీ గురించీ చెప్పి, "యుద్ధచరిత్రశాసనం" అన్నట్టుగా గ్రంథాన్ని సాయించేరు వ్యాసులవారు అని వారి దుఃఖానికి కారణాన్ని ఎత్తి చూపేరు నారదులు. *"నారాయణ కథామిమామ్"* - నారాయణుడు ఎవరు అంటే ఆయనే పాండవదూత. పాండవదూతకే నారాయణుడని పేరు. *"మహాభారతంవల్ల దౌత్యం చేసినవాడనే ప్రతిష్ఠని చెప్తోంది"* అని శ్రీవచనభూషణ సూత్రం. దీనికి

అరుంబదకారులు *"నారాయణకథామిమాం"* అని వ్యాసులవారు ప్రారంభించేరే, నారాయణుడంటే పాండవదూత" అని సాయించేరు. నారాయణుడన్నదానికి అర్థమేమిటి, పాండవదూత అన్నదానికి అర్థమేమిటి, ఈరెండింటినీ సంగతంగా చూపిద్దాం అని శ్రీపెరుంబుదూర్ ఎంబార్‌జీయర్‌స్వామి అరుంబదవిళక్కంలో ఈఅర్థాన్ని చూపిస్తున్నారు. ఇలా భారతంలోఉన్న లోటుని తీర్చడానికి భాగవతం తర్వాత సాయించేరు వ్యాసులవారు అని తరువాత చరిత్ర.

ఈభాగవతాన్ని *"శుకభాగవతం"* అంటారే, ఇది వ్యాసులవారిచేత చెప్పబడిందా లేక శుకులవారిచేత చెప్పబడిందా అంటే భాగవతం వ్యాసకర్తృకమే. కాని దాన్ని శుకులు ప్రకాశింపజేసేరు అనడంవల్ల అది *"శుక భాగవతం"* అని పిలవబడుతోంది. శ్రీరామాయణాన్ని వాల్మీకిమహర్షి పాడినా, కుశలవులమూలంగా అది ప్రచారంలోకి వచ్చింది. అలాగే, శ్రీశుకులే వ్యాసకర్తృకమైన భాగవతాన్ని ప్రకాశింపజేసేరు. ఏగ్రంథానికైనా ఒకరు కర్తగా ఉండవచ్చు, మరొకరు ప్రకాశింపజేసినవారుగా ఉండవచ్చు. అలాగే, ఈదేవతాకాండం జైమిని ప్రోక్తమైనప్పటికీ, దానికి కాశకృత్స్నులే ప్రకాశకులని గ్రహించాలి.

## *14. దేవతాకాణ్డం కర్మకాణ్డంలో అంతర్భూతం అన్న విషయనిరూపణం.*

ఇక తరువాతిదిగా దేవతాకాండం కర్మకాండంలో ఒకరకంగా ఇమిడి ఉన్నది అన్న విషయాన్ని గురించి కొంచెం వివరిస్తాను. అంటే, కర్మమీమాంసలో 12 అధ్యాయాలతోబాటు 4 అధ్యాయాలున్న దేవతా కాండాన్నికూడా కలిపే ఉంచాలన్నది మన పూర్వుల నిరూపణం.

***"అథాతో బ్రహ్మ జిజ్ఞాసా"*** అన్నది బ్రహ్మమీమాంసా శాస్త్రానికి మొదటిసూత్రం. ఇందులో ***"అథ"*** అన్నదానికి మన స్వామి ఏమి వ్యాఖ్యానం చెప్పేరంటే, ***"అథ శబ్దః ఆనన్తర్యే భవతి"*** అని. ఆనంతర్యం అన్న అర్థంలో వచ్చింది "అథ" శబ్దం అన్నది శంకరులుకూడా అంగీకరించేరు. ఇలా ***"అథ"*** అన్నదానికి అనంతరం - తర్వాత అని అర్థం. తర్వాత అంటే దేని తర్వాత? అనే ప్రశ్న వస్తుంది. ***"సాధన చతుష్టయ సంపత్తి అనంతరం"*** అని వ్యాఖ్యానించేరు శంకరులవారు. ***"కర్మవిచారానంతరం"*** అని వ్యాఖ్యానించేరు మన స్వామి. ఇలా ***"అథ"*** శబ్దానికి ***"తర్వాత"*** అని అర్థం చెప్పుకోవడంలో ఇద్దరికీ అభిప్రాయభేదం లేదు. కాని ***"దేని తర్వాత"*** అన్నదాంట్లో ఈఇద్దరు మతాచార్యులకీ అభిప్రాయభేదం ఉన్నది.

***"కర్మవిచారం తర్వాత"*** అని స్వామి సాయించడంవల్ల ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. అదేమిటంటే, కర్మవిచారంతర్వాత దేవతావిచారం, దేవతావిచారం తర్వాత బ్రహ్మ విచారం అని క్రమం చెప్పబడింది. బ్రహ్మవిచారం దేవతావిచారానికి తర్వాతే గదా వస్తుంది? ఇలా ***"అథ"*** శబ్దానికి ***"దేవతా విచారానికి తర్వాత"*** అని చెప్పవలసిన మన స్వామి, అలా చెప్పకుండా ఎందుకు ***"కర్మవిచారం తర్వాత"*** అని చెప్పేరు?

ఈఆక్షేపానికి సమాధానం శ్రుతప్రకాశికాచార్యులవారు తమగ్రంథంలో ఒకచోట చాలా సూక్ష్మంగా సాయించేరు. అదేమిటంటే, దేవతావిచారాన్ని కర్మవిచారంలో ఒకభాగంగానే తీసుకున్నారు మీమాంసకులు. మీమాంసకులకి యాగంలోనేకదా అభినివేశం! వారు యాగానికి ఉండాల్సిన ద్రవ్యాన్నీ

అంగీకరించిఉంటారు, దేవతలనీ అంగీకరించి ఉంటారు. కాని వాళ్ళకి యాగమనే కర్మమే ముఖ్యం. యాగమనే అంగికి అంగంగా వాళ్ళు ద్రవ్యాన్ని మాత్రమే తీసుకోలేదు. యాగానికి అంగంగా దేవతలనికూడా తీసుకున్నారు మీమాంసకులు. మీమాంసకుల సంప్రదాయంలో యాగానికున్న ప్రాధాన్యత దైవానికే లేదు. ఇలా కర్మం అనే అంగిలోనే దేవతావిచారమైన అంగవిచారంకూడా అంతర్భూతం అని తీసుకోవడంవల్ల కర్మవిచారం అంగివిచారం - దేవతావిచారం అంగవిచారం అని ఏర్పడడంవల్ల అంగివిచారంలోనే అంగవిచారం అంతర్భూతమై ఉండాలి అని స్పష్టమౌతోంది. దీనివల్ల కర్మవిచారం తర్వాత బ్రహ్మవిచారం అనడంలో ఎటువంటి ఆక్షేపానికీ తావులేదు అంటున్నారు శ్రుతప్రకాశికాచార్యులవారు.

ఇలా కర్మవిచారం దేవతావిచారం బ్రహ్మవిచారం అన్న కాండత్రయాత్మకమైన మీమాంసాశాస్త్రం ఏకార్థం బ్రహ్మ సర్వకర్మసమారాధ్యం, సర్వదేవతాంతరాత్మభూతం పరబ్రహ్మ వేదాంతవేద్యం అన్నది. భగవానుడు కూడా గీతలో *"భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరం। సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాన్తిమృచ్ఛతి॥"* అని సమస్తకర్మలూ తనకి ఆరాధనమై ఉండేవే అన్నది స్పష్టంగా సాయించి ఉన్నాడు. సర్వకర్మలచేతనూ ఆరాధింపబడే దేవతలకి అంతరాత్మగా భగవానుడు ఉండడంచేత సర్వకర్మలూ వేదార్థంగా ఉన్నా, వేదాంతార్థమైన భగవానుడు ఈకర్మలకి ఆరాధ్యుడుగా ఉన్నాడు.

మనుస్మృతి ధర్మశాస్త్రం. ***"మనుధర్మ శాస్త్రానికి విపరీతమైన అర్థాలన్నీ వ్యర్థమే"*** అనే దీనికి గొప్పదనం. మను భగవానుడు మను స్మృతిలో వర్ణాశ్రమధర్మాలు మొదలైన ఎన్నోరకాల ధర్మాలనన్నింటినీ విచారించప్రయత్నించినవారు, మొదటమొదట్లో 7శ్లోకాలతో భగవానుడినిగురించి వర్ణించేరు. *"మను సప్తశ్లోకీ"* అని ఈసప్తశ్లోకి వర్ణించబడింది. జగత్సృష్టినిగురించి అంతా చెప్పేరు ఈప్రకరణంలో. శ్రుతప్రకాశికా చార్యులవారు వీటికివ్యాఖ్యానం సాయించేరు. ఇందులో మనుభగవానుడు ధర్మశాస్త్రం చెప్ప వచ్చేరా? బ్రహ్మవిచారంచెయ్యడానికి వచ్చేరా? ధర్మాలనిగురించిచెప్పవచ్చినవారు ఎందుకు నారాయణుడిని గురించి విచారించేరు? అని ప్రశ్నించి దీనికున్న సమాధానాన్ని ఆశ్చర్యకరంగా సాయించేరు.

ఇతిహాసపురాణాలు నారాయణుడినిగురించి చెప్పడానికి ఏర్పాటుచెయ్యబడి ఉన్నవి. ధర్మశాస్త్రాలు అన్ని ధర్మాలగరించీ చెప్పడానికి ఉన్నాయి. ఇతిహాసపురాణాల్లోనూ, కొన్ని చోట్ల ధర్మవిచారం చెయ్యబడింది. ధర్మశాస్త్రాల్లోనూ కొన్ని చోట్ల నారాయణుడినిగురించి విచారం చెయ్యబడింది. దీనివల్ల ఏమిటి తేలిందంటే, ధర్మశాస్త్రాల్లో చెప్పబడ్డ ధర్మాలు తిరువారాధనరూపమై ఏర్పాటైఉన్నందువల్ల ఈతిరువారాధనలన్నీ, ఎవరికి అనే ఆకాంక్షలో వీటికి ఆరాధ్యుడైన భగవానుడినిగురించి ఇవి వివరించే గ్రంథాల్లో చెప్పబడ్డాయి. ఈకారణంవల్లనే ఆయన్నిగురించి చెప్పేటటువంటి ధర్మాలని గురించి కూడా చెప్తున్నాయి. ఇలా ఆరాధ్యుడినిగురించి చెప్పేటప్పుడు ఆరాధనలగురించీ, ఆరాధనలనిగురించి చెప్పినప్పుడు ఆరాధ్యుడిగురించీ చెప్పడం అనేది మన ఋషులు దర్శించిన క్రమమే.

ఇలా ధర్మశాస్త్రాల్లో చెప్పబడిఉన్న ధర్మాలకి ఆరాధ్యుడు భగవానుడు శ్రీమన్నారాయణుడు

అనేదాన్ని దృఢంగా చెప్పడానికే మను సప్తశ్లోకి అవతరించిందనే విషయాన్ని శ్రుతప్రకాశికాచార్యులవారు చాలా అందంగా బహిర్గతం చేసేరు. ఆప్రకారమే కాండత్రయాత్మకమైన మీమాంసాశాస్త్రం ఏకశాస్త్రం అన్నది మన పూర్వుల నిరూపణమే.

15. ***తత్త్వనిరూణం.***

శ్రీభాష్యంతర్వాత మనస్వామి ఎంబెరుమానార్లు సాయించిన బ్రహ్మసూత్రవ్యాఖ్యానగ్రంథం వేదాన్తదీపం. ఇది శ్రీభాష్యానికి సంగ్రహంగా ఏర్పాటైనది. ఈవిషయాన్ని స్వామే సాయించేరు. శ్రీభాష్యంలో చెప్పబడిన అర్థాలని సూక్ష్మంగా చెప్పేదిగా గ్రంథారంభంలో ప్రతిజ్ఞ చేసేరు.

ఈగ్రంథంలో ఒక విశేషం ఉన్నది. ఏమిటంటే, ఒక్కొక్కసూత్రానికీ శ్రీభాష్యంలో చూపబడిన అర్థాలని స్వామి ఇక్కడ సంగ్రహంగా చూపిస్తున్నారనిగాదు. ఒక్కో అధికరణానికీ ఎన్ని సూత్రాలున్నా, వాటిలో మొదటి సూత్రానికి అర్థాన్ని మాత్రం తప్పకుండా ఈగ్రంథంలో సాయించేరు. ఒకే సూత్రమున్న అధికరణమైనా, లేక ఎన్నో సూత్రాలున్న అధికరణమైనా, మొదటిసూత్రానికి మాత్రం సూత్రార్థాన్ని రాయాలి అనే నిర్బంధంతో ఈగ్రంధాన్ని సాయించేరు స్వామి. ఈసూత్రం పూర్వపక్షాన్ని చెప్పే సూత్రం కావచ్చు, లేదా సిద్ధాంతాన్ని చెప్పే సూత్రంగావచ్చు. ఎలా ఉన్నా, ఈఆలోచనలో పడిపోకుండా మొదటి సూత్రానికి మాత్రం అర్థాన్ని సాయించేరు.

ఈగ్రంథంలో ఉపోద్ఘాతప్రకరణంలో ఆశ్చర్యకరంగా ఒక విషయాన్ని స్వామి మనకి చూపించేరు. *"వైదిక ప్రక్రియ అంటే ఏమిటి?"* అనే విషయంగురించి అత్యద్భుతంగా సాయించేరు. *"అత్రేయమేవహి వేదవిదాం ప్రక్రియా"* అని స్వామి శ్రీసూక్తి ఉన్నది. *"వేదం తెలిసినవాళ్లు చెప్పేరకం ఏమిటి?"* అని ప్రశ్నించుకొని వేదప్రామాణ్యాన్ని అనుసరించి వేదాంతార్థాలని యథాతథంగా తెలియజేయగల వైదికులు బ్రహ్మసూత్రాల అర్థవిశేషాలని ఎలా వర్ణిస్తారన్నదానికి క్రమాలని చూపించేరు. వైదికసిద్ధాంతం ఏమిటి? అన్న విషయంగురించి వివరించదలిచి మొట్టమొదట తత్త్వత్రయాల స్వరూపస్వభావవిశేషాలగురించి సాయించేరు.

తత్త్వం అంటే యథార్థవస్తువు అని అర్థం. అనాదియైనదీ, పరమవైదికమైనదీ అయిన మన విశిష్టాద్వైత సిద్ధాంతంలో తత్త్వాలుమూడు అని అంగీకరించబడ్డాయి. చిత్, అచిత్, ఈశ్వరుడు అన్న మూడు తత్త్వాలే అవి.

సాంఖ్యులు చిత్, అచిత్ అనే రెండు తత్త్వాలనే అంగీకరించేరు. వాళ్ళమతంలో ఈశ్వరతత్త్వం అనేది లేదు. శంకరమతంలో ఈశ్వరతత్త్వాన్ని మాత్రం అంగీకరించి, చిత్, అచిత్తత్త్వాలంటూ లేవన్నారు. కాని తత్త్వత్రయవాదం వేదాన్ని తెలిసినవాళ్ళ మతం అన్నారుస్వామి. దీనికి ఆధారంగా ఎన్నో ప్రమాణ వచనాలని ఉదాహరించేరు.

అచిత్తనేది జ్ఞానశూన్యమైన తత్త్వం. చిత్ అనేది జ్ఞానవిశిష్టమైన తత్త్వం. ఈరెండు తత్త్వాలకీ నియంతగా ఉండేవాడు సర్వేశ్వరుడు మూడో తత్త్వం. దీన్ని స్పష్టంగా వేదాంతమే చెప్తోంది *"భోక్తా*

*భోగ్యం ప్రేరితారంచ మత్వా"* అని వేదాన్తవాక్యం. *"భోక్తా"* అన్నపదంచేత సూచింపబడేది జీవాత్మ; *"భోగ్యం"* అంటే అచిత్తు; *"ప్రేరితారం"* అంటే నియంతైన పరమాత్మ.

ఈఉపనిషద్వాక్యమనేది తత్త్వత్రయ స్వరూపకథనం. అంటే వీటి స్వరూపస్వభావ అన్యథాభావ నిరూపణం చెయ్యబడుతోంది అనే యథార్థాన్ని మనం తెలుసుకోవాలన్నమాట. అంటే, ఆకాశాదులైన అచిత్తులకి స్వరూపవికారరూప కార్యత్వం. జీవాత్మలకి స్వభావవికారరూప కార్యత్వం. భోగ్యభూతమైన ప్రకృతితత్వం మహదహంకారభూతపంచకఇంద్రియాదిరూపేణా స్వరూపపరిణామం పొందడంతప్ప జీవాత్మలకి భోగ్యం కాలేదు. జీవాత్మ స్వరూపతః వికారంలేనిదై తన స్వభావమైన ధర్మభూతజ్ఞానంతాలూకు వికాసంచేత ప్రాకృతపదార్థాలని అనుభవించే భోక్త. దానివల్ల దీనికి జ్ఞానవికాసమే ఆవశ్యకం. దీనివల్ల భగవానుడు ఆత్మలకి స్వభావవికాసాన్ని పుట్టించడానికి ప్రాకృతమైన స్వరూపంతో పరణమింపజేస్తున్నాడని తెలుస్తోంది. చిత్, అచిత్ తత్త్వాలని గురించిన ఈయథార్థాలు సర్వం బ్రహ్మకార్యం అనే యథార్థాన్ని తెలియజేస్తున్నాయి.

ఇలా తత్త్వత్రయవాదాన్ని వేదాంతం స్పష్టంగా చెప్పిఉండగా, *"**ఈశ్వరతత్త్వం అంటూ లేదు, ప్రకృతి పురుషుడు మాత్రమే ఉన్నాయి**"* అనో, *"**పరమాత్మమాత్రమే ఉన్నది, ప్రకృతితత్త్వంగాని, జీవతత్త్వం గాని లేవు**"* అనో వైదికులని చెప్పకునేవాళ్ళు ఎలా చెప్పసాధ్యం? అంటారు మన స్వామి. ఈశ్వరుడి ప్రత్యేకత ఏమిటి? స్వామిత్వం. జీవుడికున్న అసాధారణధర్మం ఏమిటి? దాసత్వం. ఈరెండింటినీ ఈమతాంతరస్థులు లేదని చెప్తున్నారు. వైదికప్రక్రియలో స్థిరంగా ఉన్న మన ఆచార్యులు జీవుడూ, వాడికి ఉన్న అసాధారణధర్మమైన దాసత్వం ఉంటేనే పరమాత్మకి స్వామిత్వం సిద్ధిస్తుందనీ, పరమాత్మా, ఆయనకున్న ప్రత్యేకమైన స్వామిత్వం ఉంటేనే జీవాత్మ దాసత్వం సిద్ధిస్తుందని మనకి చూపించేరు.

ఇలా చిత్తు, ఈశ్వరుడు అని రెండు తత్త్వాలనీ అంగీకరించబడుతాయి. ఇందులో జీవాత్మతత్వానికి భోగ్యంగా ఉన్నది చైతన్యశూన్యమైన అచిత్తత్వం. ఈఅచిత్తనే భోగ్యాన్ని అనాదికాలంగా అనుభవిస్తూ వస్తున్నాడు సంసారిజీవాత్మ. దీనివల్ల పరమాత్మ అనుభవానికి వీడు రావడమే ఉండదు. ఈఅచిత్తుని అనుభవించడం అనేదాన్ని త్యాజ్యంగా భావించి దీన్ని వదిలేసి, పరమాత్మానుభవానికి ఒకడు ఆశపడి రావాలి అనడానికే అన్ని శాస్త్రాలూ వచ్చేయి.

శ్రుతప్రకాశికాచార్యులవారు ఆశ్చర్యకరంగా ఒక విషయాన్ని చూపించేరు. అదేమిటంటే, ఒకడు ఆస్తికుడు గాని నాస్తికుడుగాని కావచ్చు. విద్వాంసుడుగాని, అవిద్వాంసుడుగాని కావచ్చు. బ్రాహ్మణుడు గాని, అబ్రాహ్మణుడుగాని కావచ్చు. దేవుడుగాని, మనుష్యుడుగాని కావచ్చు, మగవాడుకావచ్చు, ఆడదిగావచ్చు. ఎటువంటివాళ్ళైనా, అందరూ కోరుకొనేది సుఖాన్నే. అందరూ కోరనిది దుఃఖాన్ని. కాని, సుఖాన్నే ఒకడు దుఃఖంగా భ్రమించవచ్చు. దుఃఖాన్ని సుఖంగా భ్రమించవచ్చు. యథార్థంగా చూస్తే, మనకి ఏదిసుఖం, ఏది దుఃఖం అన్నదాన్ని శాస్త్రమే చెప్పగలదు. దీన్ని శాస్త్రం ఎలా చెప్తుందంటే, దుఃఖానికి హద్దు అనంతక్లేశభాజనమైన సంసారం. సుఖానికి హద్దు నిరతిశయానందప్రాప్తి అయిన మోక్షం.

అఝగియమణవాళ పెరుమాళ్‌నాయనార్ ఆచార్యహృదయం ఆరంభంలో ఈఅర్థాన్నే చూపించేరు. *"అనంతక్లేశనిరతిశయానందహేతు ..... జ్ఞాతవ్యపఞ్చకజ్ఞానాజ్ఞానఙ్గళ్"* (సూ.5) అని. సంసారవర్ధకానికి కారణం అజ్ఞానం; మోక్షప్రాప్తికి కారణం జ్ఞానం; జ్ఞానం అంటే, అర్థపంచకజ్ఞానం; అదికూడా జ్ఞాతవ్య అర్థపంచకం (తెలుసుకోవలసిన ఐదు అర్థాలు) అన్నారుసూత్రకారులు. ఈఅయిదువిషయాలనీగురించిన జ్ఞానాన్ని మనకి వివరించడానికి అన్ని శాస్త్రాలూ పుట్టేయి. వేదవేదాంతాలు, ఇతిహాసపురాణాలు, బ్రహ్మసూత్రం, శ్రీమద్భగవద్గీత, ఆఝ్వార్లశ్రీసూక్తులు, పూర్వాచార్యుల గ్రంథాలు, అన్నీ జ్ఞాతవ్య అర్థపంచక ప్రతిపాదకాలే.

ఈఅర్థపంచకాన్ని శ్రీవేదవ్యాసులవారు శారీరకమైన బ్రహ్మమీమాంసాశాస్త్రంలో అద్భుతంగా ప్రకాశింపజేసి కటాక్షించేరని మన స్వామి అర్థపంచకవివరణంగా ఎన్నో అర్థవిశేషాలనన్నింటినీ తమ శ్రీభాష్యాదిగ్రంథాల్లో వివరంగా నిరూపించేరు. అందులో మొట్టమొదట తత్త్వత్రయవిభాగం చేసి చిత్తంటే ఏమిటి, అచిత్తంటే ఏమిటి, ఈశ్వరతత్త్వం ఎటువంటిది, అని అన్నింటినీ వర్ణించేరు. ఈమూడు తత్త్వాలని గురించీ వేదాంతం స్పష్టంగా చెప్పింది. తన స్వరూపంవల్లనూ, స్వభావంవల్లనూ, అచేతనవస్తువులకంటే, విలక్షణమైనవాడు, దానికి ఆత్మైన చేతనుడు - జీవాత్మ. జీవాత్మవర్గం బద్ధుడు, ముక్తుడు, నిత్యుడు అని మూడు రకాలు. ఈజీవాత్మవర్గంకంటే వేరైనవాడు నిఖిలహేయప్రత్యనీకుడైన, కల్యాణగుణైకతానుడైన, పరమాత్మ. అన్నిదసల్లోనూ చేతనాచేతనవిభాగరహితంగా వాటికి నియామకుడుగా, ధారకుడుగా, శేషిగా ఉండడంద్వారా వాటికంటే పరమవిలక్షణమైనవాడు ఈ పరమాత్మ. పరమాత్మకి కల్యాణగుణాలులేవన్న సిద్ధాంతాన్ని ఈలోకంలో ప్రచారంచెయ్యడానికే అవతరించేరు శ్రీశంకరులు. పరమాత్మకి కల్యాణ గుణాలున్నాయని స్థాపించడానికే అవతరించేరు మన స్వామి ఎంబెరుమానార్లు.

తత్త్వత్రయాన్ని గురించి ఇలా సూక్ష్మంగా సాయించి దీనికి ఆధారంగా ఎన్నో ప్రమాణవచనాలని కుదృష్టులైనవారు నోరు తెరవడానికి వీల్లేకుండా ఉదాహరించేరు. ఈప్రమాణవచనాలని స్వామి ఉదహరించిన రీతిలో మనం కూడా అనుభవంలోకితీసుకోగలిగిన ప్రాప్తం. మొట్టమొదట వేదవేద్యుడైన కృష్ణపరమాత్మయొక్క గీతావచనాన్ని ఉదాహరించేరు స్వామి ఎంబెరుమానార్లు.

తత్త్వత్రయం అనే విషయం గురించి ఇంతవరకూ మనం అనుభవించిన విషయాలకి అనుబంధంగా కీర్తిమూర్తి న్యాయవేదాంత విద్వాన్ శ్రీ ఉ.వే. కారప్పంగాడు వెంకటాచార్యస్వామి అనుగ్రహించిన తత్త్వనిర్ణయం అనే వ్యాసంలోంచి కొన్ని భాగాలు సంగ్రహించబడుతున్నాయి.

## *16. తత్త్వనిర్ణయం.*

*న్యాయవేదాన్తవిద్వాన్*

***శ్రీ ఉ. వే. కారప్పఙ్గాడు వేఙ్కటాచార్యస్వామి.***

1. ధర్మ, అర్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలలో మోక్షం అనబడేది పరమపురుషార్థం

అని చెప్పబడుతోంది.

2. *"తత్త్వజ్ఞానాత్ మోక్షలాభః"* అన్న ప్రబలవచనాన్ననుసరించి మోక్షాన్ని పొందాలని కోరే చేతనుడు మొదట్లో జ్ఞానాన్ని సంపాదించాలి.

3. మోక్షసాధనం జ్ఞానం అన్న ఈవిషయం సకలసిద్ధాంత సాధారణం అయినా, మోక్షస్వరూపం లోనూ, సాధనజ్ఞాన స్వరూపంలోనూ ఆయాసిద్ధాంత ప్రవర్తకులైన ఆచార్యులలో అభిప్రాయభేదం ఉన్నది.

4. ఇక్కడ మోక్షసాధనంగా చెప్పబడుతున్న జ్ఞానం తత్త్వనిర్ణయసాపేక్షం.

5. తత్త్వం అన్నది మూడు అనీ ఒకటి అనీ చెప్పగలిగినదిగా ఉన్నది. ఈఅర్థం ఉపనిషత్సిద్ధం.

6. తత్త్వాన్ని పరతత్త్వం అనీ, అవర(తక్కువది)తత్త్వం అనీ రెండు రకాలుగా విభజించబడ్డాయి. చేతనుడికి ప్రాప్యమై, వీడికి ఇష్టమైన ఐశ్వర్యం మొదలైన పురుషార్థాలని ఇచ్చేదై, వీడు చేసే ఉపాసనం మొదలైనవాటికి విషయమై ఉన్న పరదేవత పరతత్త్వం అనబడుతుంది. ఈపరదేవతకి శరీరంగా చెప్పబడుతున్న జ్ఞానమున్న చేతనపదార్థాలూ జ్ఞానం లేని అచేతనపదార్థాలూ, అవరతత్త్వం అనబడుతున్నాయి.

7. చిత్, అచిత్, ఈశ్వరుడు అని మూడు తత్త్వాలని తెలియజేసే శ్రుతివాక్యాలు వాస్తవంగా ఉన్న మూడు యథార్థమైన పదార్థాలని తెలియజెయ్యడంవల్ల అవికూడా ఉపపన్నాలే. (తగిఉన్నవిగా ఎత్తుకొనదగినవే). బ్రహ్మం ఒకటే ఉన్నది, వేరైనది లేదు అనే అర్థాన్ని తెలియజేసే శ్రుతివాక్యాలుకూడా చేతనాచేతనాలని శరీరంగాగల ఈశ్వరుడు ఒక్కడే అవడంవల్ల, అటువంటి పదార్థం వేరు లేకపోవడంవల్లనూ ఉపపన్నాలే.

8. ఏధర్మం ఏపదార్థంలో మాత్రం ఉండి ఇతర పదార్థాల్లో లేకుండా ఉన్నదో, ఆధర్మం ఆపదార్థానికి అసాధారణమైన ధర్మం అనబడుతుంది. ఇలా చూస్తే, చిత్ అనీ, చేతనుడనీ చెప్పబడుతున్న జీవాత్మకున్న అసాధారమమైన ధర్మం దాస్యం అనబడుతుంది. ఈ *"**దాస్యం**"*అనబడే అసాధారణధర్మం వల్ల జీవాత్మ మిగతపదార్థాలకన్న వేరైనదిగా తెలియబడుతోంది. దాస్యం అంటే,జ్ఞానంతో కూడిఉన్న శేషత్వం. శేషత్వం అంటే, ఎంబెరుమానుడు తన ఇచ్ఛననుసరించి వినియోగం స్వీకరించడానికి తగినట్టు ఉండడం. ఈదాస్యశరీరంలో చేరిన జ్ఞానం అనబడే అంశం అచేతనపదార్థాలకంటే వేరైనవాడు అని తెలియడానికి హేతువుగా ఉన్నది.

9. *"దాసభూతాః స్వతస్సర్వే హ్యాత్మానః పరమాత్మనః"* అనే వచనం ప్రకారం సర్వేశ్వరుడికి నిరుపాధికదాస్యంవల్ల సత్తని పొందినవాళ్ళు చేతనులు అనిచెప్పబడడంవల్ల దాస్యం ఆత్మకి ప్రధానధర్మం

అన్నది స్పష్టం. *"అడియేన్ ఉళ్ళాన్"* అన్న ఆళ్వార్ల దివ్యసూక్తిలోకూడా, ఈదివ్యసూక్తివ్యాఖ్యానావసరంలో చెప్పబడిన ఐతిహ్యంలోకూడా ఈయథార్థం స్పష్టంగా తెలియజెయ్యబడుతోంది.

10. అచేతనపదార్థాలగురించి లభించిన అసాధారణధర్మం జ్ఞానశూన్యత్వం. అంటే తెలివి లేకపోవడం. ఈధర్మం అల్పజ్ఞానమున్న జీవాత్మవిషయంలోనూ, మహాజ్ఞానియైన సర్వేశ్వరుడి విషయంలోనూ లేకుండాపోయి, అచేతనపదార్థాల్లోమాత్రం ఉండడంవల్ల దానికి అసాధారణమైన ధర్మం అయింది. దానివల్లనే, జీవేశ్వరులకంటే, వేరైనదిగా తెలియబడుతోంది.

11. సర్వేశ్వరుడికున్న అసాధారణధర్మం శాసనం. ఇది మిగతపదార్థాల్లో లేకపోయి, సర్వేశ్వరుడికి మాత్రం ఉండడంవల్ల ఇది ఆయనకి అసాధారణమైన ధర్మం అయింది. ఈవిషయం ఉపనిషత్సిద్ధం. ఛాందోగ్యోపనిషత్తు ఆరో ప్రపాఠకంలో చెప్పబడిన విద్య సద్విద్య అనబడుతుంది. అందులో చెప్పబడిన విషయం ఇది. అంటే ఈప్రకరణంలో పరబ్రహ్మానికి ఆదేశశబ్దంవల్ల నియమనం అసాధారణమైన ధర్మంగా చెప్పబడడం స్పష్టం.

12. ఇలా చిత్తులో దాస్యధర్మం, అచిత్తులో జ్ఞానశూన్యత్వం, సర్వేశ్వరుడివిషయంలో నియమనం అసాధారణధర్మాలుగా తెలుసుకున్నప్పుడే చిత్, అచిత్, ఈశ్వరుడు అనే యథార్థపదార్థాలని ఒకడు యథార్థంగా తెలుసుకున్నవాడౌతాడు. అటువంటి జ్ఞానమే పరమపురుషార్థమైన మోక్షోపయోగి అవుతోంది.

### *17. శరీరాత్మభావం.*

*"సమ్యఙ్న్యాయకలాపేన మహతా భారతేన చ। ఉపబృంహితవేదాయ వ్యాసాయ విష్ణవే నమః॥"* అన్న వచనంప్రకారం భగవానుడి అంశావతారమైన శ్రీవేదవ్యాసులవారు మహాభారతాన్ని సాయించేరు. శారీరకమైన బ్రహ్మమీమాంసాశాస్త్రాన్ని సాయించేరు. దీనివల్ల వీరు సాయించిన మహోపకారం వేదాంత ఉపబృంహణమే. వేదాంతంతో వేదాంతార్థాన్ని తెలుసుకునే కాలంలో వేదార్థాన్నిమాత్రం తీసుకొని వేదాంతార్థాన్ని తెలుసుకోవడం సాధ్యంగాదు. వేదాంతార్థాన్ని యథాతథంగా తెలుసుకోవడానికి వాటికి ఉపబృంహణమై ఉన్న ఇతిహాసాలు, పురాణాలు మిగతా న్యాయశాస్త్రం అవసరమైనాయి.

న్యాయశాస్త్రం అంటే ఏమిటి? న్యాయశాస్త్రం అనబడేది, శారీరకమీమాంసాశాస్త్రం. శారీరకానికి న్యాయశాస్త్రం అన్నపేరు ఎందువల్లవచ్చిందంటే, ఇందులో ఒక్కొక్క అధికరణంవల్లా, ఒక్కొక్క న్యాయాన్ని చూపించి, ఒక్కో సారార్థాన్నీ శ్రీవేదవ్యాసులవారు నిష్కర్షించడంవల్ల ఈశారీరకమే న్యాయ కలాపం అనబడుతోంది. ఒక్కోఅధికరణంలోనూ ఒక్కోన్యాయం అన్నట్లుగా 156 న్యాయాల కలాపంగా-(group) సంహితంగాఉన్నది శారీరకం. *"ఆర్షం ధర్మోపదేశంచ వేదశాస్త్రాఽవిరోధినా। యస్తర్కేణానుసంధత్తే స ధర్మం వేద నేతరః॥"* (ఋషులకిసాక్షాత్కరించిన వేదాలనీ, ధర్మాలనుపదేశించే స్మృతి

మొదలైనవాటినీ, తర్కంతో ఎవడు విచారిస్తాడో, వాడే ధర్మాన్ని తెలిసినవాడు. ఇతరుడు తెలుసుకోలేడు) అంటోంది మనువచనం. శ్రీభాష్యారంభంలో మన స్వామి ఎంబెరుమానార్లు *"న్యాయానుగృహీతస్య వాక్యస్యార్థ నిశ్చాయకత్వాత్"* (న్యాయంచేత అనుగ్రహింపబడిన వాక్యానికే అర్థాన్ని నిశ్చయించే గుణం ఉండడంవల్ల) అనిసాయించేరు. శారీరకశాస్త్రం, శ్రీభాష్యాదితద్వివరణగ్రంథాలూ, ఈపద్ధతిలోనేఉన్నవిగా గమనించ బడుతున్నాయి.

ఈగ్రంథానికి శారీరకం అనిపేరు ఎలావచ్చింది అనిచూడాలి. *"సంహితం ఏతత్ శారీరకమ్...."* అన్నారు బోధాయనమహర్షి. బోధాయనుల వృత్తిగ్రంథాన్ననుసరించి భాష్యంచెప్తానని శ్రీభాష్యారంభంలో *"భగవద్బోధాయనకృతాం విస్తీర్ణాం పూర్వాచార్యాః సంచిక్షిపుః"* అన్న ప్రతిజ్ఞావాక్యాన్ని సాయించేరు స్వామి ఎంబెరుమానార్లు. శరీరమంటే, ఏమిటి? శారీరుడు అంటే ఏమిటి? అనేవాటినన్నింటినీ మన పూర్వాచార్యులు విస్తారంగా నిరూపించి సాయించేరు. మనకున్నది శరీరం అనబడుతుంది. మనకున్నది ఒకే శరీరం. కొంతమంది పెద్దలు ఎన్నో శరీరాలని పరిగ్రహించేరన్నది మనకి తెలుసు. (సౌభరి మహర్షి 50 శరీరాలని పరిగ్రహించేరన్నది చరిత్రం.) కాని భగవానుడికి అంతా శరీరమే. ఈజగత్తునే శరీరంగా గలవాడు పరమాత్మ. *"యస్యాత్మా శరీరం, యస్య పృథివీ శరీరం, ఏష సర్వభూతాన్తరాత్మా ... నారాయణః"* అన్న వేదాన్తవాక్యం భగవానుడు తప్ప మిగిలిన సమస్త చేతనాచేతన పదార్థాలూ సర్వేశ్వరుడికి శరీరం అని స్పష్టంగా చెప్తోంది. అంటే, ఆత్మపదార్థం, అచేతనపదార్థం అనే తారతమ్యంలేకుండా చేతనాచేతన సమస్తద్రవ్యాలనీ తనకి శేషంగానూ, నియామ్యంగానూ, ధార్యంగానూ వ్యాప్తివిశిష్టుడిగా ఉన్నవాడు భగవానుడు. వ్యాప్యమై, ధార్యమై, నియామ్యమై ఉన్నది శరీరం. వ్యాపకుడుగానూ, ధారకుడిగానూ, నియంతగానూ, శేషిగానూ, ఉన్నది ఆత్మ. ఇది మన సంప్రదాయంప్రకారం శరీరాత్మభావాన్ననుసరించిన లక్షణం.

శ్రీభాష్యంలో *"యస్య చేతనస్య యద్ద్రవ్యం సర్వాత్మనా సర్వార్థే, నియంతుం, ధారయితుం, చ శక్యం, తచ్ఛేషతైకస్వరూపంచ, తత్ తస్య శరీరం"* (2-1-4) (ఏచేతనుడికి ఏద్రవ్యం ఆచేతనుడి ప్రయోజనం కోసం ఆతనిచేత నియమింపబడడానికీ, ధరింపబడడానికీ, తగినదై ఉన్నదో, అతనికి శేషమై ఉండడమే స్వభావంగా గలిగి ఉన్నదో, ఆద్రవ్యం ఆచేతనుడికి శరీరం అవుతుంది) అని మన స్వామి సాయించేరు. ఆత్మ అని ఏవస్తువుని చెప్పినాకూడా, అది వ్యాపకమై,ధారకమై, శేషియై, నియంతై ఉంటుంది. ధార్యమై, నియామ్యమై, వ్యాప్యమై, శేషమై ఉండే శరీరలక్షణం అనేది అచిత్తుకీ తుల్యమే! చిత్తుకీ తుల్యమే! దీన్నిబట్టి చూస్తే, ధార్యమై, శేషమై, నియామ్యమై, ఉండే జగత్తు భగవానుడైన ధారకుడికి, భగవానుడైన నియంతకి, భగవానుడైన శేషికి శరీరంగా ఉంటుంది.

ఇలా *"ఈజగత్తనేది భగవానుడికి శరీరమై, ఉన్నది. - దీనికి సర్వేశ్వరుడు ఆత్మయైనాడు."* అని జగత్తుకీ, భగవానుడికీ ఉన్న ఈసంబంధాన్ని గురించినది శరీరాత్మభావం అనబడుతుంది. *"జగచ్ఛరీరి విష్ణుః"* అన్నదే వేదాంతసిద్ధాంతాల్లో చాలా ముఖ్యమైనదీ, పరమకారుణికులైన మన స్వామి ఎంబెరుమానార్లు చాలా ఆదరించి మనకి చూపిన యథార్థం. అనాదియైనదీ, పరమవైదికమైనదీ అయిన మన విశిష్టాద్వైతసిద్ధాంతం తాలూకు ప్రధాన ప్రతితంత్రార్థమైన - అంటే, మన సిద్ధాంతానికే

అసాధారణమైనదీ, మూలమైనదీ అయిన వేదాంతసిద్ధాంతం. ఈశరీరాత్మభావంతోనే మన సంప్రదాయంలో తత్త్వహితపురుషార్థాల నిర్ణయం మన పూర్వాచార్యులు చేసేరు.

తత్వాన్ని వివరించేటప్పుడు అవరతత్వం (తక్కువదైన తత్వం) శరీరం. దీనికంటే ఎన్నో విధాలుగా, గొప్పదైనది ఆత్మతత్వం. ఆత్మ అనే తత్వం ఉన్నతమైనది అన్నదీ, దానికంటే తక్కువదైన తత్వం శరీరం అన్నదినీ అనుభవసిద్ధం. ఇలాగే, ఈప్రాణమైన ఆత్మనే తనకి శరీరంగా గల ఈప్రాణానికే ప్రాణంగాఉన్న ఎంబెరుమానుడు పరతత్వం అయినాడు.

శారీరుడు అంటే జగత్తే శరీరంగా గలవాడని అర్థం. శ్రీవేదవ్యాసకర్తృకమైన శారీరకమీమాంసాశాస్త్రం శారీరుడైన సర్వేశ్వరుడినిగురించిన శాస్త్రంగా ఉండడంవల్ల శారీరకం అనబడుతోంది. ఆనందమయాధికరణ శ్రీభాష్యంలో మన స్వామి ఎంబెరుమానార్లు *"స్వవ్యతిరిక్తం చేతనాచేతనవస్తుజాతం స్వశరీర మితి స ఏవ నిరుపాధికః శారీర ఆత్మా । అత ఏవేదం పరంబ్రహ్మాది కృత్యప్రవృత్తం శారీరమిత్య భియుక్తై రభిధీయతే"* తనకంటే వేరైన చేతనాచేతనాలని శరీరంగా గలవాడై, పరమపురుషుడుండడంవల్ల ఆయనే సహజమైన శారీరుడైన ఆత్మైనాడు. అందువల్లనే ఇటువంటి పరవస్తువునిగురించి ఏర్పడ్డ ఈశాస్త్రం శారీరకశాస్త్రం అని ఆధారాలవల్ల చెప్పబడింది - అని సాయించేరు. వేదాలని ద్రావిడభాషలో సాయించిన నమ్మాళ్వారుకూడా *'ఉడన్‌మిశై ఉయిరెన క్కరన్దెఙ్గుమ్ పరన్దుళన్'* అనిన్నీ, *"ఉయిరినాల్ కుఱైవిలన్"* అనీ, *'ఉయిరుక్కుమ్ ఉయిరినాల్ కుఱైవిలన్"* అనీ సాయించేరు. దేశికులు న్యాయసిద్ధాంజనంలో *"స్వజ్ఞాన స్వేతర సమస్తద్రవ్య శరీరకత్వం"* అని, - అంటే, తానూ,తనజ్ఞానం తప్ప మిగతా సమస్తద్రవ్యాలనీ శరీరంగా కలిగిఉండడం అని ఈశరీరాత్మభావంతో ఈశ్వరలక్షణాన్ని సాయించేరు.

భగవానుడిని శారీరుడని మనపూర్వాచార్యులుమాత్రం చెప్పేరని అర్థంగాదు. వేదాంతమే చెప్తోంద న్నది మొదట్లోనేచూసేం. వేదోపబృంహణంగా అవతరించిన శ్రీరామాయణంలోకూడా ఈవిషయాన్ని మనం చూడవచ్చు. రావణవధానంతరం రాముడిని బ్రహ్మ మొదలైన దేవతలందరూ స్తోత్రంచేసేరు. అప్పుడు *"జగత్ సర్వం శరీరం తే"* అని బ్రహ్మ శ్రీరాముడిని స్తోత్రం చేసినట్లుగా శ్రీరామాయణవచనం. ఈమాటని ఉదాహరించేరు మన ఎంబెరుమానార్లు శ్రీభాష్యంలో. ఇలా అన్ని శాస్త్రాల్లోనూకూడా భగవానుడు జగత్తకి ఆత్మ, జగత్తంతా భగవానుడికి శరీరంఅని జగత్తుకీ బ్రహ్మకీ ఉన్న శరీరాత్మసంబంధం వ్యక్తంగా చెప్పబడింది. 'నారాయణ"శబ్దంతాలూకు పరమార్థం ఇదే అవుతుంది. నారములకి భగవానుడు అయనంగా ఉన్నాడు. ఇది మాత్రమేగాదు, నారములనే అయనముగా గలవాడు భగవానుడు. ఇదే బహువ్రీహి సమాసం అని చెప్తారు. 'నారాః అయనం యస్య సః నారాయణః" - దీనివల్ల చెప్పబడ్డది అంతర్యామిత్వం అంటారు మన పూర్వాచార్యులు.

### *18. శారీరక శాస్త్ర ఉపోద్ఘాతవిచారం.*

గ్రంధారంభంలో గ్రంధారంభహేతువుగా అనుబంధచతుష్టయం చూపబడడం గ్రాంధికసరణి. *"స్వజ్ఞానమను ముముక్షుం గ్రంథేన బధ్నాతీతి అనుబన్ధః"* అని చెప్తారు. నాలుగు స్తంభాలు లేకపోతే, మండపం నిలవదు. అలాగే అనుబన్ధచతుష్టయం లేకపోతే ఎవరికీ గ్రంధంలో ప్రవృత్తి కలగదు. కనుక,

అనుబంధ చతుష్టయం చూపబడాలి. విషయప్రయోజనసంబంధ అధికారాలు అవే అవుతాయి. *"విషయాది త్రికస్యోక్తిః ప్రథమం ప్రతిపాద్యతే" "అథాతో ధర్మ జిజ్ఞాసా సూత్రమాద్యమితం కృతమ్. ధర్మాఖ్యం విషయం వక్తుం మీమాంసాయాః ప్రయోజనమ్" "బ్రహ్మేతి తావత్ విషయం ప్రాప్యత్వేన ప్రయోజనమ్। జిజ్ఞాసా కర్మభావేన సంబంధమపి చాబ్రవీత్॥" "శాస్త్రారమ్భేషు సర్వత్ర సమ్బన్ధః కథ్యతే బుధైః। అసంబద్ధప్రలాపత్వే న ప్రవర్తేత బుద్ధిమాన్॥"* ఇత్యాది తత్త్వటీక వచనాలు అనుసంధేయాలు.

కర్మఫలవిరక్తుడైన ముముక్షు అధికారి జిజ్ఞాసాధికరణంలో చెప్పబడ్డవాడు. విషయమైన బ్రహ్మం జగజ్జన్మాది కారణంగా చెప్పబడింది జన్మాద్యధికరణంలో. పరవస్తువుకీ శాస్త్రానికీ ఉన్న సంబంధం ప్రతిపాద్యప్రతిపాదక సంబంధం. ఇది శాస్త్రయోనిత్వాధికరణసారం అవుతుంది. అక్కడ బ్రహ్మం శాస్త్రైకవేద్యం, ప్రమాణకం అనే నిరూపించబడింది. ఫలం = భగవత్తత్త్వం పరమప్రయోజనం, పరమ పురుషార్థభూతం అని నిరూపించబడింది సమన్వయాధికరణంలో. ఇలా అధికారి, విషయం, సంబంధం, ఫలం, అని అనుబంధిచతుష్టయాన్ని మొదటి నాలుగు అధికరణాలూ శాస్త్ర ఉపోద్ఘాతం అంటారు పెద్దలు. *"శాస్త్రారమ్భార్థా చతుస్సూత్రీ"* అంటారు శ్రుతప్రకాశికాచార్యులవారు. పైగా, *"ఈక్షతేః నాశబ్దమ్"* అన్న సూత్రం ప్రారంభంగా *"అనావృత్తిః శబ్దాత్"* అన్న చివరిసూత్రం వరకూ ఉన్న భాగం శాస్త్రం అని మన ఆచార్యులు భావిస్తున్నారు.

మన సంప్రదాయంలో ఎంతోమంది పెద్దలు ఎన్నో గ్రంథాలని సాయించేరు. మనకి ఈపెద్దలని గురించి అంతా ఏమీ తెలియదు. వీటిలో ఎన్నోలోపాలతో ఉన్నాయి. మిగతా గ్రంథాల్లోనూ ఎన్నోగ్రంథాలు ఈనాడు ప్రచారంలో లేవు. ఏవోకొన్ని గ్రంథాలుమాత్రం ఇప్పుడు కొంతమందికి అనుభవవిషయమై ఉన్నాయి. ఇటువంటిగ్రంథాల్లో శ్రీభాష్యానికి వ్యాఖ్యానంగాఉన్న గ్రంథం *"నయప్రకాశికా"* అనేది. ఈగ్రంథాన్ని సాయించినవారు మేఘనాథారిసూరి అనేవారు. వీరు దేశికులకి ముందరికాలంలో వేంచేసిన వారు. మేఘనాథుడు అని ఇంద్రజిత్తుకి పేరు. మేఘనాథారి అంటే ఇంద్రజిత్తుని జయించిన లక్ష్మణుడు అనే లక్ష్మణముని అని అర్థం. ఇలా వీరు మనస్వామి ఎంబెరుమానార్ల పేరుగలవారు అన్నమాట.

*"నయప్రకాశికా"* అనే శ్రీభాష్యవ్యాఖ్యానగ్రంధంలో వీరు ***"పూర్వకాండంలో దానికి మొదటి సూత్రమైన "అథాతో ధర్మజిజ్ఞాసా" ఉపోద్ఘాతమై ఉన్నట్లే ఉత్తరకాండానికి "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" అనే మొదటిసూత్రం మాత్రం ఉపోద్ఘాతంగా ఉన్నది"*** - అని భావించేరు. *"చతుస్సూత్ర్యాః ఉపోద్ఘాతత్వాభావాత్. తచ్చ ఉత్తర పాదాదిషు అస్మాభిరుక్తమ్"* అనిన్నీ *"అథాతో ధర్మజిజ్ఞాసా ఇతి సూత్రవత్ ఏకమేవ వేదాన్తసూత్రం శాస్త్రోపోద్ఘాతః"* అని వారు సాయించేరు. సర్వత్రప్రసిద్ధ్యధికరణావతారికాభాష్యంలో ఉన్న *"శారీరకమీమాంసా శ్రవణం ఆరభేత ఇత్యుక్తం శాస్త్రారంభసిద్ధయే"* అన్న శ్రీసూక్తిని గమనించినప్పుడు నయప్రకాశికానిర్వాహానికి అనుకూలంలాగే అనిపిస్తుంది, కాని అక్కడ శ్రుతప్రకాశికాభట్టర్ మూడు నిర్వాహాలని చూపి ,సూత్రచతుష్టయంకూడా శాస్త్రోపోద్ఘాతం అనేపక్షాన్ని స్థాపించేరు.

*"శాస్త్రారమ్భార్థా చతుస్సూత్రీ"* అన్న మార్గం *"ఔచిత్యానేకభాష్యస్వరసగతిమతీ ప్రాక్తనీ*

***వర్ణనీయమ్*** " అన్న అధికరణసారావళి శ్రీసూక్తిప్రకారం అఖండరాజమార్గం అన్నమాట. సాధారణంగా ఈనాలుగు అధికరణాల్లో ఇది స్పష్టం అవుతోంది. "***బ్రహ్మం శాస్త్రవేద్యమూ గాదు, శాస్త్రం బ్రహ్మప్రతిపాదకమూగాదు***" అని ఒక్కోముఖంద్వారా ఆక్షేపం వస్తే, దానికి తగిన సమాధానాలని చెప్పి, "***బ్రహ్మం శాస్త్రవేద్యం అని స్పష్టమౌతోంది***" అని జిజ్ఞాసా ఉపపత్తిని నాలుగు అధికరణాలవల్లా స్థాపించేరు వ్యాసులవారు. కనుక, ఈనాలుగే శాస్త్రోపోద్ఘాతం అవుతాయి. శాస్త్రం అని ఇక్కడ వివక్షింపబడినది మీమాంసాశాస్త్రసామాన్యం గాదు. తదేకదేశభూతమైన శారీరకమీమాంసే. అందులోకూడా, ఈక్షత్యధికరణంతో ప్రారంభమైన శాస్త్రమే వివక్షితం. కనుక, చతుస్సూత్రిభాగం 20 అధ్యాయాలున్న మీమాంసలకీ ఉపోద్ఘాతంకాదు. "అథాతో బ్రహ్మ జిజ్ఞాసా" అన్న సూత్రంతో ఆరంభమయ్యే గ్రంథానికీ ఉపోద్ఘాతం కాదు. "***ఈక్షతేః నాశబ్దమ్***" అని ప్రారంభమై, "***అనావృత్తి శ్శబ్దాత్***" అన్నంతవరకూ ఉన్న శారీరకవిశేషానికే ఉపోద్ఘాతం అన్నమాట.

ఈనాలుగు అధికరణాలనీ రెండు పేటికలుగా విభజించేరు దేశికులు. సిద్ధబ్రహ్మవిషయక ప్రతీతిని స్థాపించేయి మొదటి రెండు అధికరణాలూ. "***సిద్ధవస్తుసామాన్యాన్ని శబ్దసామాన్యం బోధించదు***" అన్న ఆక్షేపాన్ని నిరసించేరు మొదటి అధికరణంలో. "***సిద్ధవిశేషమైన బ్రహ్మాన్ని శబ్దవిశేషమైన బ్రహ్మశబ్దం బోధిస్తుంది***" అన్నారు రెండో అధికరణంలో. జిజ్ఞాసాధికరణవిషయవాక్యంలో "***స గురుమేవాభిగచ్ఛేత్***" అని సాధారణమైన గురుభక్తి చెప్పబడింది. జన్మాద్యధికరణవిషయవాక్యంలో శిష్యవిశేషమైన పుత్రుడికి (భృగువుకి) తండ్రియైన ఆచార్యుడు వరుణుడు ఉపదేశించేరు అని చెప్పబడింది విశేషం. మొదటి అధికరణంలో నిరీశ్వరవాది నిరాకరణం. రెండోఅధికరణంలో నిర్విశేషవాది నిరాకరణం అని విభజించి ఉన్నది. వస్తుతః రెండో అధికరణంకూడా నిరీశ్వరవాదినిరాసకమే అని చెప్పాలి. నిర్విశేషవస్తువు ఈశ్వరుడుగా ఉండసాధ్యంగాదు గనుక, అంటారు మన పెద్దలు. శారీరకం మొదటి అధ్యాయంలో చెప్పబడిన అర్థాన్ని మొదటి సూత్రంవల్లా, రెండో అధ్యాయంలో చెప్పబడిన అవిరోధాన్ని రెండో అధికరణంవల్లా చెప్పున్నారు శ్రీవేదవ్యాసులవారు ఇది చతుస్సూత్రి మొదటి పేటిక.

రెండో పేటిక తరువాతి రెండు అధికరణాలూను. తాత్పర్యలింగసమర్థనపరత్వం ఉత్తరపేటికకి ఉన్నదవుతుంది. అప్రాప్తత్వలక్షణమైన తాత్పర్యలింగం మూడో సూత్రంవల్లా, సఫలత్వలక్షణతాత్పర్య లింగం నాలుగో సూత్రంవల్లా సమర్థింపబడుతోంది. "***మానాంతరప్రాప్తం బ్రహ్మతత్వం. అనుమానంవల్లనే ఈశ్వరుడిని సాధించవలెను. వేదాంతఅధ్యయనంవల్ల కలిగిన ఆపాతప్రతీతి ఈశ్వర అనుమానంవల్లనే నిశ్చయబుద్ధిగా ఏర్పడుతుంది. దీనివల్ల శాస్త్రం ఆవశ్యకంగాదు.***" అని పూర్వపక్షం. దీన్ని నిరసిస్తున్నారు శాస్త్రయోన్యధికరణంలో శ్రీవేదవ్యాసులవారు. బ్రహ్మవిషయంలో శాస్త్రమే ప్రమాణం అని చెప్పి, బ్రహ్మం మానాంతరగోచరం కాకపోవడంవల్ల శాస్త్రైకవేద్యంగనుక శాస్త్రానికి అప్రాప్తత్వలక్షణవైభవం స్థాపించడం నాలుగో అధికరణంలో. "***త్రయ్యన్తాః సత్యనిత్య అద్భుత పరమసుఖబ్రహ్మనిష్ఠాః ప్రమాణమ్***" అని సాయించేరు దేశికులు. ఈఅధికరణంలో సాఫల్యలక్షణతాత్పర్యలింగసమర్థనం చెయ్యబడుతోంది.

ఇలా బ్రహ్మం సిద్ధవస్తువైనా, శాస్త్రం చెప్తుంది అనిన్నీ, బ్రహ్మం జగజ్జన్మాదికారణత్వరూపలక్షణ లక్షితం అనిన్నీ, బ్రహ్మం మానాంతరప్రాప్తంకాదు శాస్త్రైకగోచరం అనిన్నీ, బ్రహ్మం సాక్షాత్ఫలభూతం

అనిన్నీ నాలుగు సూత్రాలవల్ల చెప్పి, బ్రహ్మవిచారకర్తవ్యత్వాన్ని స్థాపించేరు. ఇదే అవతారిక.

ఇక ఈక్షత్యధికరణం మొదలుగా శాస్త్రం. పరమాత్మ కల్యాణగుణాలు శాస్త్రప్రతిపాద్యాలు. సత్యాలు, నిత్యాలు, కల్యాణాలు అనంతాలు, నిరతిశయమైనవి, అవుతాయి. వీటిని తరువాత 16 పాదాలవల్ల శ్రీవేదవ్యాసులవారు స్థాపించేరు. *"అధికరణగుణైః తద్గుణాన్ ఉద్గృణాతి'* అని దేశికులు సాయించేరు.

ఇలా *"బ్రహ్మం జగజ్జన్మాదికారణం, చేతనాచేతనవిలక్షణం, సమస్తకల్యాణగుణాకరం, ప్రాప్యప్రాపకభూతం, ముక్తభోగ్యం, అపునరావృత్తిలక్షణముక్తిప్రదం అని వేదాన్తవేద్యం"* అన్నది శారీరకసారం.

## *19. బ్రహ్మమీమాంసావిషయనిరూపణం.*

ఇరవైఅధ్యాయాలున్న కాండత్రయాత్మకమైన మీమాంసాశాస్త్రం ఏకశాస్త్రం అన్నది మన పూర్వాచార్యులు దర్శించిన క్రమం. దీని మొదటిసూత్రం *"అథాతో ధర్మ జిజ్ఞాసా"* అన్నది. దీన్నిబట్టి చెప్పే శ్రుతప్రకాశికాచార్యులవారు ఆశ్చర్యమైన ఒకఅభిప్రాయాన్ని చూపించేరు. *"అథాతో ధర్మ జిజ్ఞాసా"*, *"ధర్మాన్ని విచారిస్తాను"* అని ఆరంభించేరు జైమిని మహర్షి. ఇక్కడ ధర్మం అని దేన్ని విచారిస్తున్నారు అన్నది చూడాలి. సాధారణంగా ధర్మం అంటే, అది యజ్ఞం, దానం, తపస్సు వంటివాటిని చెప్తుంది. ఇవన్నీ, సాధ్యధర్మాలనబడుతున్నాయి. అంటే, మన ప్రయత్నంవల్ల సాధింపబడేవిగాను, సాధింపబడవలసిన ధర్మాలుగానూ ఉండడంవల్ల ఇవి సాధ్యధర్మాలనబడుతున్నాయి.

కాని ఈధర్మాలకంటే భగవానుడే పరమధర్మంగా ప్రకాశిస్తున్నాడు. ఆయనే *"సిద్ధధర్మం"* అనబడేవాడు. ఇలా సాధ్యధర్మాలైన యజ్ఞం, దానం, తపస్సువంటివాటికి పైగాసిద్ధధర్మంగా ప్రకాశిస్తూ ఉన్నవాడు భగవంతుడొక్కడే. ధర్మశబ్దం ధృతిసాధనం, ప్రీతిసాధనం ధర్మం అని సిద్ధధర్మమైన ఈశ్వరుడిని సాధ్యధర్మమైన యాగదానహోమాదులనీ చెప్తుంది.

సాధ్యధర్మమైన పూర్వభాగం వేదం. సిద్ధధర్మపరం ఉత్తరభాగమైన వేదాంతం అవుతుంది. పూర్వబాగంలో ద్రవ్యాదులు చెప్పబడినా, క్రియాప్రాధాన్యాన్ని గురించి వేదభాగం సాధ్యధర్మపరం అని చెప్పబడుతోంది. *"సిద్ధం సాధ్యం చ ధర్మం ప్రభవతి కథితుం ధర్మశబ్దః అథవా అర్థాత్ ఆరాధ్యాదేః విచారః స్ఫురతు నిగదితః కృత్స్న చిన్త్యోద్యమః చ"* అని శ్రీదేశికులు మీమాంసాపాదుకలో సాయించేరు.

*"భగవానుడు సాక్షాత్ధర్మశబ్దవాచ్యుడు"* అన్నది సంప్రదాయసిద్ధమైన విషయం. దీనికి రెండు వచనాలు ఉదాహరించేరు శ్రుతప్రకాశికాచార్యులవారు. ఒకటి శ్రీరామాయణంలో మారీచుడిమాటగా చెప్పబడిన *"రామో విగ్రహవాన్ ధర్మః"* అన్నది. మరొకటి *"కృష్ణం ధర్మం సనాతనమ్"* అన్నది. వేదవిదులందరూ వేదాంతార్థం పుణికిపుచ్చుకున్నవాళ్ళందరూ సాక్షాత్ ధర్మం కృష్ణుడేనని ప్రశంసిస్తున్నారు అంటే దానికి అభిప్రాయం ఏమిటి?

గీతలో *"సర్వధర్మాన్ పరిత్యజ్య"* అని పద్ధెనిమిదో అధ్యాయంలో భగవానుడి దివ్యసూక్తి. పిళ్ళైలోకాచార్యులవారు ముముక్షుప్పడిలో చరమశ్లోకప్రకరణంలో *"సర్వధర్మాన్ పరిత్యజ్య"* అన్నదానికి వ్యాఖ్యానంలో అశ్చర్యకరంగా ఒక అభిప్రాయాన్ని తెలియజేసేరు. అదేమిటంటే, గీతలో నాలుగో అధ్యాయంలో అవతారరహస్యప్రకరణంలో *"ధర్మ సంస్థాపనార్థాయ.."* అంటూ ధర్మాలని స్థిరంగా స్థాపించడానికి అవతరించినట్లుగా భగవానుడు సాయించేడు. ఇక్కడ పద్ధెనిమిదో అధ్యాయంలో చరమశ్లోక ప్రకరణంలో *"ధర్మాలని వదిలివేసి"* అని సాయించేడే, దీనికి అభిప్రాయం ఏమిటి అని ప్రశ్నించి, భగవానుడి మనోభావాన్ని వివరించేరు. అంటే, *"సర్వధర్మాన్ పరిత్యజ్య"* అని సర్వధర్మాలనీ వదిలి అని చెప్పినప్పుడు, *"సర్వధర్మాన్ పరిత్యజ్య"* అని మాత్రం చెప్పలేదు. వెంటనే *"మామేకం శరణం వ్రజ"* అని తనని ఆశ్రయించమనికూడా చెప్పేడు. దీని అర్థం ఏమిటంటే, ఇతరధర్మాలని ధర్మంగా పట్టుకోకుండా, తనవొక్కడినే ధర్మంగా పట్టుకోవాలి అనిమాత్రమే. ఇలా, మొదట ధర్మాలని వదిలివేయి అనిచెప్పి, తర్వాత తననిమాత్రమే ధర్మంగా పట్టుకో అని చెప్పడంవల్ల సాక్షాత్తు ధర్మపదవాచ్యుడు భగవానుడే అన్నది భగవదభిప్రాయంవల్లనే అని చక్కగా తెలుస్తోంది. ఇలా అతడినే ధర్మంగా తల్చే తలంపే శరణాగతి అన్నమాట. ఇలా *"ధర్మసంస్థాపనం"* అంటే, సిద్ధధర్మమైన తనని స్థాపించడానికి ఆయన ఇక్కడకి వచ్చి అవతరించేడు అన్నదికూడా స్పష్టమౌతోంది. ఇలా ధర్మశబ్దానికి సాధ్యధర్మాలూ, అర్థమే. సిద్ధధర్మమూ అర్థమే. సాధ్యసిద్ధ ఉభయసాధారణమైన శబ్దమే ధర్మశబ్దం.

కనుక, *"అథాతో ధర్మ జిజ్ఞాసా"* అని ప్రారంభించిన జైమిని మహర్షి మనోభావం ఏమిటంటే, ***"సాధ్యధర్మం, సిద్ధధర్మం అన్నింటినీ విచారిస్తున్నాను"*** అనిమాత్రమే. దీన్నే శ్రుతప్రకాశికాచార్యులవారు *"సాధారణప్రతిజ్ఞా"* అని సాయించేరు. మొదట్లో కర్మదేవతాగోచరమైన 16 అధ్యాయాలు, తరువాత బ్రహ్మగోచరమైన 4 అధ్యాయాలు, మొత్తం 20 అధ్యాయాలున్న మీమాంసాశాస్త్రం గొప్పశాస్త్రం అంటారు మన పూర్వాచార్యులు. ధర్మాన్ని విచారిస్తున్నాను అని 12 అధ్యాయాల్లో ధర్మాన్ని విచారించేరు జైమిని. తరువాత 4 అధ్యాయాల్లో దేవతా విచారం చేసేరు. ఇలా సాధ్యధర్మాలని ఇంతగా విచారించి తరువాత సిద్ధధర్మాన్నివిచారించబోతున్నప్పుడు శ్రీవేదవ్యాసులవారు ***"సిద్ధధర్మమైన బ్రహ్మాన్ని గురించి నేను విచారిస్తున్నాను"*** అని *"అథాతో బ్రహ్మ జిజ్ఞాసా"* అని బ్రహ్మవిచారాన్ని తాము చెయ్యగోరుతున్న కృత్యంగా వర్ణించి ఆరంభించేరు అన్నది మనపూర్వుల నిర్వాహం. ఇలా ఇదికూడా ధర్మమే, అదికూడా ధర్మమే. సాధ్యధర్మాలనిగురించి శిష్యులైన జైమిని విచారించేరు. తరువాత సిద్ధధర్మాన్ని గురించి జైమినికి ఆచార్యులైన శ్రీవేదవ్యాసులవారు విచారించి ఈమీమాంసాశాస్త్రాన్ని పూర్తి చేసేరని వివరిస్తున్నారు శ్రుతప్రకాశికాచార్యులవారు. ఇలా బ్రహ్మసూత్రాలు సిద్ధోపాయమైన (సిద్ధధర్మమైన) సాక్షాద్ధర్మమైన, చేతనోపాయమైన భగవద్విషయాన్ని గురించినది అన్నది సంప్రదాయం.

### *20. శారీరకంలో ద్వికభేద విషయనిరూపణం - 1.*

ఇకమీదట, బ్రహ్మమీమాంసాశాస్త్రంలోని నాలుగు అధ్యాయాల్లోనూ శ్రీవేదవ్యాసులవారు సిద్ధ ధర్మాన్నిగురించే విచారించేరని అనుకోవాలా? ఈనాలుగధ్యాయాల్లోనూ సాధ్యధర్మాలనిగురించి విచారించ

లేదా? అనే ప్రశ్నలు వస్తాయి. దీనికి శ్రుతప్రకాశికాచార్యులవారు సమాధానంగా సాయించినదేమిటంటే, ఈనాలుగధ్యాయాల్లోనూ, సిద్ధధర్మాన్నిగురించీ, సాధ్యధర్మంగురించీకూడా శ్రీవేదవ్యాసులవారు వర్ణించేరని. ఈనాలుగధ్యాయాలనీ రెండు ద్వికాలుగా విడదీయవచ్చు. (రెండింటినీ కలిపి "**ద్వికం**" అని చెప్తారు.) మొదటి రెండధ్యాయాలూ "**పూర్వద్వికం**" అనీ, తరువాతి రెండధ్యాయాలూ "**ఉత్తరద్వికం**" అనీ అంటారు. పూర్వద్వికాన్నే "**సిద్ధద్వికం**" అనికూడా చెప్తారు. మూడు, నాలుగు అధ్యాయాలని "**ఉత్తరద్వికం**" అనీ, "**సాధ్యద్వికం**" అనీ చెప్తారు. మూడో అధ్యాయంలో మొదటి రెండధ్యాయాల్లో విచారింపబడిన పరమాత్మని ఉపాసించాలి అన్నారు. నాలుగో అధ్యాయంలో ఇలా ఉపాసించినవాడికి అర్చిరాదిమార్గం లభిస్తుందనీ, వాడికి పరమపదం లభిస్తుందనీ, పరమపదంలో పరిపూర్ణబ్రహ్మానుభవం పొంది ఆనందించగలడనీ, అక్కడినుంచి తిరిగి సంసారమండలంలోకి రాకుండా ఎప్పుడూ నిత్యానందానుభవం పొంది, అక్కడే ఉంటాడనీ, సాధించి, నాలుగధ్యాయాలున్న ఈశారీరకశాస్త్రాన్ని పూర్తిచేసేరు. మూడో అధ్యాయం "**సాధనాధ్యాయం**", నాలుగో అధ్యాయం "**ఫలాధ్యాయం**". ఈసాధనంగాని, ఫలం గాని రెండూ సాధ్యాలు.

ఇలా సిద్ధవస్తువైన పరమాత్మనిగురించి మొదటి రెండధ్యాయాలు. ఆతర్వాత సాధ్యం అంటే ఏమిటి? ఆసర్వేశ్వరుడినే మనం ఉపాసించాలి. ఆసర్వేశ్వరుడినే ధ్యానం చెయ్యాలి. ఆసర్వేశ్వరుడిగురించే భక్తి, ధ్యానం, ఆయననే ఉపాసించడం మన ప్రయత్నంవల్ల సాధింపబడవలసిన ఉపాసనంగా ఉండడంవల్ల అవి సాధ్యం. ఆతర్వాత పరమపదవిశిష్టుడైన పరమాత్మని పొందాలి.సర్వేశ్వరుడు అక్కడా ఉన్నాడు, ఇక్కడా ఉన్నాడు, అంతటా ఉన్నాడు. ఉన్నప్పటికీ, అర్చిరాదిమార్గంలో వెళ్ళి పరమపదనాథుడిని చేరి, ఆసర్వేశ్వరుడి పరిపూర్ణమైన అనుభవాన్ని పొంది, ఆఅనుభవజనితప్రీతితో ఈజీవాత్మ చెయ్యవలసిన కైంకర్యమే పరమపురుషార్థం అన్నమాట.

మన సంప్రదాయంప్రకారం, పరిపూర్ణబ్రహ్మానుభవం, అనుభవజనితప్రీతి, ప్రీతికారిత సర్వదేశ సర్వ కాల సర్వావస్థోచిత అశేషకైంకర్యమే మోక్షం. మోక్షస్వరూపం ఇటువంటిది అన్నదాన్ని మన స్వామి అత్త్రధికరణశ్రీభాష్యంలోనే నిర్ణయించేరు. ఇది భగవానుడి కృపాసాధ్యంగా ఉండడంవల్ల - మనయత్నసాధ్యం ఉపాసనం అనేది - ఈరెండే మూడో అధ్యాయంలోనూ, నాలుగో అధ్యాయంలోనూ వ్యాసులవారు వర్ణించేరు. ఈవిధంగా మొదటి రెండధ్యాయాలూ సిద్ధాన్నిగురించి అనీన్నీ, తరువాతి రెండధ్యాయాలూ సాధ్యాన్నిగురించినవనీన్నీ సాయిస్తున్నారు శ్రుతప్రకాశికాచార్యులైన సుదర్శనభట్టర్‌వారు.

నమ్మాళ్వారు సాయించిన తిరువాయ్‌మొళ్ళి పదిపదుల్లో ఉన్నది. దీన్ని రెండు భాగాలుగా విడదీసేరు మన పన్నీరాయిరప్పడిసాయించిన అళ్ళగియమణవాళజీయర్. మొదటి ఐదు పదులూ సిద్ధప్రతిపాదకమై ఉన్నవనిన్నీ, తరువాతి ఐదుపదులూ సాధ్యప్రతిపాదకమైఉన్నాయనిన్నీ వీరి నిర్వాహం. సిద్ధవస్తువైన పరమాత్మనిగురించి మొదటి రెండు పదులూ, సిద్ధవస్తువైన జీవాత్మనిగురించినవి తరువాతి రెండుపదులూ. పరమాత్మ సిద్ధోపాయం అనే అర్థాన్ని ప్రతిపాదించేదై ఉన్నది ఐదో పది. ఇలా ఈఐదుపదులూ సిద్ధపరంగా ఉన్నాయి అంటారు మన పూర్వాచార్యులు. ఆరో పది ఆఎంబెరుమానుడిని

ఉపాయంగా మనం ఆశ్రయించే స్వీకారాన్ని గురించినది. *"ఉన్ అడిక్కీళ్ అమర్న్దు పుగున్దేనే"* ఇది సాధ్యోపాయం - సాధ్యోపాయం అంటే, మన ప్రయత్నసాధ్యమై కాకుండా పోయినా, భగవత్కృపాసాధ్యంగనుక అది సాధ్యోపాయమేనన్నమాట. ఏడు, ఎనిమిది పదుల్లో అనిష్టనివృత్తినిగురించి చెప్తున్నారు. తొమ్మిది, పది పదుల్లో ఇష్టప్రాప్తినిగురించి చెప్పినవిగానే ఉన్నాయి. ఇలా ఉపాయస్వీకారంకూడా సాధ్యమే. అనిష్టనివృత్తికూడా సాధ్యమే. ఇష్టప్రాప్తికూడా సాధ్యమే. అంచేత సిద్ధాన్ని గురించినవి మొదటి ఐదుపదులు, సాధ్యాన్నిగురించినవి తరువాతి ఐదుపదులు. అది సిద్ధపంచకం, ఇది సాధ్యపంచకం అని రెండు పంచకాలుగా తిరువాయ్మొళ్ళిని విభజించేరు మన పూర్వులు. అలాగే సిద్ధద్వికం, సాధ్యద్వికం అని రెండు ద్వికాలుగా బ్రహ్మమీమాంసా శాస్త్రాన్ని విభజించవచ్చు.

## *21. శారీరకంలో ద్వికభేదవిషయనిరూపణం - 2*

ఈనాలుగు అధ్యాయాలూ విషయద్వికం అనీ, విషయిద్వికం అనీ విభజించబడ్డాయి. విషయం అంటే జ్ఞానానికి విషయం అని అర్థం. జ్ఞానంలో లేక జ్ఞానానికి ఏది విషయంగా తోస్తోందో, ఆవిషయాన్ని గురించి ఉన్నది విషయి. ఒకచోట ఓపుస్తకం ఉంది. దాన్ని మనం పుస్తకం అని తెలుసుకుంటున్నాం. ఈజ్ఞానానికి విషయి అని పేరు. విషయాన్ని గ్రహించే జ్ఞానానికి విషయి అని పేరు. మనం జ్ఞానంచేత ఎన్నో విషయాలని గ్రహిస్తాం. విషయాలన్నీ జ్ఞానాన్నిగురించిన విషయాలు. ఆవిషయాలని గురించి తెలుసుకోవడాన్ని - అంటే జ్ఞానానికి, మన సంప్రదాయంలో విషయి అని పేరు.

ఇలా విషయమైన పరమాత్మనిగురించి మొదటి రెండు అధ్యాయాలు. ఆపరమాత్మని విషయంగా తెలుసుకోవడం - ఉపాసనం అనీ, పరిపూర్ణ బ్రహ్మానుభవం అనీ రెండువిధాలుగా ఉన్నదాన్ని మూడవ, నాలుగవ అధ్యాయాల్లో శ్రీవేదవ్యాసులవారు వర్ణించేరన్నది సంప్రదాయం. మూడో అధ్యాయంలో చెప్పబడిన తెలివి భక్తి, ఉపాసనం అనబడుతున్నాయి. అంటే, ఉపాసనాత్మకమైన (జ్ఞానం)తెలివి. నాలుగో అధ్యాయంలో చెప్పబడిన తెలివి పరిపూర్ణబ్రహ్మానుభవం. భక్తి అనబడే ఉపాసనంకూడా జ్ఞానమే. పరిపూర్ణ బ్రహ్మానుభవంకూడా జ్ఞానమే. కాని ఈజ్ఞానానికీ, ఆజ్ఞానానికీ విశేషం (వ్యత్యాసం) ఏమిటి అన్నదాన్ని మన పూర్వులు విస్తారంగా నిరూపించేరు. ఈజ్ఞానం శాస్త్రజన్యం. ఆజ్ఞానం స్వాభావికం. స్వాభావికం అంటే అది ఎందుకు మనకి ఇంతవరకూ లభించలేదంటే, ఇన్నాళ్ళూ మనకి అది లభించకుండా అడ్డుకుంటున్నది కర్మ. ఈకర్మం అనే ఆటంకం తొలగిపోతే స్వాభావికమైన పరిపూర్ణబ్రహ్మానుభవం లభిస్తుంది. ఈకారణంవల్లనే పరమాచార్యులైన శ్రీపరాశరభట్టరువారు *"అవస్థాస్వావిఃస్యుః మమ సహజ కైంకర్యవిధయః"* అని శ్రీరంగనాథుడిని ప్రార్థించేరు. సర్వేశ్వరుడి అనుగ్రహంవల్ల మనకి కలిగే ఆవిర్భావం ఉన్నదే - అది లోలోపలే మనదగ్గర ఎప్పుడూ ఉండేదే. ఉన్నది ఆవిర్భావం ఒక కాలవిశేషంలో ప్రకాశిస్తుందే తప్ప ఇంతవరకూ మనదగ్గర ఇది లేదు అని అర్థంగాదు.

ఛాందోగ్యంలో పరమాత్మకి ఒక గుణాష్టకం చెప్పబడింది. దహరవిద్యా ప్రకరణంలో *"ఏష ఆత్మా అపహతపాప్మా విజరో విమృత్యు ర్విశోకో విజిఘత్సో஽పిపాసః సత్యకామః సత్యసంకల్పః"* అని ఎనిమిది

రకాలైన కల్యాణగుణాలు పరమాత్మకి చెప్పబడినాయి. ఇలాగే, జీవాత్మకీ గుణాష్టకం ఉన్నది. *"యః ఆత్మా అపహతపాప్మా, విజరో విమృత్యుర్విశోకోవిజిఘత్సోऽపిపాసః సత్యకామః సత్యసంకల్పః"* అని ఈగుణాలు ముక్తజీవుడికి ఉన్నట్టుగా ప్రజాపతి (చతుర్ముఖబ్రహ్మ) ఇంద్రుడికి ఉపదేశించే వాక్యంగా ఇది ఉన్నది. తిరోధాయకమైన కర్మవల్లనే ఈగుణాష్టకం కప్పబడిపోయింది. ఈకర్మసంబంధాన్ని సర్వేశ్వరుడు తన చక్రాన్ని ప్రయోగించి ఛేదిస్తున్నాడు. తిరోధాయకమైన కర్మానికి నివృత్తి కలిగిన తర్వాత జీవాత్మకి లోలోపలే స్వరూపం ఆవిర్భవించి వాడి పరిపూర్ణ బ్రహ్మానుభవాన్ని పొందుతాడు. అందువల్లనే భగవానుడు చరమశ్లోకంలో *"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి"* - ***నువ్వు నన్ను శరణుపొందు. నిన్ను నేను సకలపాపాలనుంచీ విడిపింపజేస్తాను*** అంటాడు.

ఇలా ఉపాసనాత్మకమైన జ్ఞానంకూడా జ్ఞానమే. పరిపూర్ణబ్రహ్మానుభవమూ జ్ఞానమే. కాని ఈరెండింటికీ వ్యత్యాసం ఉన్నది. ఉపాసనాత్మకమైన జ్ఞానం అంటే శాస్త్రజన్యజ్ఞానం - అంటే, సర్వేశ్వరుడినిగురించి బాగా శాస్త్రాన్ని అభ్యసించి, తెలుసుకొనాలి. *"శ్రోతవ్యః"* - ఆచార్యుడిదగ్గిర వినాలి. *"మన్తవ్యః"* - తర్వాత ఒకచోట కూర్చుని బాగా మననం చెయ్యాలి. *"నిదిధ్యాసితవ్యః"* - ఆతర్వాత ధ్యానం చెయ్యాలి. ఇలా మొదట్లో ఆచార్యుడిదగ్గర బాగా శుశ్రూషచేసి, శాస్త్రార్థాలని వినాలి. గీతలో నాలుగో అధ్యాయంలో ఇదే విధానం అర్జునుడికి కృష్ణుడు ఉపదేశించేడు. *"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా। ఉపదేక్ష్యన్తితే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః॥"* (4-34) అని శ్లోకం. *ప్రణిపాతేన* - ***బాగా వంగి నమస్కరించడంతోనూ***, *పరిప్రశ్నేన* - ***చక్కగా వినడంవల్లనూ***, *సేవయా* - ***కైంకర్యంవల్లనూ***, *తత్త్వదర్శినః* - ***ఆత్మస్వరూపాన్ని సాక్షాత్కరించుకున్న జ్ఞానినుండి ఆత్మని గురించిన జ్ఞానాన్ని పొందాలి*** అని ఇక్కడ గీతాచార్యుడి ఉపదేశం.

ఇక్కడ శ్రీదేశికులు ఒకవిషయాన్ని ఆశ్చర్యకరంగా సాయించేరు అదేమిటంటే, ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. ఆత్మనిగురించినతెలివిని పెద్దవారినుండి వినాలి అని ఉపదేశించిన భగవానుడికి తాను అర్జునుడికి సరిగా ఉదేశించలేదని అనుకున్నాడా? లేక అర్జునుడే భగవానుడు చేసిన గీతోపదేశాన్ని సరిగ్గా వినలేదా? అంటే, ఇక్కడ భగవానుడూ, శాస్త్రార్థాలని చక్కగా చెప్పేడు, అర్జునుడూ మంచి ఆదరంతోనే వింటూవచ్చేడు. ఇక్కడ భగవానుడిచేత చెప్పబడిన అర్జునుడిచేత వినబడిన అర్థాలన్నింటినీ పరమవేదాంత సారభూతమైన అర్థవిశేషాలుగా ఉన్నందువల్ల వీటిని ఒకరు ఒకవిధంగా చెప్పగా మరొకరు వినేటప్పుడు అర్థంచేసుకున్నదన్నట్టుగా తోస్తుంది. కాని ఒకసారి వింటే, మనస్సులో బాగా నిలవదు. అంచేత ఈఅర్థవిశేషాలని విని మనస్సులో పెట్టుకోవాల్సిన పద్ధతిని ఇక్కడ అర్జునుడికి భగవానుడు చెప్తున్నాడు.

పెద్దలదగ్గర వేదాంతార్థాలు విన్నప్పుడు వాటిని వాటికి తగిన ప్రకారం వినాలి. వాటిని ఎలా వినాలి, ఎలాఎలా వినకూడదో అన్నదాన్ని శాస్త్రజ్ఞులు ఎన్నోవిధాలుగా చెప్పిఉన్నారు. ఉదాహరణంగా కొన్ని విషయాలని చెప్పుకుందాం. గోడకి అవతల దాక్కొని వినకూడదు. అలా వింటే, అది ప్రయోజనకారిగాదు అని శాస్త్రజ్ఞులు నిర్ధారించేరు. పుస్తకాలు చదివి తెలుసుకోవచ్చుగదా అంటే, అదికూడా కూడదు. ఎంతోమంది పెద్దలు సాయించిన గ్రంధాలన్నీ ఇప్పుడు పుస్తకాలుగా ప్రకాశింపబడుతున్నాయి.

వాటిని చదివి విషయాలని తెలుసుకొనవచ్చుగదా అంటే అలా కుదరదు.

నంజీయరువారివద్ద పెఱ్ఱి అని ఒక శిష్యులుండేవారు. వీరు నంజీయరుదగ్గర ఎన్నో గ్రంధాలని కాలక్షేపం చేసినవారు. కాని నాచ్చియార్ తిరుమొழி కాలక్షేపం చెయ్యలేదు. స్వామిదగ్గర వీరు "***దాసుడికి మళ్ళీమళ్ళీ కాలక్షేపం ఉండిపోయింది ఏఊరికి దాసుడు వెళ్ళినా దేవరవారి సంబంధం ఉండడంవల్ల దాసుడిదగ్గిరకి చాలామంది ఎన్నో సందేహాలతో ప్రశ్నిస్తున్నారు. వాటన్నింటికీ సమాధానం చెప్పేటట్లు దేవరవారు దాసుడిని అనుగ్రహించి కటాక్షించాలి***" అని ప్రార్థించేరు. స్వామికూడా, అలాగే కానీయి అని అనేసిఊరుకున్నారు. ఒకసారి ఎక్కడో పైఊరులో వెళ్ళిన వీరిదగ్గరకి కొంతమంది "***తలైయల్లాల్ కైమ్మాఱిలేనే***" అన్న నాచ్చియార్ తిరుమొழி పాశురభాగానికి అర్థం అడిగితే, వీరుకూడా (విద్వాంసుడు గనుక) తనకి తెలియదని చెప్పవీలుగాక పూర్తిగా కుదరని ఒక అర్థాన్ని చెప్పేరు. అంటే శరీరంలో ఉత్తమాంగంగా ఉన్నది తలగనుక భగవానుడు వచ్చేటట్లు ఈకోకిల కూసిందంటే, తన తలని నరికి ఆకోకిలకి ఇచ్చినట్లుగా ఆండాళ్ చెప్పినట్లుగా సాయించేరు. ఇలా చెప్పినా, వారిమనస్సులో మాత్రం ఇది సరియైన అర్థంగాదనిపించింది. తర్వాత "***కోకిల కూసి ఎంబెరుమానుడువస్తే తన తలని దానికాళ్ళమీద పెట్టి సేవిస్తాను***" అన్నదే ఆండాళ్ మనసుకి తగిన అర్థం అని ఒక పెద్దాయనదగ్గర సరైన అర్థాన్ని గ్రహించేరు. అప్పుడు వారికి తోచింది - ఆచార్యుడికటాక్షమాత్రంవల్లనే అన్ని అర్థాలనీ తెలుసుకొనాలి అంటే కుదరదు. ఆచార్యుడిదగ్గర కైంకర్యంచేసి అర్థవిశేషాలని గ్రహించాలి అని. అంచేత ఒక అక్షరం వదలకుండా ఒక పంక్తి వదలకుండా ఆచార్యుడిదగ్గర ఉంటూండి, వారికి శుశ్రూషచేసి కాలక్షేపం చేసి, అర్థగ్రహణం చెయ్యాలి. ఇలా వినడమే "***శ్రోతవ్యః***" అన్నది.

ఇది ఒకపద్ధతి. ఇలా ఆచార్యుడిదగ్గర ఉండి, కైంకర్యం చేస్తూ విన్న అర్థవిశేషాలని ఏకాంతంగా ఒక చోట ఉండి, మననం చెయ్యాలి. పూర్వావలోకనం ఆచార్యుడికీ, ఉత్తరావలోకనం శిష్యుడికీ అని ఒక నియమాన్ని మన పెద్దలు ఏర్పాటు చేసేరు. శిష్యుడికి కాలక్షేపం సాయించడానికి ముందు ఆచార్యుడు పూర్వావలోకనం చెయ్యాలి. లేకపోతే కాలక్షేపం కాలక్షేపం గాదు. అలాగే కాలక్షేపంతర్వాత శిష్యుడు ఉత్తరావలోకనం చెయ్యాలి. ఇదే ***మంతవ్యః*** అన్నది. ఆతర్వాత హృదయకమలంలో దివ్యదంపతులని వాళ్ళతిరుకల్యాణగుణాలని ధ్యానం చెయ్యాలి. ఈధ్యానం ముదరాలి అంటే, దర్శన సమానాకారం కలుగుతుంది అంటారు మన పూర్వాచార్యులు.

ఇలా "***ఆత్మా వా అరే ద్రష్టవ్య శ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః***" అని వేదాన్త వాక్యం ఉన్నా, శ్రవణం, మననం, ధ్యానం, దర్శనం అనే ఈకర్మవల్లనే నాలుగు కృత్యాలూ మనకి ఉండాలి. "***ఆత్మా వా అరే ద్రష్టవ్యః***" అని మొదట్లోనే శబ్దం ఉన్నాకూడా, మన ఆచార్యులు దాన్ని మార్చిఉన్నారు. పాఠక్రమం ఇలా ఉన్నా, అర్థక్రమాన్ని అనుసరించి, పాఠక్రమాన్ని మార్చుకొన్నారు మన పెద్దలు. ఇది పూర్వమీమాంసా న్యాయసిద్ధమైన విషయం. అర్థక్రమంప్రకారం శ్రవణమననధ్యానదర్శనాలని చెప్పినట్లు ఉన్న వాక్యం ఈబృహదారణ్యకఉపనిషద్వాక్యం.

ఈవచనార్థాన్ని మనస్సులో ఉంచుకున్న శ్రుతప్రకాశికాచార్యులవారు ఒక ఆశ్చర్యకరమైన శ్లోకాన్ని

సాయించేరు. *"శ్రుత్యన్తేషు శ్రుతం భాష్యే మతం ధ్యాతం హృదమ్బుజే। లక్ష్మీధరం ప్రపద్యే తత్ దృష్టం శ్రీరంగధామని॥"* అని. అంటే, దేంతో మనం వినాలంటే, వేదాంతాలని వినాలి. దేన్ని మనం మననం చెయ్యడం అంటే, శ్రీభాష్యాన్ని మననం చెయ్యాలి. ఎక్కడ ధ్యానం చెయ్యడం అంటే, హృదయకమలంలో ధ్యానించాలి. చివరగా శ్రీరంగంలోనే దర్శనం అంటున్నారు మన పూర్వాచార్యులు. శ్రీరంగంలో దర్శనమా లేక పరమపదంలో దర్శనమా అంటే, పరమపదంలోకాదు శ్రీరంగంలోనే అంటున్నారు. 'అచ్చువై పెఱినుమ్ వేణ్డేన్" అన్న ఆళ్వార్లమార్గంలో వచ్చినవారు మన పూర్వాచార్యులు. పరమపదంలో సర్వేశ్వరుడిని సేవించడం అనేది నిత్యమైన పురుషార్థం. కాని ఈభూమండలంలో శ్రీరంగంలోనే దర్శనాన్ని చెప్పేరు మన పెద్దలు. ఈమనోభావాన్ని అనుసరించి తమ వ్యాఖ్యానంలో (స్వామి ఎంబెరుమానార్లు సాయించిన దివ్యగ్రంథమైన వేదార్థసంగ్రహానికి వ్యాఖ్యానమై ఉన్న తాత్పర్యదీపికలో) శ్రుతప్రకాశికాచార్యులవారు ఈఆశ్చర్యకరమైన అభిప్రాయాన్ని చూపించేరు.

ఇలా శ్రవణం చేసి, దానిమూలంగా జ్ఞానాన్ని పొందుతున్నామే, ఇదే శాస్త్రజన్యజ్ఞానం. శాస్త్రాభ్యాసం చేసి, దానివల్ల పొందవలసినది శాస్త్రజన్యజ్ఞానం. ఈజ్ఞానంతోటే తరువాత ఉపాసనం చెయ్యాలి.

ఆదిశంకరులు ఉపాసనం తర్వాత జ్ఞానం అన్నారు. శ్రవణ, మనన, ధ్యానాలనన్నింటినీ వారుకూడా అనుసరించేరు. వీటిని చేసే భేదవాసనని పోగొట్టుకోవడం. భేదవాసన తొలిగితేనే "తత్త్వమసి' అన్న వాక్యజన్యజ్ఞానం - అద్వైతజ్ఞానం - కలుగుతుంది. వాక్యజన్యజ్ఞానం రాలేదంటే భేదవాసన పోలేదనినీ, ఎందుకు భేదవాసన పోలేదంటే, శ్రవణమననధ్యానాదులని చెయ్యలేదన్నమాట అన్నారు శంకరులు. కనుక ధ్యానం ముందు, ధ్యానం తర్వాత జ్ఞానం అన్నది ఆదిశంకరుల పక్షం.

మన స్వామి ఎంబెరుమానార్ల మతం అలాక్కాదు. మన మతంలో జ్ఞానం ముందు, ధ్యానం తర్వాత. స్వామి వేదార్థసంగ్రహంలో మొదటమొదట్లోనే ఈవిషయాన్నే తెలియజేసేరు. *"జీవపరయాథాత్మ్య జ్ఞానపూర్వక....'*అని. జీవాత్మనిగురించి, పరమాత్మనిగురించీ శాస్త్రంవల్ల యథార్థాన్ని చక్కగా తెలుసు కోవాలి. దీనివల్ల కలిగే జ్ఞానంతో *"వర్ణాశ్రమధర్మ ఇతికర్తవ్యతాక పరమపురుషచరణయుగళధ్యానార్చన ప్రణామాదిః అత్యన్తప్రియః తత్ప్రాప్తిఫలః"* అని ఇదే పరమవేదాన్తసిద్ధాంతం అని స్వామి వేదార్థ సంగ్రహంలో ప్రారంభంలోనే తెలియజేసేరు. జీవాత్మ పరమాత్మ జ్ఞానం ముందు, ధ్యానం తరవాత అని స్వామి ఎంబెరుమానార్ల పక్షం. ఇలా శాస్త్రజన్యజ్ఞానాన్ని పొంది, దాంతో కర్మయోగాన్ని అంగంగా అనుష్ఠించి తదనుగుణంగా ధ్యానం చెయ్యాలి. ఈధ్యానమార్గమే ఉపాసనమార్గం.

ఈ ఉపాసనమార్గమైన జ్ఞానవిశేషం కరణసాపేక్షం. మనస్సులేకపోతే ధ్యానంచెయ్యడం సాధ్యంగాదు. పరమాత్మని తెలుసుకున్నాం. పరమాత్మని ధ్యానం చేస్తున్నాం. వీటన్నింటినీ మనస్సుతోనే చెయ్యాలి. అంచేత ఈమూడో అధ్యాయంలో చెప్పబడ్డ విషయి అనే భగవదుపాసనం - జ్ఞానం కరణ సాపేక్షం. ఇది ఎవరినిగురించినది అంటే, పరమాత్మనిగురించినది. సద్విద్య, దహరవిద్య, శాణ్డిల్యవిద్య,

భూమవిద్య మొదలైన విద్యల్లో ఆయా విద్యల్లో ఉపాసింపబడే పరమాత్మతాలూకు ఆయా కల్యాణగుణాలే ఉపాస్యాలు.

ఒక్కొక్కవిద్యలోనూ ఒక్కొక్క కల్యాణగుణంగలవాడిగా పరమాత్మ ఉపాసింపబడుతాడు. ఇలా ఒక్కొక్కవిద్యకీ ఆవిద్యకుండే అసాధారణమైన కల్యాణగుణం వేరువేరుగా చెప్పబడింది. దీనికి అర్థం ఏమిటి? ఉపాస్యగుణభేదంచేత ఉపాసనభేదం తప్ప అన్ని ఉపాసనలూ నారాయణుడిని గురించినవే. ఈయనగురించే 32 విధాలైన భక్తిమార్గాలూ ఉన్నాయి. "లిజ్గభూయస్త్వాత్" అని దీనికోసమే ఒకసూత్రం చెప్పేరు శ్రీవేదవ్యాసులవారు. ఏయే శబ్దాలతో వేదాంతం జగత్కారణాన్ని చెప్పినాకూడా, ఆయాశబ్దాలతోనే చెప్పబడినవాడు నారాయణుడే అన్నదివేదాంతార్థాన్ని పుణికిపుచ్చుకున్నవాళ్ళ సిద్ధాంతం.

ఇలా విద్యల్లో భేదమున్నప్పటికీ అందరూ ఈవిద్యలద్వారా నారాయణుడిని ఉపాసించేటప్పుడు విద్యాభేదాన్ని ఎలాతీసుకోవాలి? ఒకేసర్వేశ్వరుడిని ఉపాసిస్తున్నారు. ఒకేసర్వేశ్వరుడు అనుగ్రహిస్తున్నాడు. ఆసర్వేశ్వరుడి కటాక్షంవల్లనే అందరికీ మోక్షం వస్తోంది. విద్యాభేదం ఏమిటంటే, ఇక్కడ భేదం ఉపాస్యభేదం. సద్విద్యానిష్ఠుడు ఏకల్యాణగుణవిశిష్టుడైన భగవానుడిని ఉపాసిస్తున్నాడో, దహరవిద్యా నిష్ఠుడు భగవానుడిని అటువంటి కల్యాణగుణవిశిష్టుడిగా ఉపాసించడం కుదరదు. దహరవిద్యానిష్ఠుడు ఏకల్యాణగుణవిశిష్టుడిగా సర్వేశ్వరుడిని ఉపాసిస్తున్నాడో భూమవిద్యానిష్ఠుడు సర్వేశ్వరుడిని అటువంటి కల్యాణగుణవిశిష్టుడిగా ఉపాసించడు.

అలా ఆయా ఉపాసనకి తగినట్లుగా ఆయా ఉపాస్యరూపాలుంటాయి. వేద్యాకారం ఉంటుంది. అని ఉపాస్యగుణభేదాన్ని బట్టి ఉపాసనభేదమే తప్ప, మరొకటేమీ కాదు. పరమాత్మవిషయంలో వీడు చేసే ఉపాసనం కరణసాపేక్షంగా ఉన్నది. నాలుగోఅధ్యాయంలో పరమపదంలో లభించే పరిపూర్ణ బ్రహ్మానుభవం చెప్పబడింది. ఇదికూడా ధ్యానమే. ఇదికూడా విషయియే.

కాని వ్యత్యాసం ఏమిటంటే, ఇది కరణనిరపేక్షమైఉంటుంది. పరమపదంలోకి వెళితే, అక్కడ ఎంబెరుమానుడిని అనుభవిస్తున్న కాలంలో జీవాత్మ అనేవాడు శరీరంతో పరమాత్మని అనుభవించాలా? లేక శరీరం లేకుండానే అనుభవించాలా? సశరీరత్వం మోక్షమా? లేక అశరీరత్వం మోక్షమా? అన్నదాన్ని విచారించేరు శ్రీవేదవ్యాసులవారు.

పరమపదంలో శరీరం ఉంటుందంటారొకరు. అక్కడ శరీరంఅంటూ ఉండదంటారు మరొకరు. ఈరెండింటినీ అంగీకరిస్తున్నానన్నారు వ్యాసులవారు. పరమపదంలో ముక్తజీవుడు శరీరంతోఉండి పరమ పదంలో సర్వేశ్వరుడిని అనుభవించవచ్చు. శరీరం లేకుండా కూడా ఉండవచ్చు. పరమపదంలో శరీరం ఉండదని వేదాంతం చెప్పిందంటే, పరమపదంలో ప్రాకృతమైన హేయశరీరం ఉండదని అభిప్రాయం.

అంచేత ఉపాస్యం అంటూ వస్తున్నప్పుడు మనస్సు అనే ఒకదాంతోనే ఉపాసనం. పరమపదంలో

ఉన్న పరిపూర్ణబ్రహ్మానుభవం కరణనిరపేక్షంగానూ ఉండవచ్చు, కరణసాపేక్షంగానూ ఉండవచ్చు. అంతే కాదు. ఈలోకంలో ఉపాసించేవాడి ఉపాసనానికి భగవానుడి సమస్తకల్యాణగుణాలూ వివక్షితాలుగావు. కొన్ని కల్యాణగుణాలే విషయం. కాని పరిపూర్ణబ్రహ్మానుభవం లభించినప్పుడు ఉపాసనకాలంలో విషయంకాని కల్యాణగుణాలుకూడా అనుభవవిషయాలవుతున్నాయి. పరిపూర్ణబ్రహ్మానుభవంలో విషయంకాని కల్యాణగుణమే లేదు.

ఇలా మూడో అధ్యాయంలో చెప్పబడిన ఉపాసనం ఈలోకంలోది. నాలుగో అధ్యాయంలో చెప్పబడ్డ పరిపూర్ణబ్రహ్మానుభవం పరమపదంలోది. అది కరణసాపేక్షం. ఇది కరణనిరపేక్షం. అది ఒక్కొక్క కల్యాణ గుణవిశిష్టుడైన పరమాత్మని విషయంగా కలిగినది. ఇది సమస్తకల్యాణగుణవిశిష్టుడైన పరమాత్మని అనుభవ విషయంగా కలిగినది. ఈమూడు, నాలుగు అధ్యాయాల్లో చెప్పబడినది విషయి అన్న జ్ఞానం అన్నా, ఉపాసనాత్మకమైన జ్ఞానానికీ, పరిపూర్ణబ్రహ్మానుభవమైన జ్ఞానవిశేషానికీ ఉండే వ్యత్యాసం తెలుసుకోవాలి.

### *22. బ్రహ్మం జిజ్ఞాస్యం అనే విషయం.*

శ్రీవేదవ్యాసులవారు *"బ్రహ్మ జిజ్ఞాసా"* - బ్రహ్మని విచారిస్తున్నాను - అని ఆరంభించేరు. వారు ఇక్కడ *"జిజ్ఞాసా"* అన్న పదప్రయోగం చెయ్యడంలో ఉన్న పరమతాత్పర్యం ఏమిటి అన్నది మనం చూద్దాం. ఇక్కడ *"బ్రహ్మాన్ని విచారించడం సాధ్యమా?"* అనే ప్రశ్న వస్తోంది. బ్రహ్మం అనేది *"చిన్మాత్రస్య స్వయంప్రకాశత్వేన"* అంటే జ్ఞానమే శరీరంగా ఉన్నది. జ్ఞానస్వరూపమైన - తెలివే శరీరమైన - బ్రహ్మమే ప్రకాశించడంవల్ల, దాన్ని మనం విచారించి తెలుసుకోవడం అనేది ఎలా? మన విచారం లేకుండానే - విచారాన్ని అపేక్షించకుండానే, బ్రహ్మం స్వయంప్రకాశవస్తువై ఉన్నందువల్ల దానికి విచార్యమాణత్వం ఎలా సిద్ధిస్తుంది? *"బ్రహ్మం విచారణీయం"* అని వ్యాసులవారు చెప్పడంవల్లనే బ్రహ్మం చిన్మాత్రం మాత్రం గాదు బ్రహ్మం జ్ఞానానికి విషయం అని తెలుస్తోంది.

ఎంబెరుమానార్లు శ్రీభాష్యారంభంలోనే ఈవిషయాన్ని వివరించి చూపించేరు. "నాధమునుల కారిక" అనబడే నాధమునుల వచనాన్నింతటినీ ఉదాహరించి చూపేరు. *"జ్ఞానరూపం పరంబ్రహ్మ తన్నివర్త్యం మృషాత్మకమ్। అజ్ఞానంచేత్ తిరస్కుర్యాత్ కః ప్రభుః తన్నివర్తనే॥"* అని మొదటి శ్లోకం. అంటే, జ్ఞానంవల్ల నశింపజేసే, నశించే, అజ్ఞానంఅనేది జ్ఞానస్వరూపమైన బ్రహ్మాన్ని ఎలా దాస్తుంది? ఇక్కడ అజ్ఞానం పరమాత్మకా లేక జీవాత్మకా అన్నది విచారం. మన సంప్రదాయానికీ, అద్వైతసంప్రదాయానికి ఉన్న వ్యత్యాసం ఏమిటి? అజ్ఞానాన్ని వాళ్ళు ఎవరికి చెప్తున్నారు? మనం ఎవరికి చెప్తున్నాం? ఈవిషయాలు చూడాల్సినవి. పరమాత్మకి అజ్ఞానం అంటారు అద్వైతులు. సంసారి జీవాత్మకిఅజ్ఞానం అని మన సిద్ధాంతం. జ్ఞానస్వరూపమైన పరమాత్మకి అజ్ఞానాన్ని ఎలా చెప్పడం కుదురుతుంది? సూర్యుడు చక్కగా ఉదయించి ప్రకాశిస్తూంటే అక్కడ చీకటి ఎలా ఉంటుంది? దీన్ని *"సహానవస్థాలక్షణవిరోధం"* అంటారు. *"తేజస్సు, చీకటి ఎలా ఒకేచోట ఉండానికి వీలవుతుంది? ఇదేం అబద్ధవాదం?"* అంటారు మన పూర్వులు. అద్వైతుల్లోనే ఈవిషయంలో రెండుపక్షాలున్నాయి. ఒకటి పరమాత్మకే అజ్ఞానాన్ని చెప్పగల పక్షం.

మరొకటి జీవాత్మకి కల్పించబడిన బ్రహ్మకి మాత్రం అజ్ఞానాన్ని చెప్పే పక్షం. వీటిలో పరమాత్మకి అజ్ఞానాన్ని చెప్పే పక్షాన్ని ఖండించేరు నాథమునులు.

*"జ్ఞానరూపం పరంబ్రహ్మ తన్నివర్తకం మృషాత్మకమ్"* - అంటే జ్ఞానస్వరూపమైన బ్రహ్మాన్ని జ్ఞానంతో నశించాల్సిన అజ్ఞానం మూస్తుందంటే, తనపక్కకి వచ్చిన అజ్ఞానాన్ని బ్రహ్మం తనవల్లనే పోగొట్టడం సాధ్యంగాదంటే, అటువంటి అజ్ఞానాన్ని ఎవరివల్ల పోగొట్టడానికి సాధ్యం? అని అడుగుతున్నారు నాథమునులు. దీనికి అద్వైతులు ఏమిటంటారంటే - అజ్ఞానంవల్ల వచ్చి చేరిన కల్పితమైన జీవుడు - వీడు తనకి కలిగే శాస్త్రజన్యఅద్వైతజ్ఞానంతో పరమాత్మకి వచ్చిఉన్న అజ్ఞానాన్ని పోగొట్టుతున్నాడని. ఇది అబద్ధంకంటే అబద్ధమైన వాదం. ఈవాదంకంటే పరమాత్మకి అజ్ఞానాన్ని చెప్పే వాదమే మేలనిపిస్తుంది. పరమాత్మకున్న అజ్ఞానాన్ని జీవాత్మ పోగొడుతున్నాడనడంకంటే అబద్ధమైన కుతర్క మైన వాదం ఒకటి ఉంటుందా? ఇందులో సంసారం ఎవరికి? మోక్షం ఎవరికి?

ఎంబెరుమానార్లమతం ప్రకారం జీవాత్మకి సంసారం, అజ్ఞానం, మోక్షం అనేవన్నీని. పరమాత్మకారుణ్యంవల్ల మనకున్న అజ్ఞానం పోతోంది. కనుక, బ్రహ్మం జిజ్ఞాస్యం - విచారింపతగినది అని వ్యాసులవారు సాయించడంవల్ల ***"మన జ్ఞానానికి విషయం పరమాత్మ"*** అన్నది స్పష్టం అవుతోంది. బ్రహ్మం అవేద్యం, అవాచ్యం, అనే అద్వైతవాదంలా కాకుండా, బ్రహ్మం జ్ఞానానికి విషయమైంది, శబ్దానికి విషయమైంది, అన్నది ఆళ్వారులూ, వారిననుసరించిన మన పూర్వాచార్యులూ వాళ్ళ శ్రీసూక్తులద్వారా విస్తారంగా నిరూపించి ఉన్నారు.

*"యతో వాచో నివర్తన్తే"* అన్న వేదాంతవాక్యానికి అభిప్రాయం ఏమిటి? ఆనందమయుడైన పరమాత్మ ఆనందాన్ని కొలవడానికి ప్రయత్నించి అది వాక్కుకీ, మనస్సుకీ అందనిది అని చెప్పి నివృత్తిని పొందింది వేదాంతం. అద్వైతాచార్యులు వేదానికి పరమాత్మఆనందం ఇంత అని తెలుసుకోవడం సాధ్యంకాలేదన్న ఈవాక్యానికి ఏమి వ్యాఖ్యానం చేసేరంటే బ్రహ్మం నిర్గుణం. ఆనందం అనే గుణమే బ్రహ్మకి లేదు, ఉంటే గదా వాక్కుకి అందడానికి అంటారు. వాక్కుకి అందలేదంటే, ***"ఏమీ లేదు, అంచేత వాక్కుకి అందలేదు"*** అని అద్వైతులవాదం.

కాని మన ఆచార్యులు ఇలా చెప్పలేదు. వాళ్ళుసాయించిన వివరణం ఏమిటంటే, ***బ్రహ్మంతాలూకు ఆనందం అనే కల్యాణగుణమనేది "పరిచ్ఛేదరాహిత్యాత్" అని చెప్పతగినదిగా ఇంత అని కొలిచి తెలుసు కోవడానికి సాధ్యంగానిదిగా ఉండడంవల్ల వేదాంతానికి కొలిచి తెలుసుకుందికి సాధ్యంగాలేదు. "గుణం అపారంగా ఉండడంవల్లే వాక్కుకీ, మనస్సుకీ అందలేదు"*** అన్నది మన ఆచార్యులు చూపే పరమార్థం.

వేదాంతంలో ఈవాక్యం ఏప్రకరణంలో వస్తోంది అన్నది చూద్దాం. వేదాంతంలో ఇది ఆనందాన్ని పెంచుతూ వచ్చిన ప్రకరణం. "ఇది మనుష్యానందం, దీనికంటె పెద్దది దేవతానందం. దానికంటె పెద్దది ఇంద్రుడి ఆనందం. దానికంటే పెద్దది బృహస్పతి ఆనందం, దానికంటే పెద్దది చతుర్ముఖుడి ఆనందం"

అని ఆనందాన్ని పెంచుతూ వచ్చిన మాట చెప్పి, చివరికి "బ్రహ్మానందం వాక్కుకీ, మనస్సుకీ అందదు" అని సాయించే ప్రకరణం. ఇలా కాకుండా, అద్వైతులచెప్పేదే వేదాంతసిద్ధమై ఉండి ఉంటే, ఈప్రకరణం ఎలా ఉండి ఉంటుంది? అంటే, 'నూటికి ఒక వంతు ఈ ఆనందం, అందులో నూరింటిలో ఒక వంతు ఆఆనందం, అందులో నూరోవంతు ఈఆనందం, అందులో నూరోవంతు ఆఆనందం" అంటూ ఆనందాన్ని మెట్లుమెట్లుగా తక్కువచేస్తూ తీసుకువచ్చి, చివరికి బ్రహ్మానందం శూన్యం అని పూర్తిచెయ్యవలసివస్తుంది. ఈ ప్రకరణం మాత్రం ఇలాలేదు. ఇది అపకర్షప్రకరణమా లేక ఉత్కర్షప్రకరణమా అనిప్రశ్నిస్తున్నారు శ్రుతప్రకాశికాచార్యుల వారు. పరమాత్మ అపరిమిత వైభవశాలియై ఉన్నందువల్ల ఆతని గొప్పదనం వాక్కుచేతనూ, మనస్సు చేతనూ చెప్పడంగాని, తలంచడంగాని కుదరలేనిది అనిఅర్థం అని ఈవేదాంతవాక్యానికి అర్థం సాయించేరు మన ఆచార్యులు. ఇలా సూత్రప్రబంధారంభంలోనే, *'బ్రహ్మజిజ్ఞాస్యం'* అని శ్రీవేదవ్యాసులవారు సాయించడం అద్వైతమతానికి కుదిరినదిగాదు.

### 23. బ్రహ్మవిచారహేతుత్వనిరూపణం.

శ్రీభాష్యారంభంలో *"అధీతసాంగసశిరస్కవేదస్య అధిగత అల్పాస్థిరఫలకేవల కర్మజ్ఞానతయా సంజాత మోక్షాభిలాషస్య అనంతస్థిరఫలబ్రహ్మజిజ్ఞాసా హ్యనంతరభావినీ"* అని ఒకవాక్యం ఉన్నది. ఈ వాక్యాన్ని శ్రీభాష్యం చివరివరకూ మనం మనస్సులో ఉంచుకోవాలి. మరవడానికి వీల్లేని మరవకూడని అతిముఖ్యమైన వాక్యం ఇది. దీని అర్థాన్ని మొదట వివరిస్తున్నాను.

*"స్వాధ్యాయోఽధ్యేతవ్యః"* అని వేదం అధ్యయనాన్ని విధిస్తోంది. ఈఅధ్యయనం సాంగ సశిరస్కవేదాధ్యయనం అవాలి. అంగాలతో వేదాన్ని అధ్యయనం చెయ్యాలి. వేదశిరస్సు వేదాంతం. దాన్నికూడా అధ్యయనం చెయ్యాలి. *"శ్రావణ్యాం ప్రోష్ఠపద్యాం వా ఉపాకృత్య యథావిధి। యుక్త ఛందాంసి అధీయీత మాసాన్ విప్రః అర్థపంచమాన్॥"* అనిన్నీ, *"అథఊర్ధ్వం తు చతుర్మాసి శుక్లేషు నియతః పఠేత్। వేదాంగానిచ సర్వాణి కృష్ణపక్షేషు సంపఠేత్॥"* అనిన్నీ మనుభగవానుడు చెప్పేడు. ఒక సంవత్సరంలో 5-1/2 మాసాలపాటు వేదాన్ని అధ్యయనం చెయ్యాలి. వేదాధ్యయనం ఈసమయంలో ఆరంభించాలి, ఈకాలంలో పూర్తిచెయ్యాలి, అని కాలనియమాలున్నాయి. ఉపాకర్మనాడు వేదాధ్యయన కాలారంభం. మనం ఈకాలనియమాలప్రకారం నడుచుకోవడంలేదుగనుక దీనికి ప్రాయశ్చిత్తంగా గాయత్రీ మహామంత్ర జపం, "కామోకార్షీత్" మంత్రజపం - ఇవన్నీ శాస్త్రంలో విధింపబడ్డాయి. వేదవేదాంతాలని అధ్యయనం చేస్తున్నప్పుడు ఫలానా పక్షంలో అంగాధ్యయనం చెయ్యాలి అనే నియమాలు ఏర్పాటై ఉన్నాయి.

ఈపద్ధతిలో ఒకడు వేదాధ్యయనం చేసేడు. సాంగవేదాధ్యయనం చేసేడు. సశిరస్కవేదాధ్యయనం చేసేడు. అంటే వేదాన్ని మాత్రం అధ్యయనం చేసి ఊరుకోలేదు. వేదాన్ని వేదాంతంతోబాటు అధ్యయనం చేసేడన్నమాట. వేదవేదాంతాలని మాత్రం అధ్యయనం చెయ్యలేదు. అంగాధ్యయనాన్నికూడా చేసేడు. *"అధీతవేదస్య - అధీత సాంగవేదస్య - అధీత సాంగసశిరస్క వేదస్య"* అన్నారు స్వామి.

శీక్షా, వ్యాకరణం, ఛందస్, నిరుక్తం, జ్యోతిషం, కల్పం అని ఆరు వేదాంగాలు. శ్రీరంగరాజస్తవంలో

పరాశరభట్టర్‌వారు ఈఆరంగాలకీ ప్రయోజనం (ఉత్తరశతకం - 18) ఏమిటన్నదాన్ని సాయించేరు. దీన్ని అనుసరించి, దేశికులుకూడా శ్లోకం సాయించేరు. శిక్షామొదలైన ఆరంగాలతో ఒకడు వేదాధ్యయనం చేసేడంటే, వేదవేదాంతభాగాల్లో "**ఆపాతప్రతీతి**" కలుగుతుంది. "**ఆపాతప్రతీతి**" అంటే - నిశ్చయబుద్ధి లేని, సంశయవిపర్యయాలకి అనుగుణమైన వాటితోఉన్న జ్ఞానం - అని అర్థం. పూర్వభాగమైన వేదమైతేనేమి, ఉత్తరభాగమైన వేదాంతమైతేనేమి, ఈరెండింటినీ అధ్యయనం చేసిఉండడంవల్ల దానికనుగుణంగా అంగాధ్యయనంకూడా చేసి ఉండడంవల్ల, దీనివల్ల కలిగిన జ్ఞానం అనేది, యథార్థమైన - నిజమైన - జ్ఞానంగా ఉండకుండా, ఆపాతప్రతీతిగా ఉండడంవల్ల, ఇటువంటి ఆపాతప్రతీతి గలవాడికి వెంటనే ఒక ఆశకలుగుతుంది. ఏదో కొంచెం తెలిసింది, బాగా తెలుసుకుంటే ఏమిటి అని తోచి మీమాంసలో - విచారంలో - దిగడం ఆరంభిస్తాడు.

ఇలా మీమాంసలో దిగడం అన్నది విధిప్రయుక్తంగాఉండడం పనికిరాదు. "***రాగాత్ మీమాంసతే***" అన్నమాట. అంటే, రాగప్రయుక్తమై ఉండాలంటున్నారు మనపూర్వులన్నమాట. అంచేతే, శ్రీవేదవ్యాసులవారు మొదటి సూత్రంలో "***జిజ్ఞాసా***" అన్న పదప్రయోగం చేసేరు. "***జ్ఞాతుం ఇచ్ఛా జిజ్ఞాసా***" అంటే తెలుసుకోవాలి అనే కోరిక - అని మన పూర్వుల నిరూపణం. ఇలా ఆశకి అనుగుణమైన జిజ్ఞాస అనే పదప్రయోగాన్ని చెయ్యడంవల్ల విచారం చెయ్యాలి అనే ఇచ్ఛచేతనే, నిర్బంధంవల్ల కాదు అని తెలుస్తోంది. ఇలా ఆపాతప్రతీతి ఎవళ్ళకి వచ్చిందో, వాడు విచారం చెయ్యడానికి ముందుకి వస్తాడు. వాడు రాగప్రయుక్తంగా విచారం చెయ్యడానికి వస్తున్నాడు. ఆపాతప్రతీతి ఎవళ్ళకి వస్తుంది? అంగాలతోబాటు క్రమంగా వేదవేదాంతాలని అధ్యయనం చేసినవారికే వస్తుందన్నది సంప్రదాయ సిద్ధమైన అర్థం.

ఇందులో మొట్టమొదట ఏవిచారంలో దిగుతున్నాడంటే, కర్మవిచారంలో. బ్రహ్మవిచారానికి ముందు రాలేదు. దేశికుల(ఆచార్యుడి)వద్ద శిష్యులు ప్రశ్నిస్తారు. "***స్వామీ! వీడు వేదభాగాన్నికూడా అధ్యయనం చేసేడు. వేదాంతభాగాన్నీ అధ్యయనం చేసేడు, రెండింటికీ అనుగుణంగా అంగాధ్యయనంకూడా చేసేడు, ఇలా అంగాధ్యయనం చేసినవాడికి వేదభాగమైన క్రమభాగంవల్లకూడా ఆపాతప్రతీతి కలిగింది. వేదాంతమైన బ్రహ్మభాగంలోకూడా ఆపాతప్రతీతి కలిగింది. ఇలా రెండుభాగాల్లోనూ ఆపాతప్రతీతి వస్తే, వాడు కర్మవిచారాన్ని మొదట చెయ్యడానికి ఎందుకు వచ్చేడు? బ్రహ్మవిచారాన్నే ముందర చేస్తే ఏమి?***" అంటే, కర్మవిచారం తర్వాతే బ్రహ్మవిచారం అని ఎందుకు చెప్తున్నాడు? మొదట కర్మవిచారానికి ఎందుకు వెళ్తున్నాడు? అని ప్రశ్న.

దీనికి సమాధానం దేశికులు అత్యద్భుతంగా సాయించేరు. ఇలా రాగంతో విచారం ప్రసక్తమైంది వీడికి అనాదిసంసారసంబంధంవల్లనే మొట్టమొదట త్రివర్గంలో(ధర్మ, అర్థ, కామాల్లో) ప్రావణ్యప్రసక్తం అవడంవల్ల తత్ప్రతిపాదకమైన వేదభాగాన్ని మొదట విచారిస్తున్నాడు అన్నారు దేశికులు. ధూళి కంటిలో పడితే మనకన్ను వెంటనే మూసుకోవడం మనం చూస్తున్నాం. ఒకణ్ణి ఎవళ్ళైనా కొట్టడానికి వస్తే, వాడు వెంటనే పరుగు పెడతాడు. దీనికంతటికీ అనాదికాలవాసనే కారణం. ఇదే రుచివాసన, అవిద్యావాసన అని అంటాం. ఇది అనాదికాలంగా ఒకసంసారిజీవుడికి కలిగే వాసన. పిల్లవాడు పుట్టేడు. పుట్టగానే ఆకలిచేత ఏడుస్తాడు. పిల్లడికి ఆకలి ఎలా తెలుస్తుందంటే, అది అనాదికాలంగా అలవాటైన విషయం.

మొదట కర్మవిచారానికెందుకు వెళ్తున్నాడంటే, అనాదికాలంగా పుత్ర పశు అన్నాదులనే అనుభవించి అనుభవించి జన్మపరంపరల్లో చిక్కుకుపోవడంవల్లనే. వీడు ఒకసారికూడా మోక్షంలో అభినివేశం పొందడం కలగలేదు. మోక్షంలో ఆశకలిగి అలవాటుపడితేగదా అందులో రుచి, వాసన కలుగుతాయి! వీడికి అనాదికాల ప్రవృత్తి మోక్షఫలంలోకాదు. శబ్దస్పర్శరూపరసగంధాలైన ఈఐదువిషయాలనే అనాదికాలంగా అనుభవించి, ఈకారణంవల్ల కర్మాన్నిగురించి కొంచెం తెలుసుకున్నందువల్ల, దానిమీదున్న రుచివల్లా, దాన్ని పూర్ణంగా తెలుసుకుంటే, పూర్ణఫలాన్ని పొందవచ్చు అనే ఆశవల్లనే కర్మవిచారంలో దిగుతున్నాడు. కర్మవల్ల ఒకసారికూడా నిత్యమైన ఫలం లభించదన్న నిశ్చయబుద్ధివచ్చిన తర్వాత బ్రహ్మవిచారం చెయ్యడానికి వస్తున్నాడు అంటున్నారు సూత్రకారులు.

దీన్నే *"అధిగత అల్పాస్థిరఫల కేవలకర్మజ్ఞానతయా"* అన్నారు స్వామి. అంటే, కర్మవిషయక అల్పాస్థిరఫలక నిర్ణయం అవసరం అవుతోంది. మొదట కర్మవిచారం చేసి ఈకేవల (బ్రహ్మజ్ఞానసంబంధం లేని) కర్మలు అల్పాలైన, అస్థిరాలైన (నశ్వరాలైన) ఫలాలనే ఇవ్వగలవి అని తెలుసుకుంటున్నాడు. తరువాత (అనంతరభావినీ) వీడికి *"సంజాత మోక్షాభిలాషస్య అనంతస్థిరఫలబ్రహ్మజిజ్ఞాసా"* కలుగుతోంది. అంటే, మోక్షాన్ని పొందాలి అనే కోరిక పుడుతోంది. అనంతమైనదీ, స్థిరమైనదీ అయిన ఫలరూపంగా ఉండే బ్రహ్మాన్ని తెలుసుకోవాలి అనే కోరిక కలుగుతోంది.

ఇలా కర్మవిచారం పూర్వవృత్తం. దీనికి కారణం *"సాంగ సశిరస్క వేదస్య ఆపాతప్రతీతిః"* బ్రహ్మవిచారం ఉత్తరకృత్యం - అంటే, కర్మవిచారానంతరం కర్తవ్యం. దీనికి హేతువు *"కర్మణాం అల్పాస్థిర ఫలత్వ నిర్ణయ సహిత - అనంతస్థిరఫల ఆపాతప్రతీతిః"* అని నిర్ణయించబడుతోంది.

ఇలా బ్రహ్మవిచారంలో దిగే అధికారికి - ఉండవలసిన గుణాలు - 1. కర్మవిచారాన్ని చేసి, ఈకర్మలు అల్పాస్థిరఫల కేవలకర్మలు అన్న జ్ఞానం కలగాలి. ఎన్ని కర్మలని, ఎన్ని సంవత్సరాలు చేసినా, దానివల్ల నిత్యమైన మోక్షపురుషార్థం లభించదు అనే నిశ్చయబుద్ధికూడా సాంసారికఫలాల్లో నిర్వేదం, (వైరాగ్యం) కలిగినవాడిగా ఉండాలి. 2. అనంతస్థిరఫలమైన మోక్షంలో కోరికగలవాడై, అనంతస్థిరఫల ఆపాతప్రతీతి గలవాడై ఉండాలి. అంటే, బ్రహ్మాన్ని గురించిన ఆపాతప్రతీతి - బ్రహ్మాన్ని గురించిన కొంత జ్ఞానం. ఏదో కొంచెం అర్థం తెలిసిందిగనుక నిరతిశయ ఆనందస్వరూపుడైన ఆనందమయుడైన పరమాత్మని పరిపూర్ణంగా పొంది అనుభవించాలనే కోరిక.

ఇటువంటివాడిని విశిష్ట అధికారి అంటారు శ్రుతప్రకాశికాచార్యులవారు. ఇలా పూర్వకాండలో చెప్పబడిన అర్థాన్ని గురించిన నిశ్చయబుద్ధి (*"కర్మణాం అల్పాస్థిరఫలత్వ నిర్ణయసహిత"*), ఉత్తరకాండలో చెప్పబడిన అర్థాన్నిగురించిన ఆపాతప్రతీతి (*"అనంతస్థిరఫల ఆపాతప్రతీతిః"*) అనే ఈరెండుగుణాలనీ మొదటి సూత్రంలో *"అథ" "అతః"* అన్న రెండు శబ్దాల పరమార్థంగా స్వామితాలూకు వెనక చెప్పిన శ్రీసూక్తి వివరిస్తోందంటారు శ్రుతప్రకాశికాచార్యులవారు. దాసుడు వెనక చెప్పినప్రకారం స్వామితాలూకు ఈశ్రీసూక్తి

చాలా ముఖ్యమైనది.

మన స్వామి చూపించిన ఈఅర్థవిశేషాలన్నీ శ్రీవేదవ్యాసులవారు *"అథాతో బ్రహ్మ జిజ్ఞాసా"* అన్న మొదటి సూత్రంలో వారు భావించిన (అనుకున్న) అర్థాలే. ***అథ= కర్మవిచారం తర్వాత, అతః= కర్మవిచారం చేసినందువల్ల, బ్రహ్మజిజ్ఞాసా = బ్రహ్మవిచారః ("కర్తవ్యః" అన్న పదాన్ని అధ్యాహారం చేసుకొని) చెయ్యతగినది*** అని ప్రతిజ్ఞావాక్యం. పక్షసాధ్యాలని చెప్పేవాక్యం ప్రతిజ్ఞావాక్యం. సాధ్యవిశిష్టపక్షబోధక వచనమే ప్రతిజ్ఞావాక్యం. బ్రహ్మజిజ్ఞాసా అథ అని ప్రతిజ్ఞ - ఇక్కడ బ్రహ్మవిచారం కర్తవ్యం అన్నది ప్రతిజ్ఞ కాదు. కర్మవిచారం తర్వాత కర్తవ్యం అన్నదే ప్రతిజ్ఞ అంటారు పెద్దలు. దానికి కారణం చెప్తోంది అతః అని. కర్మవిచారహేతుకత్వాత్ అన్నమాట. ఇలా ధర్మవిచారానికి ఎలా వేదాధ్యయనం పూర్వవృత్తమో, అలాగే బ్రహ్మవిచారానికి కర్మవిచారం నియమేన పూర్వవృత్తం అన్నమాట.

ఈవిషయాన్ని కొంచెం వివరించుకుందాం. ఇది శ్రుతప్రకాశికాచార్యులవారు చూపించిన అర్థవిశేషం. అంటే, సూత్రం అంటే ఒక అనుమానప్రకారం చెప్పాలి. 'కొండమీద నిప్పు ఉన్నది - పొగ వస్తూండడంవల్ల." అని చెప్పినట్లుగా, ఇక్కడ సూత్రంలో పక్షం ఏది? సాధ్యం ఏది? హేతువు ఏది? అని అన్నీ చూపించాలి. *"వేదార్థమఱుదియిడువదు స్మృతీతిహాసపురాణఙ్గళాలే* - ***వేదార్థం నిశ్చయం చెయ్యడం స్మృతి ఇతిహాస పురాణాలవల్లనే****"* అని శ్రీవచనభూషణసూత్రం. ఈసూత్రంలో అనుమానాలన్నింటినీ చూపిస్తున్నారు మన పూర్వాచార్యులు. వేదార్థం అంటే ఏమిటి? నిశ్చయించడం అంటే ఏమిటి? 'ఇతిహాసాలతో - ధర్మశాస్త్రాలతో" అంటే ఏమిటి? పక్షం ఏది? సాధ్యం ఏది? హేతువు ఏది? అని అంతా చూపించేరు. అలాగే, *"అథ', "అతః"."బ్రహ్మ", "జిజ్ఞాసా"* అన్నవన్నీ ఏమిటి అన్నది నిరూపించాలి. ఈసూత్రంలో *"కర్తవ్యః"* అని చేర్చుకోవాలి. ***(బ్రహ్మజిజ్ఞాసా - బ్రహ్మవిచారః కర్తవ్యః")*** అతః = కర్మవిచారం జరిగిందిగనుక అని అర్థం. అథ అన్నది సాధ్యసమర్పకం. బ్రహ్మజిజ్ఞాసా అన్నది పక్షవాచకం. అతః అన్నది హేతువాచకం అని ఈమూడింటినీ సంగతంగా చూపించేరు శ్రుతప్రకాశికాచార్యులవారు అనుమాన ప్రకారంగా శ్రుతప్రకాశికలో.

శ్రుతప్రకాశికాభట్టర్ ఇంకా సాయించినదేమిటంటే - బ్రహ్మవిచారం కర్తవ్యంఅన్నది మాత్రమే కాదు. బ్రహ్మవిచారం అనంతర కర్తవ్యం. అనంతరకర్తవ్యమే సాధ్యంతప్ప, కర్తవ్యం మాత్రం సాధ్యంగాదు అంటున్నారు స్వామి. కర్మవిచారం చేస్తూన్నందువల్ల కర్మవిచారానికి తర్వాతనే బ్రహ్మవిచారం. దీనికి అర్థం ఏమిటి? ఒకడు 50 సంవత్సరాలముందు కర్మవిచారం చేసేడు. కర్మవిచారం చేసిన 50 సంవత్సరాలకి బ్రహ్మవిచారం చెయ్యడానికి వస్తున్నాడంటే అదే లభించదు అంటున్నారు శ్రుతప్రకాశికాచార్యులవారు. కర్మవిచారం చేసినవెంటనే బ్రహ్మవిచారం. ఎంచేతంటే, కర్మవిచారంవల్ల కర్మలన్నీ అనిత్యమైన ఫలాలనే ఇస్తాయి అనే నిశ్చయబుద్ధిని కలిగిఉన్నాడు. బ్రహ్మవిషయంలో కలిగిన ఆపాతప్రతీతిని నిశ్చయబుద్ధిగా మార్చుకున్నవెంటనే బ్రహ్మవిచారాన్ని చెయ్యాలేతప్ప, ఎప్పుడో ఒక కాలవిశేషంలో కర్మవిచారం చేసి, మరొకప్పుడు బ్రహ్మవిచారం చేస్తామంటే కుదరదు. 'కర్తవ్యః" అన్నదే ఇక్కడ ముఖ్యమైన సాధ్యాంశం. ఈఅర్థాలని చూపించేటట్టుగానే "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" అన్న మొదటి సూత్రం.

అద్వైతులు బ్రహ్మవిచారానికి కర్మవిచారం పూర్వవృత్తంగా తీసుకోలేదు. వాళ్ళు సాధన చతుష్టయాన్నే బ్రహ్మవిచారానికి పూర్వవృత్తంగా చెప్తారు. అధికరణసారావళిలో దేశికులు అద్భుతంగా ఒక విషయాన్ని సాయించేరు. అదేమిటంటే, కొంతమంది రాహుమీమాంసకులుగా ఉన్నారు. కొంతమంది కబన్ధమీమాంసకులుగా ఉన్నారు. అని మీమాంసకులని రెండు విధాలుగా విభజించేరు. శిరస్సుని మాత్రం పట్టుకున్నాడు ఒకడు. వాడు రాహు మీమాంసకుడు. శరీరాన్నిమాత్రం పట్టుకున్నవాడు మరొకడు. వాడు కబంధమీమాంసకుడు. వేదభాగాన్ని మాత్రం అంగీకరించి, వేదాంతభాగాన్ని వదిలేసేరు కబంధ మీమాంసకులు. వేదాంతభాగాన్ని మాత్రం పట్టుకుని వేదభాగాన్ని వదిలేసేరు శంకరుల్లాంటి వాళ్ళైన రాహుమీమాంసకులు. ఇలా కాకుండా, తల, శరీరం అంతటినీ పట్టుకుని (కర్మవిచారం, బ్రహ్మవిచారం) ఆరాధనవిశిష్టమైన ఆరాధ్యమైన బ్రహ్మన్నే ఈమీమాంసాశాస్త్రమే ప్రశంసిస్తోందని ఏకార్థాన్ని నిరూపించడానికున్నారు శ్రీఆళవందార్లవంటి మహాచార్యులు.

"***అథాతశబ్ద భాష్యేణ రాహుమీమాంసకో జితః***" అన్న ఒకవచనం ఈనిజాన్ని తెలియజేస్తోంది. అథ = కర్మవిచారం తర్వాత, అతః= కర్మవిచారం చేసినందువల్ల, అనే ఈరెండు శబ్దాలతో, వ్యాసులవారు ఎవళ్ళని జయించేరు అంటే, రాహుమీమాంసకులని. కర్మవిచారానికి తర్వాత అని వారు సాయించేరుగనుక, కర్మమీమాంసే అవసరంలేదనే రాహుమీమాంసకులైన అద్వైతులవంటివారి పక్షాన్ని వారు నిరసించేరన్నది స్పష్టం.

జిజ్ఞాసాధికరణశ్రీభాష్యం చాలా విపులంగా ఉన్నది. ఇందులో మొత్తం 24 విషయాలని సాయించేరు మన స్వామి ఎంబెరుమానార్లు అని ఒక లెక్క. సాధారణంగా ఒక అధికరణం అని చెప్తే దానికి భాష్యంలో ప్రతిజ్ఞ, సూత్రం, ఉపోద్ఘాతం, సూత్రార్థం, విషయవాక్యం, పూర్వపక్షం, సిద్ధాంతం అన్నీ సాయించాలి. స్వామి ఒక్కొక్క అధికరణభాష్యంలోనూ, అధికరణార్థాన్నీ, సూత్రార్థాన్నీ, సాయించి వెంటనే, అధికరణంలో ఏమిటి విషయవాక్యం, ఏమిటి సందేహం, పూర్వపక్షం ఏమిటి, సిద్ధాంతం ఎలా ఉన్నది అని అన్నింటినీ వరసగా చెప్పేరు. కాని మొదటి అధికరణంలో మాత్రం, ఈక్రమాన్ని అనుసరించలేదు. మొదటి అధికరణంలో ఉపోద్ఘాతం, సూత్రార్థం చెప్పినవెంటనే, సూత్రకారులు ఈసూత్రాన్ని సాయించినప్పుడు పూర్వపక్షిగా ఎవరు వచ్చేరు, వాళ్ళు చేసిన పూర్వపక్షం ఏమిటి, వ్యాసులవారు చెప్పిన సిద్ధాంతం ఏమిటి, వంటి విషయాలని సాయించాలి. కాని మన స్వామి ఈవిషయాలని ఈఅధికరణశ్రీభాష్యంలో చివరికి ఉంచేసేరు.

ఈఅధికరణంలో పూర్వపక్షి ఎవరు అన్నది ప్రశ్న. ప్రభాకరులు - మీమాంసకుడే పూర్వపక్షి. అతడినే పూర్వపక్షిగా చేసుకొని, అతనికి సమాధానం సాయించేరు శ్రీవేదవ్యాసులవారు. "పారాశర్య విజయం" అన్న బ్రహ్మసూత్రవ్యాఖ్యానగ్రంథంలో చోళసింహపురం చండామారుతం దొడ్డాచార్యస్వామి "***ఈ మొదటిసూత్రం ద్వారా శ్రీవేదవ్యాసులవారు ప్రభాకరులని మాత్రమే ఖండించలేదు, మృషావాదినీ, శైవుడినీకూడా ఖండించేరు***" అని అన్నారు. ఇది ఎలా తెలిసిందంటే, మీమాంసకుడిని ఖండించడం, అనేది సూత్రార్థాన్ని చూసినప్పుడే స్పష్టంగా తెలుస్తుంది. సూత్రంలో బ్రహ్మశబ్దం ఉండడంవల్ల, ఇందులో మృషావాదులకి అవకాశమే లేదనే కారణంవల్లనే శైవుడికికూడా ఇందులో అవకాశమే లేదు అనే

తెలుసుకోవచ్చుంటున్నారు దొడ్డాచార్యస్వామి. ఇలా శ్రీవేదవ్యాసులవారి బ్రహ్మశబ్ద ప్రయోగంవల్లనే మృషావాదుల పక్షం, శైవులపక్షం ఖండించబడుతోంది అన్నారు. శ్రీభాష్యమంగళశ్లోకవ్యాఖ్యానంలో శ్రుతప్రకాశికాచార్యులవారు *"శ్రీనివాసశబ్దేన పాశుపతాది వ్యుదాసః"* అని వ్రాయించేరు. అంటే, *"బ్రహ్మణి శ్రీనివాసే"* అన్నప్పుడున్న శ్రీనివాసశబ్దంతోనే పాశుపతులు మొదలైనవాళ్ళు నిరసింపబడుతున్నారు అని అక్కడ వ్యాఖ్యానం.

మీమాంసకుల్లో ప్రభాకరులు *"సిద్ధార్థాన్ని శబ్దం చూపదు. అంచేత వేదాంతవాక్యాలు సిద్ధవస్తువైన బ్రహ్మన్ని బోధించదు. కనుక, సాంగసశిరస్క వేదాధ్యయనం చేసినవాడికి వేదాంతభాగంలో ఆపాతప్రతీతే కలగదు. అంచేత విశిష్ట హేతువు సిద్ధించదు. కనుక, బ్రహ్మవిచారం ఆరంభించతగినది కాదు"* అని పూర్వపక్షం చేసేరు. *"కర్మవిషయకమైన నిశ్చయబుద్ధి కలిగినా, బ్రహ్మవిషయకమైన ఆపాతప్రతీతి ఉంటేగదా విచారం అవసరం. విశిష్ట హేతువులో విశేషాంశం ఉన్నప్పటికీ, విశేష్యాంశం లేదుగనుక బ్రహ్మవిచారం కర్తవ్యంగాదు. సిద్ధబ్రహ్మంలో శబ్దానికి వ్యుత్పత్తి లేదు"* అన్నది పూర్వపక్షి వాదం.

ఇక్కడ శ్రీవేదవ్యాసులవారు *"సిద్ధవస్తుబోధకత్వం శబ్దానికి ఉన్నది"* అని సిద్ధాంతాన్ని వ్రాయించేరు. కనుక, సిద్ధబ్రహ్మపరమైన వేదాంతభాగంలో బ్రహ్మవిషయక ఆపాతప్రతీతిఉన్నది. అందులో నిశ్చయబుద్ధి కలగాలి అనే కోరికవల్ల విచారంలో దిగేడు. కనుక బ్రహ్మవిచారం కర్తవ్యం అని స్పష్టమౌతోంది. శ్రీవేదవ్యాసులవారి పూర్వపక్ష సిద్ధాంతాలు ఇవే అని మన స్వామి ఎంబెరుమానార్లు శ్రీభాష్యంలో చూపించేరు. ఈవిషయం *"బ్రహ్మజిజ్ఞాసా అథ అతః"* అన్న సూత్రశబ్ద స్వారస్యంవల్లనే స్పష్టం అవుతోంది.

శ్రీజైమినిభగవానుడు వేదభాగాన్ని విచారించి న్యాయకలాపాలని చూపి, వేదభాగార్థాన్ని నిర్ణయించి కర్మమీమాంస అనే సూత్రగ్రంధాన్ని వ్రాయించేరు. దాన్ని మనం సేవించి, "కర్మం అల్పాస్థిరఫలకం" అనే నిర్ణయాన్ని పొందడానికి ప్రాప్తం. అయినా, జైమినిభగవానుడు వ్రాయించిన సూత్రప్రబంధానికి ముందున్నవారు కర్మవిషయక అల్పాస్థిరఫలకనిర్ణయాన్ని ఎలా పొందేరన్న ఒక శంక రావచ్చు. దీనికి పరిహారాన్నికూడా మన పూర్వులు చూపించేరు. శ్రీజైమినివంటివారు ప్రతిభాశాలులు. ముందర మీమాంసాశాస్త్రం లేకపోయినా, వాళ్ళప్రతిభావిశేషంవల్ల వేదార్థాలని నిర్ణయించేరు. వాళ్ళకి వేదం స్వతఃప్రమాణం. అదే నిరపేక్షప్రమాణం. మీమాంసాదినిరపేక్షంగానే అది స్వార్థాలని ప్రకాశింపజేస్తుంది. ఇలాగే అందరూ మీమాంసానిరపేక్షంగానే వేదార్థాలని నిర్ణయించవచ్చే అని చెప్పడానికి వీల్లేదు - అందరూ జైమినులు కారుగదా! ప్రతిపత్తకుల ప్రతిపత్తిమాంద్యంవల్ల వేదార్థాలు విపరీతంగా తోచవచ్చు. కనుక, సంసారులమీది కరుణచేత జైమిని తనతర్వాత వచ్చేవాళ్ళు కర్మవిషయనిశ్చయబుద్ధిని పొందడానికి సూత్రప్రబంధం వ్రాయించేరు. *"విచారసాగరే సంప్లవమానానాం జైమిన్యా యత్ కర్ణధారాయితం స ఏష క్షమ్యతాం అపరాథః"* అని శతదూషణిలో దేశికులు వ్రాయించినది ఇక్కడ గ్రహించతగినది. *"ప్రజ్ఞాపరాధ ప్రశమనరుచిభిః సూరిభిః సూత్రక్లుప్తేః"* అని మీమాంసాపాదుకలోకూడా వ్రాయించేరు శ్రీదేశికులు.

కర్మలు అనంతస్థిరఫలకాలు అని పూర్వపక్షం చేసి, కర్మలు అల్పాస్థిరఫలకాలు అని కర్మకాండలో

ఎక్కడ సిద్ధాంతం చెయ్యబడింది అంటే, సంవత్సరమంతా చాతుర్మాస్య ఆవృత్తి విధించబడింది. దీనివల్ల ఏమిటి స్పష్టం అవుతోందంటే, ఆవృత్తివల్ల కర్మలకి అక్షయఫలత్వం లేదని. కర్మలకి అక్షయఫలత్వం ఉండేఉంటే, ఆవృత్తివైయర్థ్యం వస్తుంది. కనుక, కర్మం అల్పాస్థిరఫలం అన్న బుద్ధి ఫలిస్తోంది పూర్వకాండవిచారంవల్ల అన్నమాట. ఇవన్నీ మొదటి సూత్రంలో అథ శబ్దంవల్ల చూపుతున్నారు శ్రీవేదవ్యాసులవారు.

దీనివల్ల ఏమిటి తెలిందంటే, - వేదాన్తాలు సిద్ధబ్రహ్మాన్ని చూపేవిగనుక, సిద్ధబ్రహ్మవిషయక ఆపాతప్రతీతి ఉన్నవాడు, కర్మం అల్పాస్థిరఫలం అనే నిశ్చయబుద్ధి గలవాడు, బ్రహ్మవిషయకనిర్ణయం పొందడానికి బ్రహ్మవిచారం చెయ్యాలి అని. కనుక, అథ అన్న పదానికి కర్మవిచారం తర్వాత అని అర్థం తెలినందువల్ల కర్మబ్రహ్మవిచారాలకి పౌర్వాపర్యం ఇలాగే చెప్పబడింది.

పూర్వమీమాంసలో పౌర్వాపర్యనిర్ణాయకప్రమాణాలు శ్రుతి, అర్థ, పాఠ, స్థాన, ముఖ్య, ప్రవృత్తి కర్మలు అని ఆరు విధాలుగా చెప్పబడ్డాయి. అవి ఏమిటంటే,

1. *"పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్ నాస్త్య అకృతః। తద్విజ్ఞానార్థం స గురుమేవ అభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥ తస్మై స విద్వాన్ ఉపసన్నాయ సమ్యక్ ప్రశాన్త చిత్తాయ సమాన్వితాయ। యేనాక్షరం పురుషం వేదసత్యం ప్రోవాచతాం తత్వతో బ్రహ్మవిద్యామ్॥"* అని ముండకోపనిషద్వాక్యాలు (1-1-12, 13). ఇవి కర్మవిచారం పూర్వవృత్తంగానూ, బ్రహ్మవిచారం ఉత్తరకృత్యం అనీ చూపిస్తున్నాయి. ఇది శ్రౌతకర్మం.

2. సంసారులకి త్రివర్గప్రావణ్యం స్వరసం. అంచేత దాన్ని నిర్ణయించడానికి మొట్టమొదట, కర్మవిచారంలో దిగుతాడు. ఇది "కర్మం అల్పాస్థిరఫలం" అనే నిర్ణయాన్ని కలిగిస్తుంది. తర్వాత బ్రహ్మవిచారానికి వస్తాడు. ఇది అర్థక్రమం.

3. వేదవేదాంతాలు అన్న పాఠం ఉన్నదిగనుక, వేదాంతవిచారం ముందరిది, వేదాంతార్థ విచారం తరువాతిది అన్నది పాఠక్రమం.

4. "ఇషేత్వా" అని ప్రారంభించి "బ్రహ్మణే మహిమానమిత్యుపనిషత్" అన్నంతవరకూ గదా అధ్యయనం ఉన్నది. ఈ వ్యాఖ్యేయానికి ఇలా క్రమం ఉండడంవల్ల, ముఖ్యంగా దీని క్రమాన్ని అనుసరించి, దీనికి వ్యాఖ్యానమైన పూర్వోత్తరమీమాంసలకీ ఇదే క్రమం అనుసరించతగినది. వ్యాఖ్యేయ శేషమే వ్యాఖ్యానం. కనుక, ముఖ్యక్రమాన్ని చూసినా, కర్మవిచారం పూర్వం, బ్రహ్మవిచారం ఉత్తరం అన్నది స్పష్టం. ఇదే ముఖ్యక్రమం.

5. ధర్మప్రమాణమైన వేదాన్ని అధ్యయనం చెయ్యడానికి మొట్టమొదట గురుకులం వెళ్తాడు. అధ్యయనం చేస్తాడు. అక్షరరాశిని గ్రహిస్తాడు. ఈప్రవృత్తులకి తర్వాత బ్రహ్మవిచారానికి వస్తాడు. ఇది

ప్రవృత్తి క్రమం.

6. వేదాధ్యయన అనంతరకాలం కర్మవిచారకాలం అవుతుంది. దానికి స్థానం అక్కడే. దానికి తర్వాతే, బ్రహ్మవిచారానికి స్థానం. ఇది స్థానక్రమం.

ఇలా ఆరువిధాలైన కర్మనియామక ప్రమాణాలవల్ల పౌర్వాపర్యం సిద్ధించడంవల్ల "అథాతో బ్రహ్మ జిజ్ఞాసా" అన్నప్పుడు ఉన్న అథ శబ్దానికి కర్మవిచార ఆనంతర్యాన్ని అర్థంగా చెప్పడం చాలాతగిఉన్నది అని స్పష్టం అవుతోంది.

ప్రస్తుతం కర్మవిచారం చేసి బ్రహ్మవిచారం చెయ్యడం అని అనుష్ఠానం కనబడలేదే అని ఒక ఆక్షేపం వస్తోంది. దానికి సమాధానం మూడువిధాలుగా సాయించేరు మన పూర్వులు.

1. మీమాంసాప్రకరణగ్రంధాలతో పూర్వమీమాంసాశాస్త్రార్థాలని తెలుసుకొని బ్రహ్మవిచారానికి రావాలి.

2. అథవా సూక్ష్మబుద్ధిమంతులైన శిష్యులు ఆచార్యుడినుండి కర్మకాండార్థాలని సూక్ష్మంగా తెలుసుకొని బ్రహ్మవిచారం చెయ్యవచ్చు.

3. అథవా శారీరకార్థం ఉపదేశించేటప్పుడే ఉపయుక్తపూర్వమీమాంసాశాస్త్రార్థాలనికూడా కలుపుకునే ఉపదేశించప్రాప్తం. వీళ్ళు అముఖ్యాధికారులు. మొదట చెప్పబడినవాడే ముఖ్యాధికారి.

ఎలా అయినా, కర్మ బ్రహ్మ విచారాలకి నియతపౌర్వాపర్యం, పూర్వోత్తర శాస్త్రాలకి ఐక్యం, బ్రహ్మవిచార ఆరంభణీయత్వం అనే అర్థత్రయం అక్షతం అన్నమాట. "అర్థైకత్వాత్ ఏకం వాక్యం సాకాంక్షంచేత్" అని సాయించేరు జైమిని పూర్వమీమాంసలో. సాకాంక్షమై ఏకార్థప్రతిపాదకం పూర్వోత్తరకాండలు అన్నమాట. పూర్వభాగాన్ని సేవించేటప్పుడు అక్కడ చెప్పబడిన కర్మలకి ఆరాధ్యుడు ఎవడు అన్న ఆకాంక్ష కలుగుతుంది. దానికి శాంతి ఉత్తరకాండ విచారంవల్లనే. కాని, పూర్వకాండోక్త కర్మలకి అంగి ఏది, అనే శంక పూర్వకాండమాత్రదర్శనంవల్లనూ, ఉత్తరకాండోక్తబ్రహ్మవిద్యకి అంగం ఏది అనే శంక ఉత్తరకాండమాత్రదర్శనంవల్లనూ కలుగుతుంది. ఈశంకలకి శాంతి కాండద్వయపరామర్శవల్లనే కలుగుతుంది. కనుక ఈరెండుకాండలూ పరస్పరసాపేక్షాలుగానే ఏకార్థప్రతిపాదకాలు. కర్మారాధ్యత్వవిశిష్ట బ్రహ్మప్రతిపాదకం అనిగాని, కర్మాంగత్వవిశిష్టబ్రహ్మవిద్యాప్రతిపాదకం అనిగాని ఐకార్థ్యం చెప్పవచ్చు. కనుక, మీమాంసాశాస్త్రం ఒకటే అని నిర్ధారితం. ఇలా శారీరక ప్రథమసూత్రప్రథమపదమైన అథశబ్దానికి కర్మవిచారానంతరం అని అర్థం అని మన స్వామి ఎంబెరుమానార్లు శ్రీభాష్యారంభంలోనే సాయించేరు.

*ఆళ్వార్ ఎంబెరుమానార్ జీయర్ తిరువడిగళే శరణమ్.*